


ESTD: 1999
www.voodayam.com

# వుదయం




హైదరాబాద్ | 28-03-2026శనివారం | సంపుటి : 27 | సంచిక : 25 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal | Follow us on




శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో కల్యాణ మహోత్సవం శుక్రవారం నాడు ఘనంగా జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గీత దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు

2



శ్రీరామనవమి సందర్భంగా అయోధ్యలోని రామ్ లల్లాను శుక్రవారం నాడు ప్రధానమంత్రి మోడీ సందర్శించుకున్నారు. సూర్య తిలకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

# రూ. 217 కోట్ల జీఎస్టి శ్కాం

## నగరంలో డిజిజిఐ అధికారుల తనిఖీల్లో వెల్లడి

**హైదరాబాద్, మార్చి 27 (ఎఎంస్) :** తెలుగు రాష్ట్రాల్లో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డిజిజిఐ) అధికారులు భారీ జీఎస్టి కుంభకోణాన్ని బయటపెట్టారు. హైదరాబాద్ కేంద్రంగా సాగుతున్న ఈ దందాపై పక్కా సమాచారంతో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏకంగా రూ.217 కోట్ల మేర పన్ను ఎగవేసినట్లుగా జరిగినట్లు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో




విస్తరించి ఉన్న

మిగతా 2లో

# లాక్‌డౌన్ పుకార్లు నమ్మొద్దు

## కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి

- ప్రధాని మోడీ నాయకత్వంలో దేశంలో ఎటువంటి ఇంధన కొరత లేకుండా చూస్తున్నాం
- కీలకమైన సరఫరాలు ఆటంకం లేకుండా లభించేలా చూడడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం
- గత నెలలో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధర బ్యారల్‌కు రూ. 70 నుండి రూ. 122 వరకు పెరిగాయి

**పెట్రోలియం ఉత్పత్తులపై ఎగుమతి సుంకాల విధింపు • దేశంలో పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ. 10 సుంకం తగ్గింపు ఇది పెట్రోల్ కంపెనీల మేలు కోసమే**

**న్యూఢిల్లీ, మార్చి 27 (వుదయం) :** దేశవ్యాప్త లాక్‌డౌన్ వదంతులను కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి శుక్రవారం కొట్టిపారేశారు. ఆ వదంతులు పూర్తిగా అవాస్తవం అని పేర్కొంటూ, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నాల పట్ల ఆయన హెచ్చరించారు. భారత ప్రభుత్వం అటువంటి ప్రతిపాదనను పరిశీలించడం లేదు అని పూరి పేర్కొంటూ, పౌరులు ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా ఉండాలని కోరారు. ఇలాంటి పరిస్థితుల్లో పుకార్లు వ్యాప్తి చేసి, భయాందోళనలు సృష్టించే ప్రయత్నాలు బాధ్యతారహితమైనవి,హానికరమైనవి, అని ఆయన అన్నారు. ప్రపంచ ఇంధన అంతరాయాలకు సంబంధించిన ఆందోళనల నేపథ్యంలో ఈ వివరణ వెలువడింది. "మేము ఇంధనం, సరఫరా




గొలుసులు , నిత్యావసర వస్తువులకు సంబంధించిన పరిణామాలను నిజ సమయంలో నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ప్రధాని మోదీ నాయకత్వంలో, మన పౌరులకు ఇంధనం, శక్తి, ఇతర కీలకమైన సరఫరాలు నిరంతరాయంగా లభించేలా చూసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నా, అని పూరి ఎక్స్‌పై పోస్ట్ చేశారు. ఉద్భవిస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. ప్రపంచ అనిశ్చితుల నేపథ్యంలో భారతదేశం నిరంతరం స్థైర్యాన్ని ప్రదర్శించింది, అంతేకాక సకాలంలో, చురుకుగా,సమన్వయంతో వ్యవహరించడం ప్రభుత్వం కొనసాగిస్తుంది, అని ఆయన అన్నారు. పెరుగుతున్న ముడి చమురు ధరల ప్రభావాన్ని పట్టి చూపుతూ, గత నెలలో అంతర్జాతీయ ధరలు బ్యారెల్‌కు సుమారు రూ. 70 నుండి దాదాపు రూ. 122 కు పెరిగాయని మంత్రి తెలిపారు.

మిగతా 2లో

# దాడుల విరామం పొడిగింపు

## చివరి గడువు ఏప్రిల్ 6 గా ట్రంప్ ప్రకటన

- చర్చల పరిపూర్తికి ఇరాన్ మరింత సమయం కోరినట్టు వెల్లడి
- వారు నా ప్రతినిధుల ద్వారా నాతో చాలా మర్యాదగా మాట్లాడారు
- మరి కొంత సమయం ఇవ్వగలరా అని అడిగారు : ట్రంప్

**వుదయం డెస్క్, మార్చి 27:** పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమై దాదాపు నెలకావస్తున్న నేపథ్యంలో రియాద్‌లోనూ, సుసంపన్నమైన చమురు క్షేత్రాలు గల తూర్పు ప్రాంతంలోనూ రెండు డ్రోన్లను అడ్డుకున్నట్టు శుక్రవారం సౌదీ అరేబియా ప్రకటించింది. అంతకు ముందు మరో నాలుగు క్షిపణులను ప్రయోగించింది. ఈ ప్రాంతంలో గల యుఎస్ కేంద్రాలపై ఇరాన్ దాడులను ఉధృతం చేసింది. కాగా, టెహ్రాన్‌తో చర్చలు నిర్వహిస్తున్నామంటూ యుఎస్ ప్రకటించింది. అమెరికా-ఇజ్రాయెల్ దాడులు నివాస ప్రాంతాలను లక్ష్యంగా చేసుకోవడంతో ఇరాన్‌లోని ఖోమ్ నగరంలో కనీసం ఆరుగురు మరణించారని ఇరాన్ ఫ్రాస్ వార్తా సంస్థ తెలిపింది. గాయపడిన వారి సంఖ్య ఇంకా తెలియరాలేదని ఖోమ్ డిప్యూటీ గవర్నర్ తెలిపారు.

### ఒడ్డుకు కొట్టుకొచ్చిన థాయ్ నౌక

ఈ నెల ప్రారంభంలో హొర్ముజ్ జలసంధిలో ఇరాన్ దాడికి గురైన థాయ్ జెండా కలిగిన సరుకు రవాణా నౌక 'మయూరీ నారీ', ఖేష్మ్ ద్వీపంలోని రామ్‌చా గ్రామం సమీపంలో ఒడ్డుకు కొట్టుకొచ్చిందని ఇరాన్ మీడియా నివేదించింది. మార్చి 11న జరిగిన ఈ సరుకు రవాణా నౌక దాడిలో, దానిలోని ముగ్గురు సిబ్బంది గల్లంతయ్యారు.

మిగతా 2లో



నేను, మోడీ మాత్రమే కార్యశూర్యులం : ట్రంప్

5

# రూపాయి భారీ పతనం

**న్యూఢిల్లీ, మార్చి 27 (వుదయం :** ప్రపంచ ఉద్రిక్తతలు, పెరుగుతున్న చమురు ధరలు కరెన్సీపై ఒత్తిడిని తీవ్రతరం చేయడంతో, భారత రూపాయి శుక్రవారం నాడు తొలిసారి డాలర్‌కు 94 మార్కును దాటి, రికార్డు కనిష్ఠ స్థాయికి పడిపోయింది. రాయిటర్స్ నివేదిక ప్రకారం, అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి 94.1575కు బలహీనపడింది. ఈ వారం ప్రారంభంలో నమోదైన తన మునుపటి అత్యల్ప స్థాయి 93.98ను ఇది అధిగమించింది. గత నెల చివరలో పశ్చిమ ఆసియా సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి కరెన్సీ సుమారు 3.5 శాతం క్షీణించింది.

డాలర్ కు రూ. 94



### రూపాయి ఎందుకు పడిపోతోంది?

ప్రపంచ అనిశ్చితి, భారతదేశం దిగుమతులపై ఆధరపడిన ఇంధనం రెండింటి కలయికే రూపాయి బలహీనతకు ప్రధాన కారణం. పశ్చిమ ఆసియాలో కొనసాగుతున్న సంఘర్షణ, ఇంధన సరఫరాలో దీర్ఘకాలిక అంతరాయంఏర్పడుతుందనే భయాలను పెంచింది. దీనివల్ల ముడి చమురు ధరలు అధికంగా ఉన్నాయి, బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కుకు పైన కొనసాగుతోంది. తన ఇంధన అవసరాలలో అధిక భాగాన్ని దిగుమతి చేసుకునే భారతదేశానికి, అధిక చమురు ధరలు పెద్ద దిగుమతి బిల్లుకు దారితీస్తాయి.

మిగతా 2లో

# నేపాల్ ప్రధానిగా బాలేంద్ర షా



నేపాల్ నూతన ప్రధానిగా ఆర్ఎస్ పి నాయకుడు బాలేంద్రషా శుక్రవారం నాడు ప్రమాణ స్వీకారం చేశారు

5

# పార్టీ జెండా, అజెండా ఏప్రిల్ 25న

- తెలంగాణ భవిష్యత్ మార్చే దారి దీపం కాబోతున్నాం
- సర్వోదయ తెలంగాణేమా లక్ష్యం
- మేము పెట్టబోయే పార్టీ తెలంగాణ ఇంటి పార్టీ
- మా ఫోకస్ మొత్తం తెలంగాణ కోసమే
- మేము ఎవరికీ బీ టీమ్ కాదు.. తెలంగాణలో మాదే నంబర్ వన్ పార్టీ అవుతుంది
- ఏదైనా పని పట్టుకుంటే ఫలితం వచ్చే వరకు కూడా వదిలిపెట్టను
- గల్లీలోనూ కష్టపడగలను, ఢిల్లీలోనూ లాబీయింగ్ చేయగలను : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్, మార్చి 27 (ఎఎంస్) :** తెలంగాణ జాగృతి సంస్థ ను రాజకీయ పార్టీగా మార్చబోతున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. వచ్చే నెల 25న మేడ్చల్ లోని మునీరాబాద్ వేదికగా పార్టీ ఆవిర్భవ సభ ఉంటుందన్నారు. అదే రోజు పార్టీ జెండా, అజెండా ప్రకటిస్తామని చెప్పారు. శుక్రవారం శ్రీరామ నవమి సందర్భంగా నిజామాబాద్ నుంచి కవిత ఈ ప్రకటన చేశారు. తెలంగాణ భవిష్యత్ ను మార్చే దారి దీపంలా జాగృతి పార్టీ ఉంటుందన్నారు. సర్వోదయ తెలంగాణ కోసం తాము పనిచేస్తాని స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి యే మన రాష్ట్ర ప్రాంతీయ పార్టీగా, ప్రతి ఒక్కరి ఇంటి పార్టీగా ఉంటుందన్నారు. కొత్త పార్టీ ఏర్పాటు చేయగానే ఎవరికీ బీ టీమ్ అంటూ విమర్శలు చేసే సంస్కృతి ఉండటం బాధాకరమని చెప్పారు. తమ పార్టీ ఎవరికీ బీ టీమ్ కాదని...తమదే తెలంగాణలో నంబర్ వన్ పార్టీ అవుతుందని చెప్పారు. కుల, మత, వర్గాలకు అతీతంగా సర్వ జనుల కోసం పని చేస్తామని చెప్పారు. సర్వజనుల్లో వెలుగులు నింపేలా సర్వోదయ తెలంగాణ కోసం తమ పార్టీ పనిచేస్తుందన్నారు. తమ అజెండా ప్రాక్టికల్ గా, ప్రజల ఆమోదం పొందే విధంగా ఉంటుందన్నారు. ఇప్పటికే 50 కమిటీలు వేయటంతో పాటు మేధావులతోనూ చర్చలు జరుపుతున్నామని చెప్పారు.

మిగతా 2లో



శుక్రవారం నాడు హైదరాబాద్ లో ఘనంగా సాగిన శ్రీరాముని శోభాయాత్ర

# మెరుగుపడిన సోనియా ఆరోగ్యం

## ఒకటి రెండురోజుల్లో డిశ్చార్జి



**న్యూఢిల్లీ, మార్చి 27 (వుదయం) :** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని, ఒకటి రెండు రోజుల్లో ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేస్తారని వైద్యులు శుక్రవారం తెలిపారు. డెబ్బై తొమ్మిదేళ్ల ఆ నాయకురాలికి జ్వరం రావడంతో, మంగళవారం రాత్రి

మిగతా 2లో

# పిఎంలు, సిఎంల తొలగింపు బిల్లుల ప్యానల్ గడువు పొడిగింపు

**న్యూఢిల్లీ, మార్చి 27 (వుదయం) :** తీవ్రమైన ఆరోపణలపై వరుసగా 30 రోజులకు పైగా అరెస్టు అయి ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులను తొలగించేందుకు ఉద్దేశించిన మూడు బిల్లులను పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీకి తన నివేదికను సమర్పించడానికి మరింత సమయం ఇచ్చారు. 2026 పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి వారంలో మొదటి రోజు వరకు కమిటీకి లోక్‌సభ శుక్రవారం సమయం ఇచ్చింది. సాధారణంగా, వర్షాకాల సమావేశాలు జూలై మూడవ వారంలో ప్రారంభమవుతాయి. బీజేపీ నాయకురాలు అపరాజిత సారంగి అధ్యక్షతన ఉన్న ఈ కమిటీ మూడు బిల్లులను పరిశీలిస్తోంది.

మిగతా 2లో

# టీం ఇండియా స్ఫూర్తితో మెలుగుదాం

## పశ్చిమాసియా నేపథ్యంలో సిఎంలతో పరోక్ష సమావేశంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మార్చి 27 (వుదయం) :** త్వరలో ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాల ముఖ్యమంత్రులు మినహా దేశంలోని అన్ని రాష్ట్ర ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ప్రారంభమైన ఈ సమావేశంలో పశ్చిమాసియా సంఘర్షణ నేపథ్యంలో వారి సంసిద్ధతను, ప్రణాళికలను ఆయన చర్చిస్తున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా ప్రధానమంత్రి సమావేశంలో పాల్గొంటున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, ఛత్తీస్‌గఢ్ ముఖ్య మంత్రి విష్ణుదేవ్ సాయి, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, జమ్ము,కశ్మీర్ సిఎం ఒమర్‌అ బ్దుల్లా, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, మధ్యప్రదేశ్ము ఖ్యమంత్రి మోహన్ యాదవ్, ఝార్ఖండ్ – హేమంత సొరేన్, ఉత్తరాఖండ్ – పుష్కర్ సింగ్ ధామీ, గుజరాత్ – భూపేంద్ర పటేల్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ పాల్గొంటున్నారు. ప్రధానమంత్రి ప్రతి రాష్ట్ర ముఖ్యమంత్రితోనూ సంభాషించారు. ఈ సమావేశం పూర్తిగా టీం ఇండియా స్ఫూర్తిపై,



రాష్ట్రాల వ్యాప్తంగా ప్రయత్నాల సమన్వయం, స్ఫూర్తినందించడంపై దృష్టి పెడుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఇరాన్‌పై దాడి చేయడంతో ఫిబ్రవరి 28న ప్రారంభమైన పశ్చిమ ఆసియా సంఘర్షణపై ప్రధానమంత్రి ముఖ్యమంత్రులతో సమావేశం కావడం ఇదే మొదటిసారి.

# లాక్ డౌన్ పుకార్లు నమ్మొద్దు

**మొదటి పేజీ తరువాయి..**

దీని ఫలితంగా యూరప్, ఉత్తర అమెరికా, ఆగ్నేయాసియా, ఆఫ్రికా వంటి ప్రాంతాల్లో ఇంధన ధరలు 20 నుంచి 50 శాతం వరకు పెరిగాయని ఆయన పేర్కొన్నారు. సరఫరా, ధరల ఒత్తిళ్లను నియంత్రించేందుకు కేంద్రం పెట్రోలియం ఉత్పత్తులపై ఎగుమతి సుంకాలను కూడా విధించింది. విదేశాలకు ఎగుమతి చేసే ఏ రిఫైనరీ అయినా ఎగుమతి పన్ను చెల్లించాల్సి ఉంటుంది, అని ఆయన అన్నారు. ఈ చర్య దేశీయంగా తగినంత లభ్యతను నిర్ధారించడంలో సహాయపడుతుందని కూడా ఆయన తెలిపారు. ఇదిలా ఉండగా, దేశీయ వినియోగం కోసం పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.10 చొప్పున కేంద్ర ఎక్సైజ్ సుంకాన్ని తగ్గిస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. డీజిల్‌పై లీటరుకు రూ.21.5, ఏవియేషన్‌టర్బైన్ ఫ్యూయల్ (ఎటిఎఫ్)పై లీటరుకు రూ.29.5 చొప్పున ఎగుమతి సుంకాలను నిర్ణయించారు. అధికారిక నోటిఫికేషన్ల ప్రకారం, పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.3కి తగ్గించగా, డీజిల్‌పై సుంకాన్ని సున్నాకు తీసుకువెచ్చారు. ప్రపంచ చమురు రవాణాకు కీలక మార్గమైన హోర్ముజ్ జలసంధికి సంబంధించిన అంతరాయాలతో సహా, పశ్చిమ ఆసియాలోని ఉద్రిక్తతల కారణంగా తీవ్రమవుతున్న ప్రపంచ ఇంధన సంక్షోభం నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నారు. ఉద్భవిస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి భారతదేశం సిద్ధంగా ఉందని, ప్రపంచ అనిశ్చితుల నేపథ్యంలో సకాలంలో, చురుకుగా, సమన్వయంతో" వ్యవహరించడం కొనసాగిస్తుందని పూరి అన్నారు.

## మెరుగుపడిన సోనియాగాంధీ ఆరోగ్యం

**మొదటి పేజీ తరువాయి..**

సుమారు 10:22 గంటలకు సర్ గంగా రామ్ ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రి ఛైర్మన్ అజయ్ స్వరూప్ ప్రకారం, సోనియా గాంధీ ఆరోగ్యం 'చాలా మెరుగుపడిందిస, వైద్యపరంగా మెరుగుపడటాన్ని ప్రదర్శిస్తూ సౌకర్యవంతంగా ఉన్నారు. ఆమె అటూ ఇటూ నడుస్తున్నారు, అల్పాహారం కూడా తీసుకున్నారు. మొత్తం మీద ఆమె ఆరోగ్యం సజావుగా మెరుగుపడుతోంది. ఒకటి రెండు రోజుల్లో ఆమె కోలుకుని ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అవుతారని ఆశిస్తున్నాం, అని ఆయన అన్నారు. కాంగ్రెస్ నాయకురాలికి చికిత్స అందిస్తున్న వైద్యుల ప్రకారం, శరీరమంతటా వ్యాపించిన ఇన్ఫెక్షన్‌కు ఆమె చికిత్స పొందుతున్నారు. యాంటీబయాటిక్స్‌కు ఆమె శరీరం బాగా స్పందిస్తోంది. ఆమె సీనియర్ వైద్యుల బృందం పర్యవేక్షణలో ఉన్నారు, వారు ఆమె పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. ఆమె పరిస్థితి నిలకడగా, తీవ్రంగా లేనప్పటికీ, ముందు జాగ్రత్త చర్యగా కొద్దికాలం పాటు ఆమెను పర్యవేక్షణలో ఉంచే అవకాశం ఉందని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

## రూ. 217 కోట్ల జీఎస్‌టి స్కాం

**మొదటి పేజీ తరువాయి..**

సుమారు 72 షెల్ కంపెనీల నెట్‌వర్క్ విచారణలో బట్టబయలైంది. ఎలాంటి ఎటువంటి వస్తువుల సరఫరా, సర్వీసు లేకుండా కేవలం ఫేక్ డాక్యుమెంట్లతో రూ.1,472 కోట్ల విలువైన కృత్రిమ లావాదేవీలను సృష్టించినట్లుగా తెలుస్తోంది. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ దోపిడీ.. నకిలీ లావాదేవీలతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీని ఎగ్గొట్టడమే కాకుండా, తప్పుడు పద్ధతిలో రూ.217 కోట్ల మేర ఐటీసీని క్లెయిమ్ చేసినట్లుగా దర్యాప్తులో తేలింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయాలతో పాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో డిజిజిఐ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. ఈ దాడుల్లో కీలకమైన డిజిటల్ సాక్ష్యాధారాలు, నకిలీ ఇన్వాయిస్ కాపీలను స్వాధీనం చేసుకున్నారు.

## పిఎంలు, సిఎంల తొలగింపు బిల్లుల ప్యానల్ గడువు పొడిగింపు

**మొదటి పేజీ తరువాయి..**

రాజ్యాంగ (ముప్పైవ సవరణ) బిల్లు, 2025; జమ్మూ, కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2025; కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు, 2025. గత సంవత్సరం ఆగస్టు 20న హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో ఈ బిల్లులను ప్రవేశపెట్టారు. ఆ తర్వాత దానిని కమిటీకి పంపారు.

## రూపాయి భారీ పతనం

**మొదటి పేజీ తరువాయి..**

ఇది డాలర్లకు డిమాండ్‌ను పెంచి, రూపాయిపై ఒత్తిడిని తగ్గిస్తుంది. యుద్ధం, చమురు, ప్రపంచ మార్కెట్లు భౌగోళిక రాజకీయ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మార్కెట్లపై ఒత్తిడిని కొనసాగిస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై తలపెట్టిన దాడులను వాయిదా వేయగా, ఈ సంఘర్షణను ముగించాలన్న ప్రతిపాదనలను ఇరాన్ ఏకపక్షమైనవి అని పేర్కొంటూ తిరస్కరించింది. ఉద్రిక్తత తాత్కాలికంగా తగ్గినప్పటికీ, పెట్టుబడిదారుల సెంటిమెంట్ బలహీనంగానే ఉంది. ఈ అనిశ్చితి చమురు ధరలను పెంచింది, బాండ్ల రాబడులను వృద్ధి చేసింది, ప్రపంచవ్యాప్తంగా ఈక్విటీలపై ఒత్తిడిని పెంచింది. ముడి చమురు ధరలలో కొనసాగుతున్న బలం వర్ధమాన మార్కెట్లకు, ముఖ్యంగా ఇంధన దిగుమతులపై ఆధారపడిన వాటికి ఒక కీలక ఆందోళనగా ఉంది.

**భారత ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతోంది..**

పెరిగిన చమురు ధరల వల్ల భారతదేశ కరెంట్ ఖాతా లోటు మరింత పెరిగే అవకాశం ఉంది, ఇది పరోక్షంగా రూపాయిపై ఒత్తిడిని పెంచుతుంది. విశ్లేషకులు ఇప్పటికే వృద్ధి అంచనాలను సవరించడం ప్రారంభించారు. సంఘర్షణ దుష్ప్రభావాల కారణంగా ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉన్నందున, రాబోయే 12 నెలల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వడ్డీ రేట్ల పెంపును పరిశీలిస్తుందని కొందరు భావిస్తున్నారు. సంఘర్షణ మరింత తీవ్రతరం కాకపోయినా, ఆందోళనలు కొనసాగుతాయి. ప్రధానంగా భారతదేశ బాహ్య బ్యాలెన్స్‌పై ఒత్తిళ్ల కారణంగా రూపాయి మరింత బలహీనపడి, ఈ ఏడాది డాలర్‌కు 98 స్థాయికి చేరవచ్చని బ్రోకరేజ్ సంస్థ బెర్న్‌స్టీన్ సూచించింది.

**ఏమైనా ఉపశమనం లభిస్తుందా?**

ప్రస్తుతానికి, తక్షణ ఉపశమనం లభించే సూచనలు తక్కువగా ఉన్నాయి. సంఘర్షణ ప్రారంభమైనప్పటి నుండి రూపాయి ఇప్పటికే 3 శాతానికి పైగా విలువ కోల్పోయింది, భవిష్యత్ అంచనాలు అనిశ్చితంగానే ఉన్నాయి. భౌగోళిక రాజకీయ పరిస్థితి ఎలా మారుతుంది, అలాగే ముడి చమురు ధరలు, ప్రపంచ వడ్డీ రేట్లలోని కదలికలపై చాలా ఆధారపడి ఉంటుంది. సాధారణ వినియోగదారులకు, రూపాయి బలహీనపడటం అనేది చివరికి దిగుమతి వస్తువులు, ఇంధనం, ప్రయాణాల ధరలు పెరగడానికి దారితీయవచ్చు. అదే సమయంలో, విధాన రూపకర్తలకు ఇది వృద్ధి, ద్రవ్యోల్బణాన్ని సమతుల్యం చేయడంలో ఒక కొత్త సవాలును విసురుతుంది. ప్రపంచ, దేశీయ కారణాల కలయిక వల్ల రూపాయి విలువ పడిపోతోందని నిపుణులు అంటున్నారు. ప్రపంచ, దేశీయ ఒత్తిళ్ల కలయిక కారణంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడుతోంది. అమెరికాలో పెరిగిన వడ్డీ రేట్లు డాలర్‌ను బలంగా ఉంచాయి, దీనివల్ల భారతదేశం వంటి వర్ధమాన మార్కెట్ల నుండి మూలధనం తరలిపోతోంది. అదే సమయంలో, పెరిగిన ముడి చమురు ధరలు భారతదేశ దిగుమతుల బిల్లును పెంచి, డాలర్లకు డిమాండ్‌ను పెంచాయి. క్రమానుగత విదేశీ పోర్ట్‌ఫోలియో నిధుల తరలింపు, ప్రపంచవ్యాప్త రిస్క్ నివారణ కూడా ఈ ఒత్తిడిని మరింత పెంచాయి. భారతదేశ స్థూల ఆర్థిక మౌలిక సదుపాయాలు సాపేక్షంగా స్థిరంగా ఉన్నప్పటికీ, ఈ బాహ్య కారకాలు ప్రస్తుతం కరెన్సీ కదలికలను నడిపిస్తున్నాయి, అని వారు వివరిస్తున్నారు.

## రాముడి ధర్మాన్ని సమాజానికి చాటిచెపుదాం

**ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌రెడ్డి**

**హిందూవాహిని ఆధ్వర్యంలో శోభయాత్ర**



**షాద్ నగర్, మార్చి 27 (వుదయం) :** శ్రీరామనవమి సందర్భంగా షాద్ నగర్ పట్టణంలో శుక్రవారం హిందూ వాహిని ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీరామ శోభాయాత్ర కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ శ్రీ రాముని ఆదర్శాలను, ధర్మాన్ని సమాజానికి చాటిచెప్పుదామని అన్నారు.శ్రీరాముడు ధర్మానికి,నిజాయితీకి,ఆదర్శవంతమైన వ్యక్తిత్వానికి ప్రతిరూపమని ఆయన మార్గాన్ని ప్రతి ఒక్కరము ఆచరించి ముందు కెళ్దామని యువతను ఉద్దేశించి అన్నారు. శోభయాత్రలో కౌన్సిలర్లు అనిత రఘునాథ్ యాదవ్, పిల్లి శారద శేఖర్, ఎస్పీ శివ,మాజీ పిఎసిస్ ఛైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ నందకిషోర్, నాయకులు నక్కల వెంకటేష్, శేరి శ్రీనివాస్‌రెడ్డి, దినేష్ సాగర్, హిందూవాహిని సభ్యులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.





# సీతారాముల కళ్యాణం కమనీయం

## అంగరంగ వైభవంగా కళ్యాణ మహోత్సవం

**పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి దంపతులుత**

**రూ.351 కోట్లతో ఆలయ విస్తరణ తొలిదశ అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**భక్తుల తాకిడితో కిటకిటలాడిన భద్రాద్రి క్షేత్రం**



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 27 (వుదయం ప్రతినిధి) :** శ్రీరామనవమి సందర్భంగా తెలంగాణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాచలం లో శ్రీ సీతారాముల కళ్యాణం.. వైభవంగా జరిగింది. శుక్రవారం స్వామివారిని దర్శించుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఆయన సతీమణి గీత.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందించారు. ఈ సందర్భంగా భద్రాచలం ఆలయానికి సంబంధించిన పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. అశేష భక్తజనం జయ జయ ధ్వానాల మధ్య మిథిలా మండపంలో అభిజిత్ లగ్నంలో ఆలయ పూజారులు, వేద పండితులు సీతారాముల కళ్యాణ క్రతువును పూర్తి చేశారు.

**పోటెత్తిన భక్తజనం..!**

భద్రాచలం సీతారాముల కళ్యాణాన్ని కళ్లారా చూసేందుకు అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. శ్రీరామ నామస్మరణతో భద్రాచలం పుర వీధులన్నీ మార్మోగిపోయాయి. ఈ సీతారాముల కళ్యాణాన్ని తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా భక్తులు పోటెత్తారు. ఈ కళ్యాణ మహోత్సవానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. భద్రాచలం ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా తొలి విడతలో రూ.351 కోట్లతో చేపట్టే పనులకు సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు.

**భారీ ఏర్పాట్లు..!**

రాములోరి కళ్యాణాన్ని చూసేందుకు వచ్చిన భారీ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రాచలం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం ముత్యాల తలంబ్రాలు.. లడ్డు ప్రసాదాలను పంపిణీ చేయడం కోసం స్పెషల్ కౌంటర్లు ఏర్పాటు చేసి ఎలాంటి ఇబ్బంది లేకుండా చేశారు. భక్తులు భారీగా తరలివచ్చిన నేపథ్యంలో వారికి ఇబ్బందులు లేకుండా పోలీస్ శాఖ భారీ ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేసింది. భద్రాద్రి జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో.. పోలీస్ సిబ్బంది భద్రత ఏర్పాట్లు చేశారు. మరోవైపు.. భద్రాచలం శ్రీరామనవమి కళ్యాణోత్సవంలో ప్రభుత్వం తరఫున సమర్పించే పట్టు వస్త్రాలను సుమారు 100 ఏళ్లుగా ఒకే కుటుంబం అందిస్తోంది. సికింద్రాబాద్‌కు చెందిన ఎస్ ఎస్ జయరాజు ఫ్యామిలీ.. ఈ పట్టు వస్త్రాలను సిద్ధం చేస్తోంది. ఆ కుటుంబంలోని 3 తరాలు.. ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నాయి. భద్రాచలం ఆలయం ఆవరణలోనే ప్రత్యేకంగా ఒక మగ్గాన్ని ఏర్పాటు చేసి.. పోచంపల్లి స్టైల్‌లో సీతమ్మకు చీరలు.. రామలక్ష్మణులకు పంచెలను నేశారు. రూ.2 లక్షల వ్యయంతో తయారు చేసిన ఈ పట్టు వస్త్రాలను నేడు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు స్వామివారికి సమర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంచార్జి మంత్రి వాకిటి శ్రీహరి, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, కొండా సురేఖ, ఎంపీ పోరిక బలరాం నాయక్, న్యాయమూర్తులు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్, ఎండోమెంట్ కమీషనర్ హన్మంత రావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పీ రోహిత్ రాజ్, పీఓ బి.రాహుల్, అదనపు కలెక్టర్లు విద్యా చందన, వేణుగోపాల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు, లక్షలాది మంది భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# పార్టీ జెండా, అజెండా ఏప్రిల్ 25న



**మొదటి పేజీ తరువాయి..**

తెలంగాణ ప్రజలు కూడా కొత్తగా ఏర్పాటు చేయబోయే తమ పార్టీ ఏ విధంగా పనిచేయాలో సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. తమ ఫోకస్ అంతా కూడా తెలంగాణ మీదనే ఉంటుందని కవిత స్పష్టం చేశారు. రాజకీయ పార్టీకి ఈగో ఉండకూదన్నారు. గతంలో తనను విమర్శించిన వారైనా సరే తెలంగాణ కోసం పనిచేసే ఉద్దేశం ఉంటే కలిసి రావాలని పిలుపునిచ్చారు. తాను ఏదైనా పని పట్టుకుంటే ఫలితం వచ్చే వరకు కూడా వదిలి పెట్టనని... తెలంగాణ కోసం ఏర్పాటు చేసే రాజకీయ పార్టీ ద్వారా కూడా తెలంగాణ భవిష్యత్ ను మార్చే వరకు పోరాడుతానని చెప్పారు. అవసరమైతే ఢిల్లీలో లాబీయింగ్ చేయగలనని...గల్లీలో కూడా కష్టపడతానని కవిత చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా ఆ శ్రీరాముడి స్ఫూర్తితో పార్టీ ప్రకటన చేస్తున్నానని అన్నారు. పాలన పై ప్రజాభిప్రాయం తీసుకొని వైఫల్యాలను మార్చుకున్న వ్యక్తి శ్రీరామ చంద్రుడని కవిత గుర్తు చేశారు. శ్రీరామ నవమి రోజు చేసిన పార్టీ ప్రకటన నుంచి పార్టీ ఆవిర్భావం నాటికి ఇంకా 28 రోజులు ఉన్నాయని అన్నారు. ఈ 28 రోజుల్లో అభ్యుదయ, సామాజిక తెలంగాణ కోసం మేధావులతో చర్చలు చేస్తామన్నారు. పార్టీ ఆవిర్భావ సభ నాటికి కాశీకి వెళ్లి శివుడికి అభిషేకం చేస్తామని చెప్పారు. ఆ తర్వాత పార్టీ ఆవిర్భావ సభ ఉంటుందన్నారు. తాను ముహూర్తాలను నమ్ముతానని...అందుకే శ్రీరామనవమి రోజు పార్టీ ప్రకటన చేశానన్నారు. కాలనుగుణంగా పనులు చేస్తే ప్రజలకు మంచి జరుగుతుందని నమ్ముతున్నానని కవిత చెప్పారు.

**సబ్బండ వర్గాలు సభకు విచ్చేయండి...**

ఏప్రిల్ 25 న జరిగే పార్టీ ఆవిర్భావ సభకు సబ్బండ వర్గాలు రావాలంటూ కవిత ఆహ్వానించారు. తెలంగాణ వచ్చిన 12 ఏళ్ల తర్వాత కూడా నీళ్లు, నిధులు, నియామకాలను సంపూర్ణంగా సాధించుకోలేకపోవటం బాధాకరమన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన ఆ తర్వాత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కూడా ఇంకా మనం మౌలిక సదుపాయాల కోసం కూడా పోరాటం చేసే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కూడా బస్సు ప్రమాదాలు, కుక్క కాట్లు, మక్క కొనుగోలు సెంటర్లు వంటి వాటి కోసం కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాల్సిన పరిస్థితి ఏంటనీ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అయ్యే వరకు ఒక విధంగా ముఖ్యమంత్రి అయిన తర్వాత ఒక విధంగా ప్రవర్తించటం కొత్త రాజకీయ ఒరవడిగా మారిందన్నారు. ఈ పరిస్థితిని మార్చాలంటే ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరముందన్నారు. ఇచ్చిన మాట అమలు చేయకపోయినా సరే ప్రజలు పట్టించుకోవరన్న ధైర్యం రాజకీయ నాయకుల్లో ఉందన్నారు. ఆ విధానం పోవాలంటే ప్రజలు ప్రశ్నించాల్సిన అవసరముందని చెప్పారు. ప్రతిపక్షంలో ఉంటే క్రిటిసిజం, అధికారంలోకి వస్తే ఎస్కేపిజం అన్నట్లుగా రాజకీయ నాయకుల వైఖరి ఉందని విమర్శించారు. ఇలాంటి రాజకీయాల నుంచి తెలంగాణ భవిష్యత్ ను మార్చాల్సిన అవసరముందని ఆమె చెప్పారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీలు, రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు, కార్మికులు ఇలా అన్ని వర్గాల కోసం జాగృతి గత 20 సంవత్సరాలుగా పనిచేసిందని కవిత గుర్తు చేశారు. ఇప్పుడు కూడా ప్రజల కోసం పనిచేసేందుకు అన్ని వర్గాల ఆశీర్వాదం కావాలని ఆమె కోరారు. ఏప్రిల్ 25 న జరిగే పార్టీ ఆవిర్భావ సభకు ప్రతి ఒక్కరూ విచ్చేయాలని ఆమె పిలుపునిచ్చారు.

**ఫలితం వచ్చే వరకు పట్టు వదలా...**

ఏదైనా పని పట్టుకుంటే ఫలితం వచ్చే వరకు తాను వదలనని కవిత చెప్పారు. గత 20 ఏళ్లుగా జాగృతి సంస్థ పనిచేస్తుందని గుర్తు చేశారు. రాష్ట్రం వచ్చాక, రాకముందు...బీఆర్ఎస్ లో ఉన్నప్పుడు, లేనప్పుడు కూడా తాను ప్రజల కోసం పనిచేశానని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా 350 మంది రైతులకు జాగృతి సంస్థ తరఫున నాలుగేళ్ల పాటు నెలకు రూ. 2500 పెన్షన్ ఇచ్చామని గుర్తు చేశారు. నిజామాబాద్ ఎంపీగా ఉన్న సమయంలో నిజామాబాద్, పెద్దపల్లి రైల్వే లైన్ ను మూడేళ్లలో పూర్తి చేయించానని కవిత చెప్పారు. 25 ఏళ్లుగా పెండింగ్ లో ఉన్న పనిని తాను చేయిస్తానని చెబితే అంతా నవ్వారని కానీ తాను ఆ పనిని పూర్తి చేశానని చెప్పారు. నిజామాబాద్ ప్రజల ఆశీర్వాదంతో ఎంపీగా పార్లమెంట్ కు వెళ్లానని...వారి దయతోనే ఎన్నో పనులు చేసే అవకాశం, ఎందరో పెద్ద వాళ్లు పరిచయమయ్యారన్నారు. ప్రజల కోసం అవసరమైతే ఢిల్లీలో లాబీయింగ్ చేస్తానని...గల్లీలో కష్టపడతానని చెప్పారు. నిజామాబాద్ వేదిక గా పుట్టిన ఏ ఆలోచన అయిన సరే సక్సెస్ అయ్యిందని...తమ పార్టీ ఆలోచన కూడా కచ్చితంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ కోడలిగా తనకు ఇందూరు ప్రజల ఆశీర్వాదం కావాలన్నారు. తెలంగాణ సోయి లేకపోవటంతోనే బీఆర్ఎస్ ఆదరణ కోల్పోయిందని చెప్పారు. తమ ఫోకస్ అంతా కూడా తెలంగాణ కోసమేనని చెప్పారు. ప్రజల ఆశీర్వాదం ఉంటే కచ్చితంగా తెలంగాణ రాజకీయాలను మార్చేస్తానని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుల అనుభవాన్ని రాష్ట్ర అభివృద్ధి కోసం ఉపయోగించుకుంటామని అన్నారు. అదే విధంగా వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరే వరకు పోరాటం చేస్తామని చెప్పారు. మన జీవితాన్ని శాసించే రాజకీయాల్లోకి ప్రతి ఒక్కరూ అడుగు పెట్టాలని కవిత కోరారు. రాజకీయాలు రాకెట్ సైన్స్ కాదని అందరూ రాజకీయాల్లోకి వచ్చి మార్పు తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాజకీయాల్లో మార్పు తెచ్చే వరకు కూడా పట్టువదలకుండా పోరాటం చేస్తానని ఆమె చెప్పారు.

# దాడుల విరామం పొడిగింపు



**మొదటి పేజీ తరువాయి..**

వారి ఆచూకీ ఇప్పటికీ లభించలేదు.

**భూతల దాడికి అమెరికా సిద్ధమవుతోందా?**

ఒకవైపు తీవ్ర యుద్ధం కొనసాగుతుండగా, ఇరాన్‌తో చర్చలు జరుపుతున్నామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలు చేస్తున్నప్పటికీ, మధ్యప్రాచ్యానికి మరిన్ని పదాతి దళాలను అమెరికా పంపవచ్చు. ఆ ప్రాంతానికి అదనంగా 10,000 మంది పదాతి దళాలను పంపాలని పెంటగాన్ యోచిస్తున్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. ఇరాన్ తో కొనసాగుతున్న సంప్రదింపుల నేపథ్యంలో దానిపై దాడులకు విరామాన్ని ఏప్రిల్ 6 వరకు పొడిగిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రకటించారు. ఈ గడువును 10 రోజులకు పొడిగించి, ఏప్రిల్ 6 వరకు చేర్చాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. గత నెల రోజులుగా మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం ప్రపంచ ఇంధన సరఫరాలకు అంతరాయం కలిగిస్తున్న నేపథ్యంలో, ఇరు పక్షాల మధ్య జరుగుతున్న దౌత్యపరమైన సంప్రదింపుల లో భాగంగా, మరింత సమయం కోరుతూ అమెరికా ప్రభుత్వాన్ని ఇరాన్ సంప్రదించిందని ఫాక్స్ న్యూస్‌తో మాట్లాడుతూ ట్రంప్ పేర్కొన్నారు. వారు నా ప్రతినిధుల ద్వారా నాతో చాలా మర్యాదగా, మాకు మరికొంత సమయం ఇవ్వగలరా? అని అడిగారు. ఎందుకంటే మనం రేపు రాత్రి గురించి మాట్లాడుకుంటున్నాం, అది చాలా త్వరగా జరిగిపోతుంది. ఒకవేళ వారు చేయాల్సినవి చేయకపోతే, నేను వారి విద్యుత్ ప్లాంట్లను దెబ్బతీస్తాను, అని ట్రంప్ అన్నారు.

**అమెరికా యుద్ధంలో గెలిచింది - ట్రంప్...**

కీలకమైన నౌక రవాణా మార్గమైన హోర్ముజ్ జలసంధిని మూసివేస్తే, ఇరాన్ ఇంధన ప్లాంట్లను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ గతంలో హెచ్చరించారు. ఇప్పుడు దాడుల ప్రకటనకు విరామం ఇవ్వడంతో, అమెరికా, ఇజ్రాయెల్ దాడులు టెహ్రాన్ నౌకాదళ, క్షిపణి సామర్థ్యాలను గణనీయంగా దెబ్బతీశాయని పేర్కొంటూ, ఇరాన్‌పై అమెరికా సైనికంగా యుద్ధాన్ని ఇప్పటికే గెలిచిందని కూడా ట్రంప్ అన్నారు.

**ఇంధన రంగ దాడులకు విరామం ఇవ్వాలని ఇరాన్ అభ్యర్థించిందా?**

ఇరాన్ తన ఇంధన కేంద్రాలపై దాడులకు విరామం ఇవ్వమని కోరలేదని, మధ్యవర్తులను ఉటంకిస్తూ వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదించింది. దాడులను 10 రోజుల పాటు నిలిపివేయాలని టెహ్రాన్ అభ్యర్థించిందన్న ట్రంప్ వాదనకు ఇది విరుద్ధంగా ఉంది. ఇరాన్-అమెరికా మధ్యవర్తిగా పాక్ విశ్వసనీయతను ప్రశ్నించిన అమెరికా యుద్ధ నిపుణుడు ఇరాన్, అమెరికా మధ్య వివాదాన్ని పరిష్కరించేందుకు పాకిస్తాన్ మధ్యవర్తి పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, ఆ దక్షిణాసియా దేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన అంతర్గత సవాళ్లను ఉటంకిస్తూ, భౌగోళిక రాజకీయ రిస్క్ అడ్వైజర్, అమెరికా సైన్యంలో మాజీ సైనికుడు అయిన కెల్నల్ డగ్లస్ మాక్‌గ్రెగర్ (రిటైర్డ్) దాని విశ్వసనీయతను ప్రశ్నించారు. ఇజ్రాయెల్ కూడా పాకిస్తాన్‌ను తటస్థ పక్షంగా పరిగణించదని మాక్‌గ్రెగర్ అభిప్రాయపడ్డారు. వివిధ భౌగోళిక రాజకీయ కూటములతో భారతదేశానికి ఉన్న దౌత్య సంబంధాల కారణంగా, చర్చలను సులభతరం చేయడంలో అది విశ్వసనీయమైన పాత్ర పోషించగలదని ఆయన సూచించారు.

## ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్ దక్షిణ భాగానికి డీపీఆర్

*మంత్రి కోమటిరెడ్డి కి కేంద్రమంత్రి గడ్కరీ లేఖ*



**హైదరాబాద్, మార్చి 27 (వుదయం ప్రతినిధి) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టుకు సంబంధించి కీలక అడుగు పడింది. ఈ రహదారి దక్షిణ భాగానికి సంబంధించిన డీపీఆర్‌పై కేంద్రం అప్డేట్ ఇచ్చింది. ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్ దక్షిణ భాగానికి కన్సల్టెన్సీ డీపీఆర్‌ను రూపొందిస్తున్నామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ.. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం డీపీఆర్ తయారీకి సంబంధించి చర్యలు చేపట్టామని.. కన్సల్టెన్సీని అపాయింట్ చేసినట్లు గడ్కరీ ఆ లేఖలో పేర్కొన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి 2025 ఆగస్టు 5న ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి అనుమతివ్వాలని కేంద్రానికి లేఖ రాశారు. ఈ లేఖపై స్పందిస్తూ దక్షిణ భాగానికి డీపీఆర్ తయారీలో ఉందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మంత్రి కోమటిరెడ్డికి లేఖ రాశారు. డీపీఆర్‌పై నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఆ లేఖలో తెలిపారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం డీపీఆర్‌పై నితిన్ గడ్కరీ లేఖ రాయడంపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.. గడ్కరీకి ధన్యవాదాలు తెలిపారు. ఉత్తర భాగం ఇప్పటికే మంజూరై.. టెండర్ దశలో ఉందని కోమటిరెడ్డి గుర్తు చేశారు. దక్షిణ భాగం పట్ల కూడా కేంద్రం నుంచి సానుకూల నిర్ణయం రావడం శుభపరిణామం అన్న మంత్రి కోమటిరెడ్డి... ఇది తెలంగాణకు ఆర్ఆర్ఆర్ గేమ్ ఛేంజర్ కాబోతుందన్నారు.

కేంద్రం సహకారంతో ఆర్ఆర్ఆర్‌ను చేపట్టారు.. ఈ ప్రాజెక్టులో ఉత్తరభాగం మొత్తం 161.5 కిలోమీటర్ల (సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి జిల్లాలోని తంగడ్‌పల్లి వరకు) మేర రెండు ప్యాకేజీల్లో నిర్మించనున్నారు. ఈ మేరకు త్వరలోనే టెండర్లను ఆహ్వానించనున్నారు. దాదాపు రూ.21వేల కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు రూపొందించారు. అలాగే ఆర్ఆర్ఆర్ ప్రాజెక్ట్ దక్షిణ భాగం మొత్తం 201 కిలో మీటర్లు (తంగడ్‌పల్లి నుంచి సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ వరకు) కాగా.. తెలంగాణ ప్రభుత్వం ఉత్తరభాగంతో సమాంతరంగా దక్షిణ భాగం ఈ పనులనూ చేపట్టాలనిగతంలో డీపీఆర్‌ను చేపట్టింది. కేంద్రానికి కూడా తెలంగాణ సర్కార్ అనేకసార్లు కోరింది. ఇప్పుడు డీపీఆర్‌పై అప్డేట్ వచ్చింది.



# గ్రేటర్ హైదరాబాద్



## రామచంద్రపురంలో రామనవమి

### వేడుకలలో పాల్గొన్న పుష్పనగేష్ దంపతులు



**రామచంద్రపురం, మార్చి 27(వుదయం) :** శ్రీ రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రామచంద్రపురం డివిజన్ మందుముల శ్రీనివాస్ నగర్ కాలనీలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో రామ నవమి వేడుకలు నిర్వహించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా డివిజన్ మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ దంపతులు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, అన్ని కులాల ప్రజలు కలిసి తమ నివాసం నుంచి మంగళ వాయిద్యాలు, డప్పు చప్పుళ్ల నడుమ ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగింపుగా తీసుకువచ్చారు.

ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించి, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వేడుకలలో పాల్గొన్న ఆదర్శ్ రెడ్డి



**అమీన్పూర్,మార్చి 27 (వుదయం):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని పటాన్చెరు నియోజకవర్గం భీరంగూడ, అమీన్‌పూర్ డివిజన్లలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు. జయలక్ష్మీ నగర్, వందనపురి కాలనీ, రాఘవేందర్ కాలనీ, హరివిల్లు కాలనీ, డిఫెన్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన శ్రీ సీతారామ కళ్యాణోత్సవాల్లో పాల్గొని భక్తులతో కలిసి శ్రీరాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువ నాయకుడు మాణిక్ యాదవ్ కూడా పాల్గొన్నారు.

## వైభవంగా రాములోరి కల్యాణం



**కుత్బుల్లాపూర్, మార్చి 27 (వుదయం ప్రతినిధి ):** నిజాంపేట్ సర్కిల్ కౌసల్య కాలనీ లోని శ్రీ వెంకట శివ రామాలయ ప్రాంగణంలో ఆలయ ధర్మకర్త & 17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో *శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది.అనంతరం అన్న ప్రసాద వితరణ ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవంలో ఆలయ కమిటీ సభ్యులు,కాలనీ వాసులు భక్తిశ్రద్ధలతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## డ్రగ్స్ విక్రేతలు, వినియోగదారుల అరెస్ట్

- రూ. 6 లక్షల మత్తు పదార్థం సీజ్!
- పరారీలో అసలు సూత్రధారులు
- సనత్ నగర్ పోలీసుల మెరుపు దాడి



**హైదరాబాద్, మార్చి 27 (వుదయం ప్రతినిధి):** నగరంలో మాదకద్రవ్యాల విక్రయాలే లక్ష్యంగా సాగుతున్న నెట్‌వర్క్ పై పోలీసులు మరోసారి ఉక్కుపాదం మోపారు. జూబ్లీ హిల్స్ జోన్ టాస్క్ ఫోర్స్, సనత్ నగర్ పోలీసులు నిర్వహించిన సంయుక్త ఆపరేషన్‌లో సుమారు రూ. 6,00,000 విలువైన 60 గ్రాముల ఎండీఎంఏ మాదకద్రవ్యాన్ని శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ఇద్దరు నిందితులతో పాటు ఇద్దరు జేసీఎల్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం, పట్టుబడిన నిందితులకు మరియు జేసీఎల్‌లకు మద్యం, గంజాయి, ఎండీఎంఏ సేవించే అలవాటు ఉంది. ఈ క్రమంలో చింతల్‌లో నివసించే ఆదిత్య, సాయి నిఖిల్ యాదవ్‌లతో ఒక జేసీఎల్‌కు పరిచయం ఏర్పడింది. వారి వద్ద ఎండీఎంఏ డ్రగ్ ఉందని తెలుసుకున్న సదరు జేసీఎల్, వారి వద్ద నుంచి తక్కువ ధరకు డ్రగ్ కొనుగోలు చేసి, తెలిసిన కస్టమర్లకు ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడు. రెండు రోజుల క్రితం, ఆదిత్య, సాయి నిఖిల్ యాదవ్‌ల నుంచి 60 గ్రాముల ఎండీఎంఏను కొనుగోలు చేసి, కస్టమర్లకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అరెస్టయిన వారిలో ఐడిపిఎల్ ప్రాంతానికి చెందిన విద్యార్థి సోంగపు హేమంత్ (23), చింతల్ ప్రాంతానికి చెందిన ముక్కగళ్ల నాగేంద్ర (21) ఉన్నారు. వీరు ప్రధానంగా డ్రగ్స్ వినియోగదారులుగా గుర్తించబడ్డారు. అయితే, ఈ ముఠాలో కీలక సభ్యులైన సాయి నిఖిల్ యాదవ్, ఆదిత్య ప్రస్తుతం పరారీలో ఉన్నారు. పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను తదుపరి చర్యల నిమిత్తం సనత్ నగర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. యువత డ్రగ్స్ వంటి వ్యసనాలకు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని, ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. ఈ ఆపరేషన్ జూబ్లీహిల్స్ జోన్ టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ చ. యదేందర్, ఎస్.ఐ.పి.డి. రవిరాజ్, వారి బృందం, సనత్ నగర్ పోలీసులతో కలిసి పర్యవేక్షించారు.

# కల్యాణం కమనీయం

### పీర్జాదిగూడలో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

- స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు
- సమర్పించిన మాజీ మంత్రి మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**మేడిపల్లి, మార్చి 27 వుదయం ప్రతినిధి :** బోడుప్పల్ సర్కిల్ పరిధిలో శ్రీరామ నవమి వేడుకలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా మేడిపల్లిలోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవాలయంలో శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం వైభవంగా జరుగగా, మాజీ మంత్రి, మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి, అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి దివ్య ఆశీర్వాదాలు స్వీకరించారు. అనంతరం మేడిపల్లి, పీర్జాదిగూడ డివిజన్ల పరిధిలోని పలు కాలనీలలో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాల్లో భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రతి కాలనీలో భక్తి వాతావరణం నెలకొని, జై శ్రీరాం నినాదాలతో ప్రాంతం మార్మోగింది. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..."శ్రీ రామ నవమి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక, ప్రజలందరూ ఐక్యంగా ఇలాంటి వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరి శంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, యూత్ అధ్యక్షులు ప్రభు,జావీద్ ఖాన్, యాసారం శ్రీనివాస్, ఆకుల మధుకర్, యాస రాజు,పింగళి జోగి రెడ్డి, కిరణ్ నాయక్, అమర్ పటేల్,బాలరాజు, వారికల శ్రీనివాస్, సురేష్, శంకర్ రెడ్డి, దేవాలయం చైర్మన్ కావడపు రాంరెడ్డి,కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## భౌరంపేట్‌లో నవమి వేడుకలు



**కుత్బుల్లాపూర్, మార్చి 27 (వుదయం ప్రతినిధి ) :** ధర్మ రక్షకుడు, ఏక వాక్య పాలకుడు అయిన శ్రీరాముని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం దుండిగల్ సర్కిల్‌లోని భౌరంపేట్ ప్రాంతంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఈ కార్యక్రమానికి దుండిగల్ మున్సిపల్ మాజీ చైర్మన్ శంభిపూర్ కృష్ణవేణికృష్ణ, భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, బి అర్ ఎస్ సీనియర్ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీతో పాటు వివిధ కమ్యూనిటీ కాలనీలలో నిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణ వేడుకలకు హాజరై పూజల్లో పాల్గొన్నారు. భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో భక్తులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీరాముని ఆచరణ, ధర్మం, నిజాయితీ ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. సమాజంలో ధర్మం నిలవాలంటే శ్రీరాముని మార్గాన్ని అనుసరించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, భక్తులు, యువకులు, మహిళలు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీరామనవమి వేడుకలో పాల్గొన్న కెఎస్‌అర్



**కుత్బుల్లాపూర్, మార్చి 27 (వుదయం ప్రతినిధి ) :** శ్రీరామనవమిని పురస్కరించుకొని శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణం వాడవాడలా ఘనంగా జరిగింది. బాచుపల్లి పరిధిలోని కౌసల్య కాలనీ, సాయి అనురాగ్ కాలనీ, క్రాంతి నగర్, సాయి నగర్ తదితర ప్రాంతాల్లో స్వామివారి కళ్యాణం కనుల పండుగ జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, కొలన్ రాజశేఖరరెడ్డి, తాతిరెడ్డి (వెంకటేశ్వర రెడ్డి), స్థానిక నాయకులతో కలిసి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు స్వామివారి కల్యాణంలో పాల్గొని వేద పండితుల ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ సీతారామ లక్ష్మణ సమేత ఆంజనేయ స్వామి వారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నో లక్షల సంవత్సరాల తర్వాత కూడా రాజ్యపాలనకు శ్రీరామరాజ్యాన్నికొలమానంగా తీసుకోవడం ఆయన పరిపాలనా గొప్పతనాన్ని తెలియజేస్తుందని, పాలనలో నేటికీ రాముడు ఆదర్శ పురుషుడిగా విలసిల్లుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్ రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు మరియు భక్తులు పాల్గొన్నారు.

## శంకర్‌పల్లిలో కన్నుల పండుగగా

### భక్తులతో కిటకిటలాడిన రామాలయం



**శంకర్‌పల్లి, మార్చి 27 (వుదయం) :** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీరామాలయంలో శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించగా అది కన్నుల పండుగలా మారింది. ఉదయం నుంచే ఆలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారికి ప్రత్యేక అలంకరణలు, పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తి శ్రద్ధలతో నిండిపోయింది. "జయశ్రీరామ్" నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగుతూ పండుగ వాతావరణం ఉట్టిపడింది. వివిధ ప్రాంతాల నుంచి కుటుంబ సమేతంగా వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శ్రీ రామనవమి పర్వదినానికి తగినట్లుగా ఆలయంలో ప్రత్యేక వేడుకలు చేపట్టడంతో శంకర్‌పల్లి పట్టణం మొత్తం ఆధ్యాత్మిక వెలుగులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఉదయం 11:34 గంటలకు ప్రధాన అర్చకులు రాజేశ్వర్ జోషి ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదమంత్రాల మధ్య, పంచవాద్యాల నాదాల మధ్య కళ్యాణ కార్యక్రమం ఘనంగా సాగింది. ఈ సందర్భంగా శ్రీరాముడు తరపున కె. కిషోర్ కుమార్ - పావని దంపతులు పాల్గొని స్వామివారికి తలంబ్రాలు సమర్పించారు. అలాగే శ్రీ సీతమ్మ వారి తరపున ఎంసాని పవన్ కుమార్ - మమత దంపతులు పాల్గొని కళ్యాణ కార్యక్రమంలో ప్రత్యేకంగా సేవలందించారు. కళ్యాణ ఘట్టం ప్రారంభమైన సమయంలో భక్తులంతా పరవశించి స్వామివారి దర్శనంతో పులకించిపోయారు. ఆలయంలో జరిగిన ప్రతి పూజా ఘట్టం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా స్వామివారి దివ్య కాంతి దర్శనంతో భక్తులు మంత్రముగ్ధులయ్యారు. కళ్యాణానికి వచ్చిన భక్తులకు జై భవాని యూత్ (దసరా ఉత్సవ కమిటీ), శ్రీరామ సేన వారి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాన్ని పద్ధతిగా అందిస్తూ సేవా భావాన్ని చాటుకున్నారు. పండుగ రోజున అన్నదానం చేయడం ఎంతో పుణ్యకార్యమని నిర్వాహకులు తెలిపారు. అదే సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సిఐ మీర్ ముదసర్ అలీ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రాకపోకల నిర్వహణలో పోలీసు సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. ఈ కళ్యాణ మహోత్సవానికి మున్సిపల్ చైర్మన్ ప్రవీణ్ కుమార్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, వివిధ పార్టీల నాయకులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల భారీ హాజరు, అన్నదానం, వైభవంగా సాగిన పూజా కార్యక్రమాలతో శంకర్‌పల్లిలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత ఘనంగా ముగిసింది.

## రామాలయం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

### 70 మందికి సిద్ధార్థ హాస్పిటల్ ఉచిత పరీక్షలు, మందుల పంపిణీ

**శంకర్‌పల్లి, మార్చి 27 (వుదయం) :** శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీరామాలయం ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని సిద్ధార్థ హాస్పిటల్ వారి సహకారంతో ఏర్పాటు చేయగా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సేవా కార్యక్రమాల రూపంలో ప్రజలకు ఆరోగ్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఈ క్యాంపును నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం వద్ద సందడి నెలకొని ప్రజలు క్రమబద్ధంగా పరీక్షలు చేయించుకున్నారు. క్యాంపులో వైద్య సేవలు పూర్తిస్థాయిలో అందడంతో స్థానికులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆలయం పరిసర ప్రాంతాలు భక్తి వాతావరణంతో పాటు సేవా భావంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఉచిత వైద్య శిబిరంలో ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్ విభాగాలకు చెందిన వైద్యులు ప్రత్యేకంగా హాజరై ప్రజలకు సేవలందించారు. సిద్ధార్థ హాస్పిటల్ నుంచి డా. అర్షియా షేక్, డా. అజయ్ కుమార్, డా. కృష్ణప్రసాద్ వైద్య బృందంగా



వచ్చి రోగులను పరిశీలించారు. ప్రజల ఆరోగ్య సమస్యలను దగ్గరగా తెలుసుకొని అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. చెవి, ముక్కు, గొంతు సంబంధిత సమస్యలు, కీళ్ల నొప్పులు, శరీర బలహీనత, జ్వరాలు, రక్తపోటు వంటి అంశాలపై వైద్యులు ప్రత్యేక శ్రద్ధ చూపారు. ప్రతి రోగిని సమగ్రంగా పరిశీలించి వైద్యపరమైన అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రజలకు ఇలాంటి ఉచిత వైద్య సేవలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని పలువురు అభిప్రాయపడ్డారు. క్యాంపులో మొత్తం 70 మంది ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ముఖ్యంగా క్యాంపుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ బీపీ పరీక్షలు, బరువు కొలతలు, రక్త పరీక్షలు వంటి ప్రాథమిక పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. పరీక్షల అనంతరం అవసరమైన వారికి మందులను కూడా ఉచితంగా అందజేశారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి తగిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్లు సూచనలు చేశారు. కొంతమందికి తదుపరి వైద్య చికిత్స కోసం ఆసుపత్రికి రావాలని సూచిస్తూ మార్గదర్శనం చేశారు. ఉచితంగా పరీక్షలు, మందులు అందడంతో పేద ప్రజలకు ఎంతో ఆర్థిక భారం తగ్గిందని స్థానికులు తెలిపారు. ఈ శిబిరం ద్వారా అనేక మంది తమ ఆరోగ్య పరిస్థితిని ముందుగానే తెలుసుకునే అవకాశం దక్కిందని పేర్కొన్నారు. శ్రీరామాలయం ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమం నిర్వహించడం ప్రజల్లో ప్రత్యేకంగా ప్రశంసలు అందుకుంది. ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ పండుగల సమయంలో భక్తి కార్యక్రమాలతో పాటు ప్రజలకు ఉపయోగపడే ఆరోగ్య సేవలను అందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆరోగ్యం పరిరక్షణే నిజమైన సేవ అని, ప్రజల సంక్షేమం కోసం మరిన్ని కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో క్యాంపు నిర్వహించడం వల్ల ప్రజలు సులభంగా చేరుకొని పరీక్షలు చేయించుకునే అవకాశం కలిగిందన్నారు. వైద్యులు అందించిన సేవలు నిస్వార్థమైనవని, ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారని పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో శిబిరం నిర్వహించడం వల్ల భక్తి వాతావరణంతో పాటు సేవా సందేశం కూడా ప్రజల్లో వ్యాప్తి చెందిందన్నారు. భవిష్యత్తులో పెద్ద స్థాయిలో వైద్య శిబిరాలు నిర్వహించాలని స్థానికులు కోరారు.

## శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు



**రామచంద్రాపురం, మార్చి 27(వుదయం) :** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని రామచంద్రారెడ్డి నగర్ శివాలయంలో నిర్వహించిన శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి, భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శివ ఆంజనేయ స్వామి ఆలయంలో జరిగిన కళ్యాణ మహోత్సవానికి శ్రీ సీతారామాంజనేయ స్వామి విగ్రహాల ఊరేగింపును ఆలయ శాశ్వత అధ్యక్షుడు వెన్నవరం రాజేశ్వర్ రెడ్డి నివాసం నుంచి ఆలయం వరకు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆదర్శ్ రెడ్డి, సింధు ఆదర్శ్ రెడ్డి కళ్యాణంలో కూర్చొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ శాసన మండలి మాజీ ప్రోటెం చైర్మన్ భూపాల్ రెడ్డి హాజరయ్యారు.

అనంతరం భారతి నగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీ రామాలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, మ్యాక్ సొసైటీ, అన్నమయ్య కాలనీ, ఓల్డ్ ఎం.ఐ.జి ప్రాంతాలలో నిర్వహించిన శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొని శ్రీరాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఓల్డ్ రామచంద్రాపురం, అశోక్ నగర్, మయూరి నగర్, జ్యోతి నగర్, కాకతీయ నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో భక్తులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కల్యాణ మహోత్సవంలో రుష్వంత్ రెడ్డి



**అమీన్పూర్, మార్చి 27(వుదయం):** శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని అమీన్పూర్, బీరంగూడ డివిజన్ పరిధిలోని పలు కాలనీ దేవాలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమాల్లో బి ఆర్ ఎస్ యువ నాయకుడు తుమ్మల రుష్వంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు దాసు యాదవ్, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తుమ్మల దేవేందర్ రెడ్డి, దీపక్ రెడ్డి, సతీష్ రెడ్డి, సుశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కల్యాణ మహోత్సవం



**కుత్బుల్లాపూర్, మార్చి 27 (వుదయం ప్రతినిధి ) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని జర్నలిస్టు కాలనీలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్,మాధవి దంపతులు.కార్యక్రమంలో పాల్గొన్న కాలనీ దేవాలయ కమిటీ నాయకులు ముక్కర్ల లాలయ్య,దేవేందర్ గుప్తా, గోవింద్ రావ్, మల్లికార్జున్,రాము, కృష్ణ,సత్యనారాయణ, మహేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## తొల్కట్ట గ్రామంలో సీతారాముల కళ్యాణం

**చేవెళ్ల మార్చ్ 27 (వుదయం) :** మొయినాబాద్ మండల పరిధిలోని తొల్కట్ట గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణం భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, పెద్దలు, భక్తులు భారీ సంఖ్యలో హాజరై భక్తి భావంతో పాల్గొన్నారు. కళ్యాణోత్సవం సందర్భంగా రామనామ స్మరణతో ఆలయం ప్రాంగణం మార్మోగింది. ఈ సందర్భంగా బానూరి శబరీ శివశంకర్‌గౌడ్ మరియు బి.సౌమ్యగణేష్ గౌడ్ దంపతులు కళ్యాణం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా నిర్వాహకులు ,మాట్లాడుతూ...కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల సహకారంతో కళ్యాణం ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా ముగిసిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.రజిత రవీందర్,ఉపసర్పంచ్ ఎం.డి.ఇనాయత్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, గ్రామ పెద్దలు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



## గుమ్మడిదలలో నవమి వేడుకలు



**గుమ్మడిదల, మార్చి 27 (వుదయం):** చారిత్రక ప్రాధాన్యం గల గుమ్మడిదల పుణ్యక్షేత్రం శ్రీరామనవమి సందర్భంగా భక్తిరసంలో మునిగిపోయింది. ప్రసిద్ధ శ్రీ కళ్యాణ రామచంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. స్వామివారికి విశేష అభిషేకాలు, అలంకరణలు అనంతరం సీతారాముల కల్యాణ మహోత్సవం వేద మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. వంశపారంపర్య ధర్మకర్తలు కోయిల్ కోదండై వెంకట నరసింహాచార్యులు, రంగనాథన్, అచ్యుత్ రామన్ ఆధ్వర్యంలో ఈ ఘట్టం జరిగింది. మంగళవాయిద్యాలు, జై శ్రీరామ్ నినాదాలతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



"ఇరాన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ యుద్ధం అన్యాయమైనది, చట్టవిరుద్ధమైనది. దీనిని ముగించేలా చేయడానికి ప్రధాని మోడీ మానవతా బాధ్యత దృష్ట్యా తన పరపతిని ఉపయోగించాలి. ఇరాన్ సంక్షోభం ఒక అంతర్జాతీయ సమస్య, నా తరపున, నా సహచరుల తరపున, ఇరాన్‌పై రుద్దిన ఈ అన్యాయమైన, చట్టవిరుద్ధమైన యుద్ధాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. అయతొల్లా అలీ ఖమేనీ, ఆయన సహచరులు, ఈ ఘర్షణలో ప్రాణాలు కోల్పోయిన వారందరి పట్ల నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను, ఈ యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించడానికి అందు బాటులో ఉన్న అన్ని దౌత్య మార్గాలను, సంబంధాలను ఉపయోగించుకోవాలని నేను మన ప్రధానమంత్రికి మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాను. అలా చేయడం వల్ల మనకు మాత్రమే కాకుండా, యావత్ మానవాళికి ప్రయోజనం చేకూరుతుంది."

* ఒమర్ అబ్దుల్లా, జమ్మూ కశ్మీర్ ముఖ్యమంత్రి

## వే'మన'పద్యం

కులములేనివాడు కలిమిచే వెలయును
గలిమి లేనివాడు కులము దిగును
గులముకన్న భువిని గలిమియెక్కువసుమీ
విశ్వదాభిరామ! వినురవేమ



## సంపాదకీయం

# రెక్కలు కత్తిరిస్తున్న బిల్లు

సమస్యనైనా ఒక కొలిక్కి తేవడానికి ఒకే ఒక్క మంచి పద్ధతి దానికి సంబంధించిన వారందరితో సంప్రదించడం. జాతి ప్రయోజనాల దృష్ట్యా ఏదైనా కఠిన నిర్ణయం తీసుకోవలసిన అవసరం నిజంగా తల ఎత్తితే దానికి వారి ఆమోదం సాధించే యత్నం చేయడం. ప్రజాస్వామ్యంలో అధికారం పొందే శక్తులు ఈ పథ పాటిస్తే మంచి ఫలితాలు లభిస్తాయి. కాని మన కేంద్రప్రభుత్వం వివాదాస్పద నిర్ణయాలు తీసుకోవడంలో దిట్ట అని దాని రెండు దశాబ్దాలకు పైబడిన పాలనలో అనేకసార్లు రుజువైంది. పర్యవసానంగా వివాదాలు, వ్యాజ్యాలు.ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల (రక్షణ, హక్కులు) సవరణ బిల్లుకు సైతం ఇప్పుడు అదే గతి పట్టింది. విస్తృత చర్చ జరపకుండా ఈ బిల్లును ఆమోదించొద్దని ప్రతిపక్షం చెప్పిన హితవును పెడ చెవిన పెట్టిన ప్రభుత్వం దానికి పార్లమెంట్ ఆమోదాన్ని సాధించి రాష్ట్రపతి ముద్ర కోసం పంపింది.దీనితో ట్రాన్స్‌జెండర్ ఉద్యమ కారులు, వారి మంచికోసం కృషి చేస్తున్నవారు కొత్త బిల్లుకు చట్టరూపం ఇవ్వొద్దని రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అర్థించారు. గురువారం నాడు న్యూ ఢిల్లీ జంతర్ మంతర్ లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. మానవాళి లో అనేక రకాల వారున్నారు. స్త్రీ పురుషులతో బాటు తృతీయ జెండర్, సలింగ సంపర్కులు మాదిరిగానే ఇష్టపూర్వకంగా జెండర్ మార్పిడి చేయించుకున్నవారూ ఉన్నారు.మన పురాణాల్లోనే ఈ వైవిధ్యం ఉంది. వారందరికీ మిగతా పౌరులకు మాదిరిగానే సమాన హక్కులు, ఆత్మగౌరంతో కూడిన ఉనికి, గుర్తింపు ఇవ్వాలి. భారత రాజ్యాంగం ఇదే చెబుతున్నది. ట్రాన్స్‌జెండర్ లు తమకు తాముగా ఇచ్చుకునే స్వీయ ధ్రువీకరణ పత్రం మేరకు జిల్లా అధికారులు వారిని ఆ విధంగా గుర్తించాలని 2019 నాటి చట్టం చెప్పింది. ఇప్పుడు సవరించిన దానిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ అధ్యక్షతన గల మెడికల్ బోర్డు తగు పరీక్షలు చేసి ట్రాన్స్ జెండర్ గా ధ్రువీకరణ పత్రం ఇవ్వాలనే కొత్త షరతు చేర్చారు.దీనితో ఇప్పటికే పూర్వ నియమం ప్రకారం గుర్తింపు పొందినవారు కొత్తగా మెడికల్ బోర్డును ఆశ్రయించవలసివస్తుంది.కొత్త బిల్లులో ట్రాన్స్ జెండర్ గుర్తింపును అందరికీ కాకుండా కొన్ని వర్గాలకు మాత్రమే పరిమితం చేశారు. దీనిని కూడా వారు వ్యతిరేకస్తున్నారు.

హిజ్రా, కిన్నెర, అరవాణి, జోగ్తా వర్గాలకే ట్రాన్స్ గుర్తింపును పరిమితం చేయడం వల్ల తమంత తాముగా లింగ మార్పిడి చేసుకున్నవారు ఇబ్బందుల్లో పడతారు, ట్రాన్స్‌జెండర్ లు స్వీయ ధ్రువీకరణతో గుర్తింపు పొందొచ్చని నల్సా జడ్జిమెంట్ లో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రస్తుతం కేంద్రంలో పరిపాలన సాగిస్తున్న శక్తులు మనిషి సుఖానికి కంటే తాము నమ్మే కఠిన విశ్వాసాలకు ప్రాధాన్యం ఇచ్చే వారుగా ప్రసిద్ధికి ఎక్కారు. సర్వ స్వేచ్ఛలకు ప్రాధాన్యమి స్తూ వసుధైక సమాజం వైపు సాగుతున్న ఆధునిక ఆలోచనకు అడ్డంకులు సృష్టించడం మనిషిని మళ్ళీ మధ్యయుగాలలోకి చేరుస్తుంది.



## రచనలు పంపండి

వుదయం సాహిత్య పేజీ 'ఉష' కు సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు పంపించాలని రచయితలకు ప్రత్యేకంగా విజ్ఞప్తి చేస్తున్నాం. అలాగే సంపాదకీయం పుటకు రాజకీయ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక తదితర రంగాలపై వ్యాసాలను, సంపాదక లేఖలను పంపించవలసిందిగా కోరుతున్నాం. వాటిని ఈ కింది ఈమెయిల్ కు పంపించాలని మనవి.

voodayam2007@gmail.com
website : www.voodayam.com
Editor : 9247698676
1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020

## మేటి సంపాదకులు చలపతిరావు

మానికొండ చలపతిరావు (1908 -1983) పత్రికా రచయిత, సంపాదకుడు, గ్రంథకర్త, సాహితీవేత్త, మానవతా వాది. నిర్భయమైన, నిష్పాక్షికమైన శక్తి వంతమైన, పాఠకులను ఎంతగానో ఆకట్టుకునే రచనలకు చలపతి రావు, భారత దేశంలోనే ఇంగ్లీష్ జర్నలిజంలో గొప్ప సంపాదకులుగా మిగిలి పోయారు. భారతదేశ ప్రభుత్వం ప్రెస్ కమిషన్ (Press Commission) ఏర్పాటు చేయడానికి ఆయనే ప్రధాన కారకులు. మానికొండ చలపతి రావు1908 సంవత్సరంలో విశాఖపట్నంలో జన్మించారు. ఎం.ఏ., బి.ఎల్. పట్టాలను పొంది కొంతకాలం న్యాయవాదిగా పని చేశారు. ఆయన విశాఖ పట్నంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ అధ్యక్షతన "ఎథేనియం" అనే పేరుతో సాహిత్య సాంస్కృతిక సంస్థను నెలకొల్పి తాను కార్యదర్శిగా పనిచేశారు. తర్వాత "పీపుల్స్ వాయిస్", "వీక్ ఎండ్", "హిందూస్థాన్ టైమ్స్" పత్రికలలో వేర్వేరు కాలాలలో సహాయ సంపాదకులుగా పనిచేశారు. జవహర్‌లాల్ నెహ్రూ 1938 లో స్థాపించారు. జవహర్ లాల్ నెహ్రూ 1938 లో లక్నో నుండి ప్రారంభించిన "నేషనల్ హెరాల్డ్" దినపత్రికకు చలపతి రావు ను సహాయ సంపాదకునిగా నియమించారు. అయన చిత్తశుద్ధితో, అంకిత భావంతో, రాజీ లేని, ఒత్తిళ్ళకు లొంగని శక్తివంతమైన సంపాదకీయాలు, వ్యాసాలు రాశారు. నేషనల్ హెరాల్డ్ మూసి వేయడం ద్వారా ది హిందూస్తాన్ టైమ్స్‌లో అసిస్టెంట్ ఎడిటర్‌గా పని చేయడానికి ముందు స్వాతంత్ర్య పోరాటంలో ప్రెస్ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. 1946 లో అప్పటి ప్రభుత్వం మూసివేసిన తరువాత తిరిగి తెరిచినప్పుడు ఆయన నేషనల్ హెరాల్డ్ ఆఫ్ లక్నోకు సంపాదకులు అయ్యాడు. అదే పత్రికకు సంపాదకులుగా 1946 నుండి 1978 వరకు కొనసాగి నెహ్రూకు సన్నిహిత మిత్రుడై భారత దేశం లోని ప్రముఖ పత్రికా సంపాదకులుగా పేరుపొందారు. యునెస్కో ప్రెస్ నిపుణుల కమిటీలో సభ్యుడిగా పని చేశారు. ఆయన 1955 లో యుఎస్ ఎస్ఆర్, పోలాండ్ మరియు యుగోస్లేవియాలో పర్యటించిన జవహర్ లాల్ నెహ్రూతో కలిసి వచ్చిన ఇండియన్ ప్రెస్ ప్రతినిధి బృందానికి నాయకత్వం వహించారు. 1958 లో, ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో భారత దేశానికి ప్రాతినిధ్యం వహించారు. చలపతి రావు ఇంటర్నేషనల్ ప్రెస్ ఇన్స్టిట్యూట్ ఇనిషియేటింగ్ కమిటీ సభ్యులు కూడా. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (Indian Fedration of Working Journalists) అనే సంస్థను వ్యవస్థీకరించి దానికి మొదటి అధ్యక్షులై, ఆ సంస్థను 1950 నుండి 1955 వరకు ట్రేడ్ యూనియన్ పద్ధతిలో నడిపి దేశంలోని పత్రికా రచయితలకు మేలైన స్థితిగతులను కల్పించ దానికి ఎంతగానో పాటు పడ్డారు.1952 లో చైనాకు భారత ప్రభుత్వ గుడ్విల్ మిషన్ సభ్యులు. ఆయన జవహర్ లాల్ నెహ్రూ, గోవింద వల్లభ పంత్ ల జీవిత్ర చరిత్రలను ఆంగ్లంలో రచించారు. ది ప్రెస్ ఇన్ ఇండియా (The Press in India) అనేది ఆయన ప్రసిద్ధిచెందిన గ్రంథం. ఆయన1983 మార్చి 25 తేదీన పరమ పదించారు.



సంగనబట్ల
9440595494

# మానవాళిపై మహా విధ్వంసాలు

యుద్ధమంటే కేవలం రెండు దేశాల మధ్య జరిగే సంఘర్షణ మాత్రమే కాదు. పర్యావరణాన్ని, ఆర్థిక వ్యవస్థను, విద్యను, మానవ జీవనాన్ని సమగ్రంగా ధ్వంసం చేసే మహా విపత్తు. మొదటి ప్రపంచ యుద్ధం (1914-1918) మానవ చరిత్రలో మొదటిసారిగా పారిశ్రామిక స్థాయి మారణహోమాన్ని చూపించింది. ఫ్లాండర్స్ మైదానాల్లో మస్టర్డ్ గ్యాస్ వ్యాపించి లక్షల మంది సైనికులను శాశ్వత గుడ్డివారిగా మార్చింది. రెండవ ప్రపంచ యుద్ధం (1939-1945) చరిత్రలోనే అతిపెద్ద మానవ విషాదంగా నిలిచిపోయింది. కోట్లకు పైగా మనుషులు మరణించారు, హోలోకాస్ట్‌లో లక్షల మంది నిర్మూలించబడ్డారు. హిరోషిమా, నాగసాకిలపై పడిన అణుబాంబులు (1945) ఒక్క క్షణంలో 2 లక్షల మంది ప్రాణాలు తీశాయి. John Hersey రాసినట్లు ఆ పేలుళ్ళకు మిగిలిన వారు అత్యంత దుర్భరంగా బతికారు.రేడియేషన్ వ్యాధులు, కేన్సర్, జన్యు వైకల్యాలు తరతరాలు వేధించాయి. రసాయన ఆయుధాలు మానవ చరిత్రలో అత్యంత క్రూరమైన ఆవిష్కరణలలో ఒకటి. సిరియా అంతర్యుద్ధంలో (2013) సరీన్, క్లోరిన్, గ్యాస్ వాడకం ద్వారా ప్రాణాలు హరించబడ్డాయి. రసాయన ఆయుధాల ప్రభావం దశాబ్దాల పాటు నేలలో, నీళ్ళలో నిలిచి పంటలు పండవు, పశువులు చనిపోతాయి, పిల్లలలో శ్వాసకోశ వ్యాధులు పెరుగుతాయి. SIPRI 2023 నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా క్షిపణి ఆయుధ వ్యయం 2.2 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది ఇది ప్రపంచంలోని అన్ని దేశాల ఆరోగ్య బడ్జెట్‌ను మించిపోయే సంఖ్య.

**పర్యావరణంపై ప్రభావం**.. యునైటెడ్ నేషన్స్ ఎన్విరాన్మెంట్ ప్రోగ్రామ్ (UNEP) నివేదికల ప్రకారం ఆధునిక యుద్ధాలలో అడవులు, నీటి వనరులు, మట్టి సంపద తీవ్రంగా దెబ్బతింటున్నాయి. వియత్నాం యుద్ధకాలంలో (1955-1975) అమెరికా సైన్యం వాడిన "ఏజెంట్ ఆరెంజ్" రసాయన పదార్థం వల్ల 50 లక్షల ఎకరాల పైగా అడవులు నాశనమయ్యాయి. మట్టిలో కలిసిపోయిన ఆ విష రసాయనాల ప్రభావం నేటికీ వియత్నాం మట్టిలో, పిల్లల శరీరాలలో కనిపిస్తూనే ఉంది. 1991 గల్ఫ్ యుద్ధంలో కువైత్ చమురు బావులలో మంటలు రేగి నెలల పాటు మండటం వల్ల 10 కోట్ల టన్నుల కార్బన్ డయాక్సైడ్ వాతావరణంలో కలిసింది. సముద్రంలో చమురు చిందడంతో సుమారు 700 కిలోమీటర్ల మేర జీవవైవిధ్యం నష్టపోయింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం వల్ల సుమారు 500 కోట్ల డాలర్ల పర్యావరణ నష్టం సంభవించిందని అంచనా. సైనిక కార్యకలాపాలు, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాల్లో సుమారు 5.5%కు కారణమవుతున్నాయి. గాజా-ఇజ్రాయిల్ యుద్ధాల



వల్ల సుమారు 3.2 కోట్ల టన్నుల కార్బన్ ఉద్గారాలు గాలిలోకి చేరినట్లు అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రస్తుత పశ్చిమాసియా యుద్ధం మరింత కాలం కొనసాగితే హోర్ముజ్ జలసంధి వాణిజ్యం ముప్పులో పడుతుంది.ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ హెచ్చరిక ప్రకారం ఇక్కడ సంఘర్షణ తీవ్రమైతే ముడి చమురు ధర బ్యారెల్‌కు 150 డాలర్లకు చేరే ప్రమాదముంది. చమురు, గ్యాస్ ధరలు ఇప్పటికే సుమారు 25% పెరిగాయి. దీనివల్ల ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు చిన్న పరిశ్రమలు, వ్యవసాయం మీద అధిక భారం పడుతోంది. సప్లయి కొరత ద్రవ్యోల్బణానికి దారి తీయవచ్చు. రాచేల్ కార్సన్ తన "సైలెంట్ స్ప్రింగ్" పుస్తకంలో యుద్ధకాల రసాయనాలు ప్రకృతిపై చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ యుద్ధం అంటే అది భూమికి పెద్ద గాయం, అది మాయడానికి శతాబ్దాలు పట్టవచ్చు అన్నారు.

**ఆర్థిక వ్యవస్థపై**.. యుద్ధం ఆర్థిక వ్యవస్థను మూలాల నుండి తెంచివేస్తుంది. ప్రపంచం 2024 నుండి ఇప్పటి వరకు సుమారు 2.6 లక్షల కోట్ల డాలర్లను మిలిటరీ ఖర్చులకు వినియోగించింది. ఈ మొత్తం ద్వారా ప్రపంచానికి తాగునీరు, ఆహార భద్రత వంటి ప్రాథమిక అవసరాలు తీర్చవచ్చు. ఈ ఖర్చులో అమెరికా వాటా సుమారు 38% ఉండటం గమనార్హం. వరల్డ్ బ్యాంకు అంచనాల ప్రకారం ఉక్రెయిన్ యుద్ధం (2022) వల్ల ఆ దేశానికి 400 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లింది. జోసెఫ్ స్టిగిలిజ్ మరియు లిండా బిమ్స్ రాసిన "ది త్రీ ట్రిలియన్ డాలర్ వార్" పుస్తకం ప్రకారం ఇరాక్ యుద్ధం వల్ల అమెరికాకే 3 ట్రిలియన్ డాలర్ల నష్టం అంచనా వేయబడింది. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలి హైపర్ ఇన్‌ఫ్లేషన్ వచ్చింది. ఒక రొట్టె కొనడానికి పెట్టెల నిండా డబ్బు తీసుకెళ్ళవలసి వచ్చింది. అగ్ర దేశాలు పేద దేశాలకు ఇచ్చే ఆర్థిక సహాయం 50% కంటే ఎక్కువగా తగ్గిపోయింది. పేదల పౌష్టికాహారంపై కోతలు విధించబడ్డాయి. ఉక్రెయిన్ ప్రపంచానికి "గోధుమల గిడ్డంగి".అక్కడి యుద్ధం వల్ల ఆఫ్రికా, ఆసియాలో ఆకలి మంటలు రేగాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన ఆహార కొరత, కిక్కిరిసిన సైనిక శిబిరాలు, ప్రజల తరలింపు వల్ల వైరస్ వేగంగా వ్యాప్తి చెంది యూరప్‌లో 1918-1919 స్పానిష్ ఫ్లూ మిలియన్లకు పైగా ప్రాణాలు తీసింది. యుద్ధం, వ్యాధి, ఆకలి మూడూ కలిసి నడుస్తాయని చరిత్ర నిరూపించింది. గాజాలో పాఠశాలలు ధ్వంసమయ్యి లేదా ఆశ్రయ శిబిరాలుగా మారాయి. UNICEF 2023 నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా సంఘర్షణ ప్రభావిత ప్రాంతాల్లో అధిక సంఖ్యలోపిల్లలు చదువు మానేశారు. "ఎడ్యుకేషన్ ఈజ్ ది మోస్ట్ పవర్ఫుల్ వెపన్ విచ్ యు కెన్ యూజ్ టు చేంజ్ ది వరల్డ్" అని నెల్సన్ మండేలా అన్నారు. ఆ ఎడ్యుకేషన్ అనే ఆయుధాన్నే యుద్ధం మొట్టమొదట నాశనం చేస్తుంది.

**శాంతి మాత్రమే శాశ్వత పరిష్కారం**

యుద్ధం ముగిసినా దాని నీడ ఎప్పుడికీ అదృశ్యం కాదు. వియత్నాంలో నేటికీ ల్యాండ్‌మైన్‌లు మోగుతున్నాయి. PTSD- (పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిసర్డర్) అనే మానసిక వ్యాధి యుద్ధ సైనికుల్లో 30% వరకు నమోదవుతుందని అమెరికన్ సైకాలజికల్ అసోసియేషన్ నిర్ధారించింది. హిరోషిమాపై బాంబు పడిన 75 సంవత్సరాల తర్వాత కూడా అక్కడ పుట్టే శిశువుల్లో జన్యు వ్యాధులు నమోదవుతూనే ఉన్నాయి. నేడు ప్రపంచంలో 10,000 కు పైగా అణ్వాయుధాలు సిద్ధంగా ఉన్నాయని SIPRI నిర్ధారించింది. ఒక్క అణుయుద్ధం జరిగితే వాతావరణం "అణు శీతాకాలం"లో కూరుకుపోతుందని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. ఇరవై ఒకటో శతాబ్దంలోనూ రష్యా-ఉక్రెయిన్, గాజా, సూడాన్, మధ్యప్రాచ్యం వంటి యుద్ధభూముల నుండి వస్తున్న దృశ్యాలు మనిషి హృదయాన్ని మూగబోయేలా చేస్తున్నాయి. చనిపోయిన వారిలో 50% పైగా మహిళలు, పిల్లలే. వలసలు, కుటుంబ విచ్ఛిన్నం, పేదరికం యుద్ధం వదిలిపెట్టిన ఈ "వారసత్వాలు" తరతరాలు వేధిస్తాయి. ఆల్బర్ట్ కామస్ అన్నట్లు, "పీస్ ఈజ్ ది ఓన్లీ బ్యాటిల్ వర్త్ వేజింగ్. ఒక దేశం నిర్మించడానికి వేల సంవత్సరాలు కావాలి. కానీ ఒక యుద్ధం అన్నింటినీ క్షణాల్లో ధ్వంసం చేయగలదు. క్షిపణులు, రసాయన ఆయుధాలు, అణుబాంబులు ఇవి శత్రువులను కాదు, మానవాళి మొత్తాన్ని ముప్పులో నెట్టివేస్తాయి. యుద్ధం సమస్యకు పరిష్కారం కాదు, అది సమస్యనే. అందుకే శాంతి చర్చలే శాశ్వత పరిష్కారం. శాంతిని మన పిల్లలకు వారసత్వంగా అందిద్దాం.



గిలకత్తుల
వెంకటరమణ గౌడ్
9866878769

# గతాన్ని శత్రువుగా కాదు.. గురువుగా చూడండి!



రాత్రి నిశ్శబ్దంగా ఉంటుంది కానీ, మనసు మాత్రం హోరున గర్జించే సముద్రంలా మారుతుంది. గడియారం ముల్లు టిక్ టిక్ మంటూ కదులుతున్నా, కనురెప్పలు మాత్రం భారం కావు. గంటల తరబడి కళ్ళు మూసుకున్నా మనసు తలుపులు తెరుచుకునే ఉంటాయి. ఆ చీకటిలో గతంలో జరిగిన సంఘటనలు ఒక తప్పిపోయిన ప్రేమ, అనుకోని అవమానం, ఊహించని విఫలత, గుండెను పిండేసే ఒక విషాదం అన్నీ ఒక సినిమా రీలులా కళ్ళ ముందు కదలాడుతుంటాయి. ఆ రోజు అలా ఎందుకు జరిగింది?,నేను అలా అనకపోయి ఉంటే పరిస్థితి వేరేలా ఉండేదా? అని మనసు తనను తాను ప్రశ్నించుకుంటూనే ఉంటుంది. ఎంత ప్రయత్నించినా, ఎంత విదిలించుకున్నా గతం మనల్ని వీడదు. ఈ అనుభవం మీకూ తెలుసా? ఆ నిద్రలేని రాత్రుల నొప్పి మీకూ పరిచయమేనా? అయితే, మీరు ఒంటరి వారు కాదు. ఇది ప్రతి మానవ హృదయపు అంతర్మథనం.మానవుని మనసు ఒక అద్భుతమైన, సంక్లిష్టమైన సాధనం. అది కేవలం ఆలోచనల పుట్ట మాత్రమే కాదు, అది ఒక అనంతమైన భాండాగారం. అది ఆనందాన్ని నిలువ చేస్తుంది, జ్ఞానాన్ని సంగ్రహిస్తుంది, ప్రేమను పదిలపరుస్తుంది. కానీ అదే మనసు గతపు గాయాలను, పాత బాధలను కూడా అంతే శ్రద్ధగా భద్రపరుస్తుంది. ఇది మానవాళికి లభించిన వరమా లేక నిరంతరం వెంటాడే శాపమా? ఈ ప్రశ్న వేల సంవత్సరాల నుండి తత్వవేత్తలను, శాస్త్రవేత్తలను, సామాన్యులను వేధిస్తూనే ఉంది.మెదడు పరిశోధనలో నోబెల్ బహుమతి గ్రహీత, ప్రముఖ నాడీ శాస్త్రవేత్త ఎరిక్ కాండెల్ పరిశోధనల ప్రకారం, మన జ్ఞాపకాలు కేవలం మెదడులో దాచుకున్న సమాచారం మాత్రమే కాదు అవి మన ఉనికికి మూలస్తంభాలు. ముఖ్యంగా బాధాకరమైన సంఘటనలను మన మెదడులోని 'అమిగ్డాలా' (Amygdala) అనే భాగం మరింత స్పష్టంగా, తీవ్రంగా నమోదు చేస్తుంది. ఇది పరిణామక్రమంలో మనిషి మనుగడ కోసం ప్రకృతి ప్రసాదించిన రక్షణ కవచం. ఆదిమ కాలంలో ఒక మనిషికి అడవిలో ఏ జంతువు వల్ల ప్రమాదం జరిగిందో గుర్తుండటం అతని ప్రాణాన్ని కాపాడేది. నొప్పి కలిగించిన పరిస్థితిని గుర్తుపెట్టుకో, మళ్ళీ ఆ ప్రమాదంలో చిక్కుకోకు అని మెదడు మనకు చేసే నిరంతర హెచ్చరిక అది.కానీ ఆధునిక జీవనశైలిలో మన సమస్యలు భౌతికమైనవి కావు, మానసికమైనవి. పూర్వపు మనిషికి గండుచీమ కుట్టిందని గుర్తుండటం అవసరం, కానీ నేటి మనిషికి పది సంవత్సరాల క్రితం ఆఫీసులో ఎవరైనా నిర్లక్ష్యంగా మాట్లాడిన మాటలు గుర్తుండటం ప్రాణాన్ని తోడేస్తుంది. అవసరం లేకపోయినా మనసు పదే పదే గతంలోకి వెళ్ళి ఆ బాధను అనుభవించడాన్ని మనోవిజ్ఞాన శాస్త్రం "రుమినేషన్" (Rumination) లేదా 'అవిరళ చింతన' అని పిలుస్తుంది. ఇది ఒక విషవలయం లాంటిది,ఎంత బయటకు రావాలని చూస్తే అంత లోపలికి లాగుతుంది. గతంలో చిక్కుకోవడం అనేది ఏదో మానసిక రుగ్మత అని మనం భయపడుతుంటాం. కానీ నిజానికి అది మానవ స్వభావం. ఆ గతాన్ని మనం ఎలా స్వీకరిస్తామనే దానిపైనే మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. భారతీయ ఇతిహాసం మహాభారతంలో ధర్మరాజు పాత్రను పరిశీలిస్తే, అతడు ద్రౌపది వస్త్రాపహరణం అనే ఘోర అవమానాన్ని జీవితాంతం తన మనసులో మోసాడు. ఆ గాయం అతడిని లోపలి నుండి దహించింది. కానీ అదే వేదన అతడిని అధర్మంపై పోరాడటానికి, ఒక మహా యుద్ధానికి సంసిద్ధుడిని చేసింది. గతపు వేదన ఇక్కడ ఒక గొప్ప లక్ష్యం వైపు నడిపించే ఇంధనమైంది.అదే విధంగా మహాత్మా గాంధీ జీవితాన్ని చూడండి. దక్షిణాఫ్రికాలో తెల్లవారు ఆయనను రైలు నుండి బయటకు తోసివేసిన ఆ రాత్రిని ఆయన ఎన్నటికీ మర్చిపోలేదు. ఆ అవమానపు జ్ఞాపకం ఆయనను కుంగదీయలేదు, సరి కదా మరింత దృఢంగా నిలబెట్టింది. ఒక వ్యక్తిగత గాయం, ఒక జాతి విముక్తికి నాంది పలికింది. అంటే, గతాన్ని మర్చిపోవడం కంటే, ఆ గతంలోని గాయాన్ని శక్తిగా మార్చుకోవడం గొప్ప కళ.మనం తరచుగా వినే సలహా ఒకటి ఉంటుంది.గతాన్ని వదిలిపెట్టు, మర్చిపోయి ముందుకు సాగు.వినడానికి ఇది బాగుంటుంది కానీ, ఆచరణలో గతాన్ని పూర్తిగా మర్చిపోవడం ప్రమాదకరం. చరిత్ర మనకు నేర్పిన పాఠాలు జ్ఞాపకం లేకపోతే మానవాళి మనుగడకే ముప్పు వాటిల్లుతుంది. నాజీల హత్యాకాండను, హిరోషిమా నాగసాకి విషాదాలను, మన దేశంలో జరిగిన సామాజిక అన్యాయాలను మనం మర్చిపోతే, అవే తప్పులను మళ్ళీ చేసే అవకాశం ఉంటుంది.వ్యక్తిగత జీవితంలోనూ ఇదే సూత్రం వర్తిస్తుంది. ఒక విషపూరితమైన సంబంధం (Toxic Relationship) వల్ల కలిగిన బాధను మనం పూర్తిగా మర్చిపోతే, మళ్ళీ అదే తరహా వ్యక్తితో తప్పు చేసే ప్రమాదం ఉంటుంది. ఒక వ్యాపార వైఫల్యం నుండి వచ్చిన పాఠాన్ని మర్చిపోతే మళ్ళీ నష్టపోతాం.

జ్ఞాపకం అది గాయమైనా, ఆనందమైనా మనిషిని పరిపూర్ణుడిని చేసే ఒక మూలద్రవ్యం. నేను ఎవరు? అన్న ప్రశ్నకు సమాధానం మన జ్ఞాపకాలలోనే దాగి ఉంటుంది. జ్ఞాపకాలు లేని మనిషి మూలాలు లేని చెట్టు వంటివాడు.మరి నిరంతరం వేధించే ఈ బాధలతో ఎలా వ్యవహరించాలి? వాటిని మర్చిపోవడం అసాధ్యమని తెలిసిన తర్వాత మనం చేయాల్సింది ఏమిటి? మనోవిజ్ఞాన శాస్త్రం అంగీకారం (Acceptance) అనే ఒక శక్తివంతమైన సాధనాన్ని మనకు చూపిస్తుంది. బాధను తొలగించుకోవడం మన లక్ష్యం కాకూడదు, ఆ బాధతో పాటు గౌరవంగా జీవించడం నేర్చుకోవాలి. ఉదాహరణకు, మనకు ఇష్టమైన వారు చనిపోయినప్పుడు ఆ శోకాన్ని పూర్తిగా చంపుకోవడం సాధ్యం కాదు. ఎందుకంటే ఆ శోకం వారు మనపై చూపిన ప్రేమకు మరో రూపం. ఆ జ్ఞాపకాన్ని పక్కన పెట్టడం కాదు, ఆ జ్ఞాపకాన్ని హృదయంలో ఒక మూల పదిలపరుచుకుంటూనే మన బాధ్యతలను నెరవేర్చాలి. తెలుగు సాహితీ దిగ్గజం శ్రీశ్రీ ఒకచోట రాశారు.గతమంతా పోగొట్టుకున్నా / వర్తమానమే చాలు బ్రతకడానికి. కానీ గమనించాల్సిన విషయం ఏమిటంటే, శ్రీశ్రీ తన గతపు అనుభవాల నుండి, సమాజంలో చూసిన గాయాల నుండే తన మహాప్రస్థాన కవిత్వానికి ఊపిరిని పోశారు. గతం లేకపోతే శ్రీశ్రీ లేడు, గతం లేకపోతే మనమూ లేము.భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి చెప్పిన పరమ సత్యం .గతాన్ని గురించి చింతించకు, భవిష్యత్తు గురించి భయపడకు, వర్తమానంలో నిలబడు. ఇది కేవలం ఆధ్యాత్మిక సందేశం మాత్రమే కాదు, ఇది ఒక గొప్ప సైకలాజికల్ థెరపీ. బౌద్ధ ధర్మంలోని మైండ్‌ఫుల్‌నెస్ (Mindfulness) కూడా ఇదే చెబుతుంది. గతాన్ని ఒక సాక్షిలా చూడటం నేర్చుకోవాలి. నది గట్టు మీద నిలబడి నీటిని చూడటం వేరు, ఆ ప్రవాహంలో మునిగిపోవడం వేరు. జ్ఞాపకాలు నది లాంటివి అవి పారుతూనే ఉంటాయి. మనం గట్టు మీద నిలబడి వాటిని గమనించాలే తప్ప, వాటిలో కొట్టుకుపోకూడదు. దీన్నే వేదాంతంలో సాక్షి భావం అంటారు. నేటి సోషల్ మీడియా యుగంలో గతాన్ని మర్చిపోవడం గతంలో కంటే వంద రెట్లు కష్టమైంది. గతంలో పాత ఉత్తరాలు చింపేస్తేనో, ఫోటోలు దాచేస్తేనో గతం కళ్ళకు దూరమయ్యేది. కానీ ఇప్పుడు ఫేస్‌బుక్ మెమరీస్ పేరుతో పాత ఫోటోలను మళ్ళీ మళ్ళీ మన ఫోన్లలో ప్రత్యక్షం చేస్తుంది. వాట్సాప్ చాట్‌లు, ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లు మన గతాన్ని ఎప్పటికప్పుడు వర్తమానంలోకి లాక్కు వస్తాయి. డిజిటల్ ప్రపంచంలో గతం ఎన్నటికీ చనిపోదు. ముఖ్యంగా యువతరం ఈ సమస్యతో సతమతమవుతోంది. విడిపోయిన ప్రేమికుల ఫోటోలు, పాత మెసేజ్‌లు ఫోన్లలో భద్రంగా ఉండి, వారిని ముందుకు సాగనివ్వకుండా అడ్డుపడుతున్నాయి. ఇక్కడ మనిషి తన డిజిటల్ అలవాట్లను మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గతాన్ని మర్చిపోలేకపోవడం ఒక శాపం కాదు దానిని సరిగ్గా అర్థం చేసుకోలేకపోవడం మాత్రమే మనల్ని బాధిస్తుంది. ఒక కుమ్మరి మట్టిని తన చేతులతో పిసికినప్పుడు ఆ మట్టికి నొప్పిగా అనిపించవచ్చు, కానీ ఆ పిసుకుడు లేకపోతే దానికి ఒక అందమైన ఆకారం రాదు. జీవితం కూడా మనల్ని అనుభవాల గుండా పిసికి ఒక పరిపూర్ణమైన వ్యక్తిత్వాన్ని ఇస్తుంది. మన గతపు గాయాలే మన లోతును, మన సానుభూతిని, మన శక్తిని రూపొందిస్తాయి. ఒక తల్లి తన పిల్లాడిని జ్ఞాపకం చేసుకుని ఏడ్చినప్పుడు ఆ కన్నీళ్ళు ప్రేమకు సాక్ష్యాలు. ఒక కళాకారుడు తన వైఫల్యాన్ని తలచుకుని బాధపడినప్పుడు ఆ వేదన తదుపరి అద్భుత సృష్టికి ఆజ్యం. అందుకే గతాన్ని తరిమికొట్టాలని చూడకండి. దానిని మీ కల్పవృక్షంగా మార్చుకోండి. మీరు ఈ రోజు ఎవరైనా, ఏ స్థితిలో ఉన్నా అది మీ గతపు అనుభవాల వల్లే అయ్యారు. ఆ గతాన్ని తిరస్కరించడం అంటే మిమ్మల్ని మీరు తిరస్కరించుకోవడమే. గుర్తుంచుకోండి, జ్ఞాపకం ఉంటేనే జీవితానికి ఒక అర్థం ఉంటుంది. బాధ ఉంటేనే ఆనందం విలువ తెలుస్తుంది. గతం ఉంటేనే భవిష్యత్తుకు పునాది పడుతుంది. గతాన్ని మర్చిపోలేకపోవడం బలహీనత కాదు, అది మనలోని మానవత్వానికి పచ్చబొట్టు. గతాన్ని గౌరవించండి, వర్తమానాన్ని ప్రేమించండి, భవిష్యత్తును ఆహ్వానించండి.

**ఒక తల్లి తన పిల్లాడిని జ్ఞాపకం చేసుకుని ఏడ్చినప్పుడు ఆ కన్నీళ్ళు ప్రేమకు సాక్ష్యాలు. ఒక కళాకారుడు తన వైఫల్యాన్ని తలచుకుని బాధపడినప్పుడు ఆ వేదన తదుపరి అద్భుత సృష్టికి ఆజ్యం. అందుకే గతాన్ని తరిమికొట్టాలని చూడకండి. దానిని మీ కల్పవృక్షంగా మార్చుకోండి. మీరు ఈ రోజు ఎవరైనా, ఏ స్థితిలో ఉన్నా అది మీ గతపు అనుభవాల వల్లే అయ్యారు. ఆ గతాన్ని తిరస్కరించడం అంటే మిమ్మల్ని మీరు తిరస్కరించుకోవడమే.**

*నేటి సోషల్ మీడియా యుగంలో గతాన్ని మర్చిపోవడం గతంలో కంటే వంద రెట్లు కష్టమైంది. గతంలో పాత ఉత్తరాలు చింపేస్తేనో, ఫోటోలు దాచేస్తేనో గతం కళ్ళకు దూరమయ్యేది. కానీ ఇప్పుడు ఫేస్‌బుక్ మెమరీస్ పేరుతో పాత ఫోటోలను మళ్ళీ మళ్ళీ మన ఫోన్లలో ప్రత్యక్షం చేస్తుంది. వాట్సాప్ చాట్‌లు, ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లు మన గతాన్ని ఎప్పటికప్పుడు వర్తమానంలోకి లాక్కు వస్తాయి. డిజిటల్ ప్రపంచంలో గతం ఎన్నటికీ చనిపోదు. ముఖ్యంగా యువతరం ఈ సమస్యతో సతమతమవుతోంది. విడిపోయిన ప్రేమికుల ఫోటోలు, పాత మెసేజ్‌లు ఫోన్లలో భద్రంగా ఉండి, వారిని ముందుకు సాగనివ్వకుండా అడ్డుపడుతున్నాయి. ఇక్కడ మనిషి తన డిజిటల్ అలవాట్లను మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతాన్ని మర్చిపోలేకపోవడం ఒక శాపం కాదు దానిని సరిగ్గా అర్థం చేసుకోలేకపోవడం మాత్రమే మనల్ని బాధిస్తుంది.*



డా.సూర్యదేవర
రామకృష్ణ
9490754169



# జాతీయం-అంతర్జాతీయం



### పెట్రోల్, డీజిల్‌పై

### వినియోగదారుడికి తక్షణ ప్రయోజనం ఉందా?

# ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు

**న్యూఢిల్లీ, మార్చి 27 (వుదయం) :**

పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీని శుక్రవారం ప్రభుత్వం తగ్గించింది. లీటర్‌కు రూ. 10 చొప్పున డ్యూటీ తగ్గింది. ఈ సవరణ కారణంగా కేంద్ర పన్నులలో లీటర్ పెట్రోల్‌పై మూడు రూపాయలు తగ్గుతుంది. ఇక డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ సున్నాగా ఉండనుంది. ఈ సవరణ చూడగానే, వినియోగదారులకు ఉపశమనం కల్పించేదిగా కనిపిస్తుంది. అయితే, ఇది పెట్రోల్ పంపులలో తక్కువ ధరగా తర్జుమా అవుతుందా అన్నదే ప్రశ్న.



**తక్షణమే ధరలు ఎందుకు తగ్గవు?**

ఎక్సైజ్ డ్యూటీ భారీగా తగ్గినప్పటికీ, చాలామంది వినియోగదారులకు రిటైల్ ఇంధన ధరలు తగ్గకపోవచ్చని ఎన్డీటీవీ ప్రాఫిట్ పేర్కొంది. ఇందుకు కారణం, ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (ఒఎంసిలు) ప్రస్తుతం ఇంధన అమ్మకాలపై గణనీయమైన నష్టాలను చవిచూస్తున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, ప్రధానంగా ప్రపంచ ముడి చమురు ధరల పెరుగుదల కారణంగా, ఒఎంసిలు పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ. 48.8 నష్టపోతున్నాయి.

ఫలితంగా, ఈ సుంకం తగ్గింపు భారాన్ని తుది వినియోగదారులకు బదిలీ చేయకుండా, తమ నష్టాలను పూడ్చుకోవడానికి ఈ కంపెనీలే తీసుకుంటాయని అంచనా.

**ముడి చమురు సంక్షోభం: అసలు కారణం**

ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం, హొర్ముజ్ జలసంధిలో అంతరాయాల నేపథ్యంలో, బ్రెంట్ ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటి, విపరీతంగా పెరగడంతో ఈ భారీ నష్టాలు సంభవిస్తున్నాయి. కొనసాగుతున్న ఈ సంఘర్షణ పశ్చిమాసియా ప్రాంతం నుండి చమురు, గ్యాస్ ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపింది, దీనివల్ల ప్రపంచ సరఫరా తగ్గి, ముడిసరుకుల ఖర్చులు పెరిగాయి.

**ఇప్పటికే ధరలు పెంచిన ప్రైవేట్ సంస్థలు**

నయారా ఎనర్జీ ఇంధన ధరలను పెంచిన కొద్ది కాలానికే ఈ సుంకం తగ్గింపు వచ్చింది. ఆ సంస్థ పెట్రోల్ ధరను లీటరుకు రూ. 5.3, డీజిల్ ధరను లీటరుకు రూ. 3 పెంచింది. రష్యన్ సంస్థ రోస్నెఫ్ట్, కేసాని ఎంటర్‌ప్రైజెస్ మద్దతు ఉన్న నయారా ఎనర్జీ, భారతదేశ ఇంధన రిటైల్ రంగంలో సుమారు 8.4 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది.

**హొర్ముజ్ జలసంధి ఎందుకు కీలకం**

ప్రపంచ ఇంధన సరఫరాలో హొర్ముజ్ జలసంధి కీలక పాత్ర పోషిస్తుంది. సంఘర్షణకు ముందు, ప్రపంచ సముద్ర మార్గ ముడి చమురు, గ్యాస్‌లో దాదాపు ఐదవ వంతు, అంటే రోజుకు 20 నుండి 25 మిలియన్ బ్యారెల్ల ముడి చమురు, సుమారు 10 బిలియన్ క్యూబిక్ అడుగుల గ్యాస్, ఈ మార్గం గుండా రవాణా అయ్యేది. భారతదేశానికి, ఇది చాలా కీలకమైంది. ఎందుకంటే, చారిత్రాత్మకంగా, రోజుకు 2.2 నుండి 2.8 మిలియన్ బ్యారెల్లుగా అంచనా వేసిన ముడి చమురు దిగుమతులలో దాదాపు 40 నుండి 50 శాతం ఈ మార్గం గుండానే జరుగుతాయి. భారతదేశం తన ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జి)లో 16 నుండి 17 శాతాన్ని ఖతార్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి ఈ మార్గం ద్వారానే దిగుమతి చేసుకుంటుంది. దీనికి అదనంగా, 33 కోట్లకు పైగా కుటుంబాలు ఉపయోగించే భారీ పరిమాణంలో ద్రవీకృత పెట్రోలియం గ్యాస్ (ఎల్‌పిజి) ఈ ప్రాంతం నుండే వస్తుంది, ఇందులో హొర్ముజ్ జలసంధి ద్వారా వచ్చే సరఫరాలు కూడా ఉన్నాయి.

**సరఫరాపై ఆందోళనలు - ప్రభుత్వ స్పందన**

ఈ అంతరాయం భారతదేశంలో ఇంధన కొరత ఏర్పడే అవకాశంపై ఆందోళనలను రేకెత్తించింది. అయితే, ప్రభుత్వం వినియోగదారులకు భరోసా ఇచ్చేందుకు ప్రయత్నించింది. ప్రస్తుతం దేశంలో సుమారు 60 రోజుల ముడి చమురు నిల్వలు, దాదాపు 30 రోజుల ఎల్‌పిజి సరఫరా ఉన్నాయని అధికారులు తెలిపారు. కొరతను సూచిస్తున్న నివేదికలను ఉద్దేశపూర్వక తప్పుడు సమాచార ప్రచారంగా కొట్టిపారేశారు. ప్రమాదాలను తగ్గించడానికి, ముడి చమురు, ఎల్‌పిజి దిగుమతి వనరులను వైవిధ్యపరచడానికి ప్రభుత్వం ప్రయత్నాలను వేగవంతం చేస్తోంది.

**భారతదేశం ఎంత సిద్ధంగా ఉంది?**

భారతదేశ వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ప్రస్తుతం సుమారు 3.372 మిలియన్ టన్నులు, అంటే మొత్తం సామర్థ్యంలో దాదాపు మూడింట రెండు వంతులు ఉన్నాయని పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేష్ గోపి పార్లమెంటుకు తెలియజేశారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల వద్ద ఉన్న నిల్వలతో సహా మొత్తం నిల్వలు సుమారు 74 రోజులకు సరిపోతాయని ఆయన తెలిపారు. ఎల్‌పిజి విషయానికొస్తే, భయాందోళనలతో కొనుగోళ్లు చేయాల్సిన అవసరం లేదని పునరుద్ఘాటిస్తూ, మార్చి ప్రారంభంలో దేశీయ ఉత్పత్తిని 25 శాతం పెంచుతున్నట్లు ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. ఎక్సైజ్ సుంకం తగ్గింపు ఉపశమనం కలిగించినట్లు కనిపించినప్పటికీ, వినియోగదారులకు దాని తక్షణ ప్రయోజనం అనిశ్చితంగానే ఉంది. చమురు కంపెనీలు పెరిగిన ముడిసరుకు వ్యయాలు, ప్రపంచవ్యాప్త సరఫరా అంతరాయాలతో సతమతమవుతున్నందున, ఈ తగ్గింపు కనీసం ప్రస్తుతానికి, ఇంధన పంపుల వద్ద ప్రత్యక్ష ఉపశమనం కంటే పరిశ్రమకు ఒక రక్షణ కవచంలా పనిచేసే అవకాశం ఉంది.

# అయోధ్యలో రాముడిని దర్శించిన ప్రధాని మోడీ

**అయోధ్య, మార్చి 27 (వుదయం) :**

రామ నవమి సందర్భంగా దేశమంతటా ప్రగాఢ భక్తిభావం వెల్లివిరిసింది. ఈ క్రమంలో అందరి దృష్టి అయోధ్య పైనే ఉంది. ప్రధాన ఘట్టమైన పవిత్ర సూర్య తిలకం కార్యక్రమం, భక్తులను భావోద్వేగంతో, భక్తిభావంతో ముంచెత్తింది. ఆ క్షేత్రమంతటా మంత్రోచ్చారణలు ప్రతిధ్వనిస్తుండగా, ఆధ్యాత్మిక విశ్వాసాన్ని కచ్చితమైన శాస్త్రీయ రూపకల్పనతో మేళవించి, ఒక అరుదైన, ప్రతీకాత్మక దృశ్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది.





**రామ మందిరంలో ఆశీర్వాదం పొందిన ప్రధాని మోదీ**

రామనవమి సందర్భంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రామ మందిరాన్ని సందర్శించి, శ్రీరాముని జన్మదినోత్సవాన్ని జరుపుకుంటున్న లక్షలాది మంది భక్తులతో కలిసి రాముడికి ప్రార్థనలు చేశారు. ఆలయ ప్రాంగణాన్ని అందంగా అలంకరించారు. రంగురంగుల వస్త్రధారణలో ఉన్న రామ్ లల్లా విగ్రహాన్ని పూలు, సాంప్రదాయ ఆభరణాలతో అలంకరించడంతో, కనులకు విందుగా, ఆధ్యాత్మికంగా ఉత్తేజపరిచే వాతావరణం నెలకొంది. లక్షలాది భక్తులు అయోధ్యకి తరలివచ్చి, పొడవైన క్యూలలో నిలబడి, భక్తితో నామస్మరణ చేస్తూ ఆ వాతావరణాన్ని ఆధ్యాత్మికతతో నింపేశారు. వేడుకలు ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగేలా చూసేందుకు అధికారులు కట్టుదిట్టమైన భద్రత, జన నియంత్రణ చర్యలను చేపట్టారు.

**రామ మందిరంలో సూర్య తిలక కార్యక్రమం ఏమిటి?**

రామ మందిరంలో జరిగే రామ నవమి వేడుకలలో సూర్య తిలకం కార్యక్రమం ఒక ప్రధాన ఘట్టంగా నిలిచింది. శ్రీరాముని జన్మదినంగా భావించే కచ్చితమైన క్షణంలో, రామ్ లల్లా విగ్రహం నుదుటిపై సూర్యకిరణాన్ని ప్రసరింపజేసి, పవిత్రమైన 'సూర్య తిలకాన్నిస సృష్టిస్తారు. సూర్యుని స్థానానికి అనుగుణంగా జాగ్రత్తగా అమర్చిన, అత్యంత శ్రద్ధతో రూపొందించిన అద్దాలు, కటకాల వ్యవస్థ ద్వారా ఈ అద్భుత దృగ్విషయం సాధ్యమవుతుంది. సుమారు నాలుగు నిమిషాల పాటు, సూర్యకాంతి విగ్రహం నుదుటిపై ఒక ప్రకాశవంతమైన గుర్తును ఏర్పరుస్తుంది, ఇది దైవిక శక్తికి, విశ్వ సమలేఖనానికి ప్రతీకగా నిలుస్తుంది. మధ్యాహ్నం సుమారు 12:00 గంటలకు నిర్వహించిన ఈ క్రతువు, విశ్వాసాన్ని శాస్త్రీయ కచ్చితత్వంతో అందంగా మేళవించి, భక్తులను ఎంతగానో కదిలించింది. అక్కడ ఉన్న చాలా మందికి, సూర్య తిలకాన్ని చూడటం కేవలం కంటికి విందు మాత్రమే కాదు, అది ఒక గాఢమైన ఆధ్యాత్మిక అనుభవం. ఆ అనుభవం నమ్మకం, సంప్రదాయం, భక్తి సారాంశాన్ని ఒకే క్షణంలో ఒడిసిపట్టింది.

# తాను, మోడీ మాత్రమే కార్యశూర్యులం: ట్రంప్

**వుదయం డెస్క్, మార్చి 27 :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో తనకున్న సంబంధాన్ని ప్రశంసించారు. ఇద్దరు నాయకులను పనులను పూర్తి చేసే వ్యక్తులుగా అభివర్ణించారు. భారతదేశంలోని అమెరికా రాయబార కార్యాలయం ఎక్స్ ద్వారా పంచుకున్న ఈ సందేశంలో, అటువంటి సమర్థత చాలా మంది విషయంలో చెప్పలేం అని పేర్కొంటూ, ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. పశ్చిమ ఆసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతల మధ్య ట్రంప్ వ్యాఖ్యలు ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల తర్వాత తీవ్రమైన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నడుమ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉద్రిక్తతలు పెరిగిన తర్వాత ట్రంప్, మోడీలు తొలిసారిగా ఫోన్‌లో మాట్లాడుకున్న తర్వాత ఈ ప్రకటన విడుదలైంది. ఈ సంభాషణలో, ఇద్దరు నేతలు పశ్చిమ ఆసియాలో ప్రాంతంలో నిరంతర సైనిక ఘర్షణలు, పెరుగుతున్న అనిశ్చితి నెలకొన్న పరిస్థితులపై చర్చించారు.



**హొర్ముజ్ జలసంధిపై దృష్టి, ఉద్రిక్తతల తగ్గింపు**

ప్రపంచ ఇంధన సరఫరాలకు కీలకమైన, ప్రపంచంలోని చమురు, గ్యాస్ రవాణాలో దాదాపు ఐదవ వంతును నిర్వహించే హొర్ముజ్ జలసంధి భద్రత చర్చలో ఒక ముఖ్యమైన అంశంగా నిలిచింది. ప్రపంచ మార్కెట్లు, ఇంధన స్థిరత్వంపై దీని ప్రత్యక్ష ప్రభావం దృష్ట్యా, ఈ మార్గాన్ని తెరిచి, సురక్షితంగా ఉంచవలసిన ప్రాముఖ్యతను భారతదేశం నొక్కి చెప్పింది.

ఆ కాల్ అనంతరం, అధ్యక్షుడు ట్రంప్ నుంచి కాల్ వచ్చింది. పశ్చిమ ఆసియాలోని పరిస్థితిపై ఉపయోగకరమైన అభిప్రాయాలను పంచుకున్నాను. వీలైనంత త్వరగా ఉద్రిక్తతలను తగ్గించి, శాంతిని పునరుద్ధరించడానికి భారతదేశం మద్దతు ఇస్తుంది. హొర్ముజ్ జలసంధి తెరిచి, సురక్షితంగా, అందుబాటులో ఉండేలా చూడటం ప్రపంచం మొత్తానికి అత్యవసరం, అని ప్రధాని మోడీ ఎక్స్‌పై పోస్ట్ చేశారు.

**భారతదేశ దౌత్య సమతుల్యత**

న్యూఢిల్లీ తన వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకుంటూనే, సంప్రదింపులు, సంయమనాన్ని సమర్థిస్తూ, జాగ్రత్తతో కూడిన స్పష్టమైన వైఖరిని కొనసాగించింది. ఇంధన దిగుమతులపై ఆధారపడటం, ఆ ప్రాంతంతో బలమైన వాణిజ్య సంబంధాలు కలిగి ఉన్నందున, పశ్చిమ ఆసియాలో స్థిరత్వం భారతదేశానికి అత్యంత కీలకం. వేగంగా మారుతున్న భౌగోళిక రాజకీయ పరిణామాల నడుమ, వాషింగ్టన్, న్యూఢిల్లీల మధ్య కొనసాగుతున్న సమన్వయాన్ని ఇద్దరు నాయకుల మధ్య జరిగిన సంభాషణ ప్రతిబింబిస్తుంది.

**షరతులతో కూడిన ప్రవేశానికి ఇరాన్ సంకేతాలు**

ఇదిలా ఉండగా, ఇరాన్ గల్ఫ్ అంతటా తన ప్రతీకార చర్యలను కొనసాగించింది, కానీ భారతదేశంతో సహా స్నేహపూర్వక దేశాలుగా పేర్కొన్న దేశాలకు హొర్ముజ్ జలసంధి తెరిచే ఉంటుందని సూచించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఈ వైఖరిని పునరుద్ఘాటించారు, ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ, ఈ కీలకమైన నౌకా రవాణా మార్గానికి ఎంపిక చేసిన వారికి మాత్రమే ప్రవేశం కల్పిస్తున్నామని సూచించారు.

# నేపాల్ ప్రధానిగా బాలేంద్ర షా ప్రమాణ స్వీకారం

**వుదయం డెస్క్, మార్చి 27:**

రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్ఎస్‌పి) నాయకుడు బాలేంద్ర షా శుక్రవారం నాడు నేపాల్ ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. అతి పిన్న వయసులో ప్రమాణ స్వీకారం చేసిన బాలేంద్ర షా వయసు 35 సంవత్సరాలు. మార్చి 5న జరిగిన ప్రతినిధుల సభ ఎన్నికల్లో ఆయన పార్టీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఆయన నియామకం జరిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోషల్ మీడియా ద్వారా షాకు అభినందనలు తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. "నేపాల్ ప్రధానమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ బలేంద్ర షాకి హృదయపూర్వక అభినందనలు. భారత్-నేపాల్ స్నేహాన్ని, సహకారాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు మీతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను, అని ఆయన అన్నారు.



**సంప్రదాయం, రాజకీయ మార్పు మేళవింపుతో ప్రమాణ స్వీకార కార్యక్రమం**

నేపాల్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 76(1) ప్రకారం, ఆర్ఎస్‌పి పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా షా ప్రమాణ స్వీకారం చేశారు. ఖాట్మండులోని రాష్ట్రపతి కార్యాలయం అయిన శీతల్ నివాస్‌లో రాష్ట్రపతి రామచంద్ర పౌడెల్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో, షా రాజ్యాంగానికి, దేశానికి విధేయతను ప్రకటించి, ప్రధానమంత్రిగా తన విధులను నెరవేరుస్తానని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో శంఖనాదం, 108 మంది బటుక్‌లచే స్వస్తిశాంతి పారాయణం, 16 మంది బౌద్ధ సన్యాసులచే అష్టమంగళ్ మంత్రాల పఠనం వంటి సాంప్రదాయ అంశాలు చోటుచేసుకున్నాయి. తన విలక్షణమైన వ్యక్తిత్వానికి ప్రసిద్ధి చెందిన షా, పూర్తిగా నలుపు రంగు దుస్తులలో, తన ట్రేడ్‌మార్క్ అయిన ముదురు రంగు సన్ గ్లాసెస్‌తో కనిపించి, దేశీయంగా, అంతర్జాతీయంగా ప్రజల దృష్టిని ఆకర్షించారు.

**రాపర్ నుండి సంస్కరణవాద నాయకుడిగా**

షా అధికారంలోకి రావడం నేపాల్‌లో ఒక ముఖ్యమైన రాజకీయ మార్పును సూచిస్తుంది. ఒకప్పుడు రాపర్‌గా ఉండి, ఆ తర్వాత రాజకీయ నాయకుడిగా మారిన ఆయన, మొదట ఖాట్మండు మేయర్‌గా ప్రాముఖ్యత పొందారు. అక్కడ ఆయన సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకంగా తన ఘర్షణపూరిత వైఖరితో, తరచుగా సింఘా దర్బార్‌ను సవాలు చేస్తూ పేరు సంపాదించారు. ఖాట్మండు పరిపాలనా హక్కుల కోసం వాదించడం, ప్రజా వివాదాల సమయంలో ధైర్యంగా జోక్యం చేసుకోవడం వంటివి ఆయన రాజకీయ చతురతకి నిదర్శనం. ఈ అత్యున్నత పదవికి ఎదగడంతో, నేపాల్ ప్రధానమంత్రిగా పనిచేసిన మాధేశీ వర్గానికి చెందిన మొదటి నాయకుడిగా కూడా షా నిలిచారు. ఎన్నికలకు ముందే ఆర్ఎస్‌పి, షాను తమ ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రకటించింది. ఆ ఎన్నికలలో ఆ పార్టీ 182 స్థానాలను గెలుచుకుని పార్లమెంటులో అతిపెద్ద శక్తిగా అవతరించింది.

# లాక్‌డౌన్ వదంతులు అసత్యం, బాధ్యతారహితం

### పెట్రోలియం మంత్రి పూరి

**న్యూఢిల్లీ, మార్చి 27 (వుదయం) :**

దేశవ్యాప్త లాక్‌డౌన్ వదంతులను కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి శుక్రవారం కొట్టిపారేశారు. ఆ వదంతులు పూర్తిగా అవాస్తవం అని పేర్కొంటూ, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే ప్రయత్నాల పట్ల ఆయన హెచ్చరించారు. భారత ప్రభుత్వం అటువంటి ప్రతిపాదనను పరిశీలించడంలేదు అని పూరి పేర్కొంటూ, పౌరులు ప్రశాంతంగా, బాధ్యతాయుతంగా ఉండాలని కోరారు. ఇలాంటి పరిస్థితుల్లో పుకార్లు వ్యాప్తి చేసి, భయాందోళనలు సృష్టించే ప్రయత్నాలు బాధ్యతారహితమైనవి,హానికరమైనవి, అని ఆయన అన్నారు. ప్రపంచ ఇంధన అంతరాయాలకు సంబంధించిన ఆందోళనల నేపథ్యంలో ఈ వివరణ వెలువడింది. "మేము ఇంధనం, సరఫరా గొలుసులు , నిత్యావసర వస్తువులకు సంబంధించిన పరిణామాలను నిజ సమయంలో నిశితంగా పర్యవేక్షిస్తున్నాం. ప్రధాని మోదీ నాయకత్వంలో, మన పౌరులకు ఇంధనం, శక్తి, ఇతర కీలకమైన సరఫరాలు నిరంతరాయంగా లభించేలా చూసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నా, అని పూరి ఎక్స్‌పై పోస్ట్ చేశారు. ఉద్భవిస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని ఆయన అన్నారు. ప్రపంచ అనిశ్చితుల నేపథ్యంలో భారతదేశం నిరంతరం స్థైర్యాన్ని ప్రదర్శించింది, అంతేకాక సకాలంలో, చురుకుగా ,సమన్వయంతో వ్యవహరించడం ప్రభుత్వం కొనసాగిస్తుంది, అని ఆయన అన్నారు.

పెరుగుతున్న ముడి చమురు ధరల ప్రభావాన్ని పట్టి చూపుతూ, గత నెలలో అంతర్జాతీయ ధరలు బ్యారెల్‌కు సుమారు రూ. 70 నుండి దాదాపు రూ. 122 కు పెరిగాయని మంత్రి తెలిపారు.

# యుద్ధాన్ని ముగించేందుకు మోడీ యత్నించాలి

### ఒమర్ అబ్దుల్లా

**శ్రీనగర్, మార్చి 27 (వుదయం):**

ఇరాన్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న అన్యాయమైన, చట్టవిరుద్ధమైన యుద్ధాన్ని జమ్మూ కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా శుక్రవారం ఖండించారు. మానవతా దృష్ట్యా ఈ యుద్ధాన్ని ముగించడానికి తన పరపతిని ఉపయోగించాలని ఆయన ప్రధానమంత్రి నరేంద్ర మోడీని అభ్యర్థించారు. ఇరాన్ సంక్షోభం ఒక అంతర్జాతీయ సమస్య అని, అది సభ పరిధిలోకి రాదని బీజేపీ శాసనసభ్యులు స్పష్టం చేసినప్పటికీ, పలువురు నేషనల్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యేలు పట్టుబట్టడంతో ఆయన సభా నాయకుడిగా శాసనసభలో ఈ ప్రకటన చేశారు. నా తరపున, నా సహచరుల తరపున, ఇరాన్‌పై రుద్దిన ఈ అన్యాయమైన, చట్టవిరుద్ధమైన యుద్ధాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. అయతొల్లా అలీ ఖమేనీ, ఆయన సహచరులు, ఈ ఘర్షణలో ప్రాణాలు కోల్పోయిన వారందరి పట్ల నా ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను, అని ముఖ్యమంత్రి అన్నారు. ఈ యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించడానికి అందుబాటులో ఉన్న అన్ని దౌత్య మార్గాలను, సంబంధాలను ఉపయోగించుకోవాలని నేను మా ప్రధానమంత్రికి మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నాను. దీనివల్ల మనకు మాత్రమే కాకుండా, యావత్ మానవాళికి ప్రయోజనం చేకూరుతుంది, అని అబ్దుల్లా అన్నారు. ఐదు వారాల విరామం తర్వాత బడ్జెట్ సమావేశాల రెండో దశ శుక్రవారం ప్రారంభమైన వెంటనే జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీలో గందరగోళ దృశ్యాలు చోటుచేసుకున్నాయి. నేషనల్ కాన్ఫరెన్స్, సీపీఐ(ఎం), కాంగ్రెస్, పీడీపీ, స్వతంత్ర ఎమ్మెల్యేలు ఇరాన్‌కు మద్దతుగా నినాదాలు చేయగా, బీజేపీ శాసన సభ్యులు జమ్మూలో జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గందరగోళం కొనసాగుతుండటంతో, స్పీకర్ అబ్దుల్ రహీం రథర్ సభను అరగంట పాటు వాయిదా వేశారు.

వాయిదా అనంతరం సభ సమావేశమైనప్పుడు, నేషనల్ కాన్ఫరెన్స్ ఎమ్మెల్యే తన్వీర్ సాదిఖ్ ఇరాన్‌పై యుద్ధానికి వ్యతిరేకంగా సభా నాయకుడి నుండి ఒక ప్రకటన కోరారు. ఆ తర్వాత, ఈ డిమాండ్‌కు మద్దతుగా, వ్యతిరేకంగా వివిధ ఎమ్మెల్యేలు సంక్షిప్త ప్రసంగాలు చేశారు. ఈ విషయంపై సభలో ఏకాభిప్రాయం లేదు; ఏకగ్రీవ అభిప్రాయం లేదు. మీరు కోరుకుంటే, భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యేలా చర్చ జరపవచ్చు. నేను ఈ డిమాండ్‌కు మద్దతుగా మాట్లాడిన తర్వాత వ్యతిరేకత వస్తే, అది సముచితం కాదు, అని అబ్దుల్లా మొదట చెబుతూ, తదుపరి ఎలా కొనసాగించాలో నిర్ణయించమని స్పీకర్‌ను కోరారు.

ఉభయ పక్షాలలోని పలువురు సభ్యుల అభిప్రాయాలను విన్న తర్వాత, పార్లమెంటు కూడా ఈ విధంగా చేసిందని గుర్తుచేస్తూ, సభలో ఒక ప్రకటన చేయాలని రథర్ ముఖ్యమంత్రిని కోరారు.



ఇరాన్‌పై అన్యాయమైన, చట్టవిరుద్ధమైన యుద్ధాన్ని రుద్దిన తీరును ఇక్కడ నిలబడి ఎవరూ సమర్థించగలరని నేను అనుకోను. మానవత్వాన్ని ఎలా అణచివేశారో, ఇరాన్ సర్వోన్నత నాయకుడిని, ఆయన సన్నిహితులను, బంధువులను ఎంత క్రూరంగా హతమార్చారో చెప్పడానికి ఎంత ఖండించినా సరిపోదు, అని అబ్దుల్లా అన్నారు.

ఒక పాఠశాలపై బాంబు దాడి జరిగి, పదుల సంఖ్యలో విద్యార్థినులు మరణించారని పేర్కొంటూ, ఇటీవలి కాలంలో ఇంతటి ఘోరమైన సంఘటనను గుర్తుచేసుకోవడం కష్టమని అబ్దుల్లా అన్నారు. మరి దీని లక్ష్యం ఏమిటి? ఇప్పటికీ అది స్పష్టంగా లేదు. మీరు అమెరికా నుండి వస్తున్న ప్రకటనలను వింటే, వారికే స్పష్టత లేనట్లు అనిపిస్తుంది. ఉదయం వారు పాలన మార్పు గురించి, మధ్యాహ్నం భద్రతాపరమైన ఆందోళనల గురించి, సాయంత్రానికి చమురు ధరల గురించి మాట్లాడుతారు. బహుశా గత మూడు వారాలుగా ఇరాన్ ప్రజలను ఎందుకు ఇంతగా బాధపెట్టారో వారికే తెలియదేమో, అని ఆయన అన్నారు.

ఈ ప్రాంతాన్ని ప్రత్యక్షంగా ప్రభావితం చేయని విషయాలను సభలో చర్చించకూడదనే అభిప్రాయంతో బీజేపీ సభ్యులు ఉన్నారని ముఖ్యమంత్రి అన్నారు. అమెరికా, ఇజ్రాయెల్‌లతో మన సంబంధాలు బాగున్నాయి. ఇరాన్‌తో కూడా మనకు చారిత్రాత్మకంగా బలమైన సంబంధాలు ఉన్నాయి. అటల్ బిహారీ వాజ్‌పేయ్‌తో కలిసి నేను విదేశాంగ శాఖ సహాయ మంత్రిగా పనిచేసినప్పుడు దీనిని వ్యక్తిగతంగా చూశాను. ఇరాన్ పొరుగు దేశాలతో కూడా భారతదేశం మంచి సంబంధాలను కొనసాగిస్తోంది, అని ఆయన అన్నారు. అందువల్ల, ఈ యుద్ధాన్ని వీలైనంత త్వరగా ముగించడానికి, తద్వారా అక్కడి ప్రజల బాధలు అంతమై, ఇరాన్ మరోసారి ప్రపంచంతో శాంతియుతంగా మమేకమయ్యేందుకు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తన పదవిని, వ్యక్తిగత దౌత్య సంబంధాలను ఉపయోగించుకోవాలని ఈ సభ సమిష్టిగా విజ్ఞప్తి చేస్తే ఎటువంటి అభ్యంతరం ఉండకూడదు, అని అబ్దుల్లా అన్నారు.

### పిఎంలు, సిఎంలను తొలగించే బిల్లు లను పరిశీలిస్తున్న

# ప్యానెల్‌కు 2026 వరకు గడువు

**న్యూఢిల్లీ, మార్చి 27 (వుదయం):**

తీవ్రమైన ఆరోపణలపై వరుసగా 30 రోజులకు పైగా అరెస్టు అయి ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులను తొలగించేందుకు ఉద్దేశించిన మూడు బిల్లులను పరిశీలిస్తున్న సంయుక్త పార్లమెంటరీ కమిటీకి తన నివేదికను సమర్పించడానికి మరింత సమయం ఇచ్చారు. 2026 పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి వారంలో మొదటి రోజు వరకు కమిటీకి లోక్‌సభ శుక్రవారం సమయం ఇచ్చింది. సాధారణంగా, వర్షాకాల సమావేశాలు జూలై మూడవ వారంలో ప్రారంభమవుతాయి. బీజేపీ నాయకురాలు అపరాజిత సారంగి అధ్యక్షతన ఉన్న ఈ కమిటీ మూడు బిల్లులను పరిశీలిస్తోంది రాజ్యాంగ (ముప్పైవ సవరణ) బిల్లు, 2025; జమ్మూ, కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు, 2025; కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ (సవరణ) బిల్లు, 2025. గత సంవత్సరం ఆగస్టు 20న హోం మంత్రి అమిత్ షా లోక్‌సభలో ఈ బిల్లులను ప్రవేశపెట్టారు. ఆ తర్వాత దానిని కమిటీకి పంపారు.






# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ ఉమ్మడి జిల్లాల వార్తలు

## రామగిరి దేవాలయం అభివృద్ధి వచ్చే శ్రీరామనవమికి కొత్త రూపు

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నల్గొండ,మార్చి 27 (వుదయం ప్రతినిధి ): నల్గొండలోని రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసి వచ్చే సంవత్సరం శ్రీరామనవమి నాటికి మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.శ్రీరామనవమిని పురస్కరించుకొని శుక్రవారం రామగిరి దేవాలయంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణోత్సవంలో మంత్రి పాల్గొని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేలాది మంది భక్తులు ఈ దేవాలయాన్ని దర్శించుకుంటారని తెలిపారు. దేవాలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని, వైకుంఠ దర్శనం, ఉత్తర ద్వార దర్శనం వంటి సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. దర్శన మార్గాల విస్తరణ కోసం అవసరమైన స్థల సేకరణపై ఇప్పటికే చర్చలు జరుగుతున్నాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

రామగిరి రామాలయానికి గొప్ప చరిత్ర ఉందని గుర్తుచేస్తూ భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించే దిశగా అభివృద్ధి చేపడతామని తెలిపారు. దేవాలయానికి ఇబ్బంది కలగకుండా నేషనల్ హైవే మార్గాన్ని బైపాస్ ద్వారా మళ్లించినట్లు పేర్కొన్నారు.నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రామగిరి దేవాలయ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని, ఉత్తర ద్వార దర్శన ఏర్పాట్లకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేస్తాం

**పుష్కరాల నాటికి ఆలయ రుపురేఖలతో కళ సంతరించుకుంటుంది**
**రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మార్చి 27 (వుదయం ప్రతినిధి): గోదావరి పుష్కరాల నాటికి ఆలయ తొలి దశ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి వర్యులు కొండా సురేఖ తెలిపారు. శుక్రవారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అనంతరం మంత్రి కొండా సురేఖ మీడియాతో మాట్లాడుతూ భద్రాచలంలోని శ్రీ సీతారాముల వారి కళ్యాణానికి ప్రాముఖ్యత ఉందని దేశ వ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు శ్రీ సీత రామచంద్ర స్వామి కళ్యాణాన్ని వీక్షిస్తారని ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడవ సంవత్సరం మంత్రిగా తాను ఈ కళ్యాణ మహోత్సవ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం ఆలయాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డిప్యూటీ సీఎం, స్థానిక మంత్రి వర్యుల సహకారంతో స్థానికంగా అవసరమైన భూ సేకరణ చేసిన తర్వాత రాబోయే సంవత్సరం గోదావరి పుష్కరాలు జరుగుతున్న నేపథ్యంలో మొదటి విడత క్రింద భద్రాచలం ఆలయానికి 351 కోట్ల రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు.

గోదావరి పుష్కరాల సమయానికి ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు దేవాదాయ శాఖ కృషి చేస్తుందని అన్నారు. తర్వాత రెండవ విడత నిధులు విడుదల చేసుకొని కృష్ణ పుష్కరాల నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందని మంత్రి అన్నారు. కళ్యాణ మహోత్సవాన్ని తిలకించిన భక్తులందరికీ శ్రీ రామచంద్ర స్వామి ఆశీస్సులు ఉండాలని ప్రజా ప్రభుత్వానికి శ్రీరామచంద్రమూర్తి శక్తిని కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆశీర్వదించాలని మంత్రి కోరారు. ఈ మీడియా సమావేశంలో ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## వైద్యులు బాధ్యతతో పనిచేయాలి

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాలకుర్తి పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్**



జనగామ, మార్చి 27 (వుదయం ప్రతినిధి) : ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వైద్యులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. శుక్రవారం రోజున పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని మందుల గది, ల్యాబ్, ఇన్ పేషెంట్ వార్డులను పరిశీలించి, మందుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. చికిత్స పొందుతున్న రోగులను ఆప్యాయంగా పలకరించి, వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. సిబ్బంది హాజరు రికార్డులను పరిశీలించి, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆసుపత్రి ప్రాంగణం, ప్రతి విభాగం అత్యంత శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు.మందులు అత్యవసర ఔషధాలు, టీకాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు.సేవా దృక్పథంతో ప్రభుత్వ లక్ష్యం ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమేనని, వైద్యులు రోగులతో మర్యాదగా ప్రవర్తిస్తూ సకాలంలో చికిత్స అందించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు, సంబంధిత విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## రిజర్వాయర్ల పనులను వేగవంతం చేయాలి

**– అధికారులకు ఆదేశాలు జారీ చేసిన భారత ప్రభుత్వ జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతా రావు, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగాం, మార్చి 27 (వుదయం ప్రతినిధి) :జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి కోసం కొనసాగుతున్న నష్కల్ రిజర్వాయర్, కెనాల్, పాలకుర్తి రిజర్వాయర్, నవాబుపేట రిజర్వాయర్, కెనాల్ లను జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి భారత ప్రభుత్వ జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతా రావు శుక్రవారం సందర్శించి, పరిశీలించారు.

ఈ సందర్భంగా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్రంగా మ్యాపింగ్ ద్వారా సమీక్షించి, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, ఎటువంటి ఆలస్యం లేకుండా పనులను ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు.ప్రాజెక్టుల ప్రాంతంలో రైతులతో మాట్లాడి, వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సాగు నీరు అందుబాటులోకి రావడం చేత రైతులకు కలిగే లాభాలను వివరించారు. రిజర్వాయర్ల పనులు పూర్తయిన తర్వాత సాగు నీటి వసతి మెరుగుపడి, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పూల మొక్కను భారత ప్రభుత్వ జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి.ఎల్. కాంతా రావుకు అందజేసి, స్వాగతించారు.ఈ పరిశీలనలో ఘనపూర్ (స్టేషన్) ఆర్డీఓ వెంకన్న, నీటి పారుదల శాఖ ఎస్ఈ సీతారాం, వరంగల్ సీఈ ఆర్. సుధీర్, హైదరాబాదు ఈఎన్సీ. ఓవీ. రమేష్‌బాబు, ఇతర సంబంధిత అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

## శ్రీ సీతారాముల ఆశీస్సులతో ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**గోపిరెడ్డి నగర్‌లో కన్నుల పండుగగా శ్రీ సీతారాముల కళ్యాణం**



కోదాడ మార్చి 27(వుదయం): కోదాడ పట్టణంలోని గోపిరెడ్డి నగర్‌లో గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణం మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీ సీతారాముల ఆశీస్సులతో కోదాడ పట్టణ ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సమాజంలో శాంతి, సామరస్యాలు పెంపొందుతాయని తెలిపారు. శ్రీ సీతారాముల కళ్యాణం తిలకించడం తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు.

శ్రీ సీతారాముల కళ్యాణ దర్శన భాగ్యం కల్పించిన గోపిరెడ్డి నగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులను ఆమె అభినందించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. . అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లీశ్వరి, 6వ వార్డు కౌన్సిలర్ నాగేంద్రమ్మ, 14వ వార్డు కౌన్సిలర్ కందుల కోటేశ్వరరావు, 19వ వార్డు కౌన్సిలర్ కొల్ల కోటి రెడ్డి, 12వ వార్డు కౌన్సిలర్ గుండపునేని పద్మ, గోపిరెడ్డి నగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆదివాసీల ఆశాజ్యోతి కుంజా రాము ఆశయాలను కొనసాగిద్దాం

**- ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి**
**రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**



కొత్తగూడ ,మహబూబాబాద్ మార్చి 27(వుదయం ప్రతినిధి ): ఆదివాసీల హక్కుల కోసం, వారి ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన గొప్ప పోరాట యోధుడు కామ్రేడ్ కుంజ రాము అని రాష్ట్రపంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కొనియాడారు. కుంజ రాము 22వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కొత్తగూడ మండలంలోని మోకాళ్లపెల్లి గ్రామంలోని ఆయన స్మారక స్తూపం వద్ద మంత్రి సీతక్క నివాళులర్పించారు.కుంజరాము స్వగ్రామ మైనమోకాళ్లపెల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి సీతక్కతో పాటు పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు,ప్రజాప్రతినిధులు పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అడవి బిడ్డల అస్తిత్వం కోసం, జల్ జంగిల్‌జమీన్ నినాదంతో కుంజ రాము చేసిన పోరాటం మరువలేనిదని అన్నారు. ఆదివాసీ లిబరేషన్ టైగర్స్ (ఏ ఎల్ టీ ) వ్యవస్థాపకుడిగా ఆయన గిరిజన ప్రాంతాల్లో అణచివేతకు వ్యతిరేకంగా గొంతుకయ్యాడని గుర్తుచేశారు.కుంజ రాము ఆశయాలకు అనుగుణంగానే ప్రస్తుత ప్రభుత్వం ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, వైద్యం మరియు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.కుంజ రాము కేవలం ఒక వ్యక్తి కాదు, ఒక విప్లవ శక్తి అని ఆయన చూపిన బాటలో నడుస్తూ ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.అనంతరం అస్నాల శ్రీనివాస్ ప్రచురించిన " అడవి దివిటీలు కుంజా రాము సీతక్క" ఉద్యమ చరిత్ర "అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఆదివాసీల ముద్దు బిడ్డ"గా పేరుగాంచిన కుంజ రాము జ్ఞాపకార్థం గ్రామంలో భారీ సంఖ్యలో గిరిజనులు, తరలివచ్చి తమ నాయకుడిని స్మరించుకున్నారు. ఈకార్యక్రమంలో కుమారుడు కుంజా సూర్య కూసుమంజలి స్థానిక నాయకులు, కుంజ రాము కుటుంబ సభ్యులు తుడుం దెబ్బ,ఆదివాసి ప్రజా సంఘాల నాయకులు, తోటి ఉద్యమ మిత్రులు పెద్ద ఎత్తున ఆదివాసీలు పాల్గొన్నారు.

## జిల్లా అభివృద్ధి కోసం స్వామివారిని ప్రార్థించిన కలెక్టర్



నల్గొండ,మార్చి 27 (వుదయం ప్రతినిధి ): జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో, ఆనందోత్సాహాలతో ఉండేలా నల్గొండ జిల్లా మరింత అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ శ్రీ సీతా రామచంద్ర స్వామిని ప్రార్థించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం తన క్యాంపు కార్యాలయం వద్ద నల్గొండలోని రామగిరి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహించే కళ్యాణోత్సవానికి జిల్లా యంత్రాంగం తరపున పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.పట్టు వస్త్రాలు, తలంబ్రాలను తలపై ధరించి మేళతాళాలతో క్యాంపు కార్యాలయానికి తీసుకువచ్చి ఆలయ అధికారులు, వేద పండితులు, అర్చకులకు అందజేశారు.

ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా యంత్రాంగం తరపున స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. జిల్లా మరింత అభివృద్ధి సాధించి ప్రజలు సుఖశాంతులతో జీవించాలనే ఆకాంక్షతో స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.

## వడ్లను గోటితో ఒలిచిన తలంబ్రాల బియ్యం సమర్పణ



భానుపురి/సూర్యాపేట కల్చరల్ మార్చి 37(వుదయం): సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో జరుగు సీతారామచంద్ర స్వామి వారి కల్యాణము లో తలంబ్రాల బియ్యం ను సూర్యాపేట మండలం బాలేం ల గ్రామానికి చెందిన శివరాత్రి ముత్యాలు, యాదమ్మ దంపతులు గత 3 నెలలుగా వడ్లను గోటితో వలవగా వచ్చిన బియ్యంలో ఒక కేజీ 250 గ్రా బియ్యాన్ని శుక్రవారం దేవాలయ కమిటీ కి అంద జేశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ గత 3 నెలలు ఎంతో నిష్టతో గోటితో వలచిన బియ్యాన్ని భద్రాద్రి సీతారామ చంద్ర స్వామి కళ్యాణానికి, బొడ్రాయి బజార్ శ్రీ వేదాంత భజన మందిరంలో జరుగు కళ్యాణానికి కేజింబావు చొప్పున అందజేసి నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష,కార్యదర్శులు బ్రాహ్మణపల్లి మురళీధర్, పబ్బా ప్రకాశరావు, దేవర శెట్టి సోమయ్య, దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం,భక్తులు పొద్దుటూరి నాగ ప్రసాద్,మహంకాళి కవిత,ఓరుగంటి కనక రత్నం,కంచర్ల లీల తదితరులు పాల్గొన్నారు..

## కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణం



యాదాద్రి భువనగిరి / మార్చి వుదయం జిల్లా ప్రతినిధి : మోటకొండూరు మండలం లోని చందేపల్లి గ్రామంలో శ్రీ సీత రామచంద్ర స్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కళ్యాణం కనుల పండువగా జరిగింది.శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు పండిట్ ఆకుల కోటేశ్వర్, అన్వేష్ లు ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వస్తి శ్రీ పరాభవ నామ సంవత్సర చైత్ర శుద్ధ నవమి శుక్రవారం 11 : 45 లకు పునర్వసు నక్షత్ర యుక్త శుభలగ్న సుముహూర్తమున శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవ కార్యక్రమం ఆలయ ధర్మకర్తలు ఏనుగు వసంత సత్తిరెడ్డి దంపతులు కన్నుల పండుగగా నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పవనా సూత కోలాటా బృందం బంజారా వారిచే రథోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్దేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తలు సుదగాని భారతమ్మ జయరాములు గౌడ్, సుదగాని మంజుల మల్లేష్ గౌడ్, గణపతి ఆలయ ధర్మకర్తలు బొప్పిడి సువర్ణ మల్లారెడ్డి, బొప్పడి భవాని విజయేందర్ రెడ్డి, ఎన్నే ధనమ్మ దయాకర్ రెడ్డి, సర్పంచ్ బోట్ల నగేష్, ఉప సర్పంచ్ ఏనుగు అంజిరెడ్డి, వార్డు సభ్యులు గంగరాజు నాగరాజు, దుధిపాల జ్యోతి, బోట్ల సంజీవ, కందారపు మంజుల, సబిత, హనుమాన్ సేవ సంస్థ సభ్యులు బజ్జూరి కృష్ణ, సుదగాని నవీన్, బొలుగుల రమేష్, బజ్జూరి లవన్, పాము రమేష్, బొలుగుల కరుణాకర్, గ్రామ ప్రజలు యువకులు మహిళలు చిన్నారులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు.

## నిబంధనలు పాటిద్దాం–ప్రాణాలను కాపాడుకుందాం

**– జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**



వరంగల్, మార్చి 27 (వుదయం జిల్లా ప్రతినిధి) : రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా అమూల్యమైన ప్రాణాలను రక్షించుకోవచ్చని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద విద్యార్థులకు సూచించారు. శుక్రవారం వరంగల్ నగరంలోని జక్కలొద్దిలోని తెలంగాణ మైనారిటీ నివాస పాఠశాల (TMREIS)లో '99 రోజుల ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రోడ్డు భద్రత ట్రాఫిక్ నియమాల అవగాహన సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో పెరుగుతున్న వాహనాల రద్దీ దృష్ట్యా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై కనీస అవగాహన కలిగి ఉండాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడిన ప్రయాణ అలవాట్లను అలవర్చుకోవాలని, హెల్మెట్ ధరించడం, అతివేగాన్ని నియంత్రించడం వంటి చిన్నపాటి జాగ్రత్తలు పెద్ద ప్రమాదాల నుండి కాపాడతాయని వివరించారు. నిబంధనలు ఉల్లంఘించడం వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ విద్యార్థుల్లో చైతన్యం నింపారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీఓ సుమా పాల్గొన్నారు. వీరితో పాటు జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు, స్థానిక తహసీల్దార్, పాఠశాల సిబ్బంది హాజరయ్యారు. చివరగా, విద్యార్థులంతా ట్రాఫిక్ రాయబారులుగా మారి తమ కుటుంబ సభ్యులకు, ఇరుగుపొరుగు వారికి నిబంధనల పట్ల అవగాహన కల్పించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## కన్నులపండువగా సీతారాముల కళ్యాణం



**ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

హనుమకొండ, మార్చి 27 (వుదయం జిల్లా ప్రతినిధి) : హనుమకొండ న్యూ బస్టాండ్ ఆవరణలో భద్రకాళి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. గత పది సంవత్సరాలుగా నిర్విఘ్నంగా కొనసాగుతున్న ఈ వేడుకలు, ఈ ఏడాది కూడా భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు యువజన కాంగ్రెస్ నాయకులు దేవన విష్ణువర్ధన్ రెడ్డి కూడా పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.కళ్యాణం అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్న దాన కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారు 1000 మందికి పైగా భక్తులు ఈ ప్రసాదాన్ని స్వీకరించారు. భద్రకాళి యూత్ అసోసియేషన్ సభ్యులు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూశారు.ఈ కార్యక్రమంలో



7వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు తోట పవన్, రోహిత్ సింగ్ ఠాకూర్, మంద రాకేష్‌లతో పాటు అసోసియేషన్ ప్రతినిధులు ధర్మ సతీష్ రెడ్డి, బొడిగే శ్రీను, వెల్దండి నవీన్, మణిదీప్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు. కాలనీవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కళ్యాణ వేడుకను కళ్లారా వీక్షించారు.

## దేవాదుల పంపు హౌస్ పరిశీలిలన

**– జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి కాంతారావు**



హసన్ పర్తి, మార్చి 27 (వుదయం ప్రతినిధి) : హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట శివారులోని దేవాదుల పంప్ హౌస్ తోపాటు ధర్మసాగర్ లోని రిజర్వాయర్, సౌత్ మెయిన్ కెనాల్ ను కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి ఎల్ కాంతారావు శుక్రవారం రోజున సందర్శించారు.

దేవన్నపేట పంప్ హౌస్, ధర్మసాగర్ సౌత్ మెయిన్ కెనాల్ వివరాలను అధికారులు కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి కి వివరించారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి వి ఎల్ కాంతారావు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్ అండ్ అర్ కమిషనర్ శివకుమార్ నాయుడు, కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ సీనియర్ జాయింట్ కమిషనర్ కుల్దీప్ సింగ్, సిడబ్ల్యుసి డైరెక్టర్ శ్రీనివాస్, హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ఇఎన్సీ జనరల్ రమేష్‌బాబు, చీఫ్ ఇంజనీర్ సుధీర్, ఇరిగేషన్ ఎస్ ఈ రాం ప్రసాద్, ఈఈలు సీతారాం,మంగీలాల్, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, జిల్లా సాగునీటిపారుదల శాఖ అధికారి రామ్మోహన్, మెగా ప్రాజెక్టు మేనేజర్ తిరుపతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### సొంత క్షేత్రంలో పుచ్చ సాగును పరిశీలించిన

## వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



దమ్మపేట మార్చి 27 (వుదయం ప్రతినిధి ): అసెంబ్లీ సమావేశాలు ,ప్రజా సమస్యల పరిష్కారంతో బిజీగా ఉండే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.. కాసేపు ప్రకృతి ఒడిలో సేద తీరారు. శ్రీరామనవమి పురస్కరించుకుని భద్రాచలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించిన

మంత్రి, అనంతరం తన స్వగ్రామమైన గండుగలపల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు.అసెంబ్లీ సమావేశాల హడావుడి ఉన్నప్పటికీ, దొరికిన కొద్దిపాటి సమయంలోనే తన క్షేత్రానికి చేరుకున్న మంత్రి, అక్కడ సాగవుతున్న పుచ్చకాయ పంటను ఎంతో ఆసక్తిగా పరిశీలించారు. ప్రస్తుతం పంట కోత దశకు చేరుకోవడంతో, కాయల నాణ్యతను, దిగుబడి వివరాలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పుచ్చకాయలను చూసి ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

రాజకీయాల్లో ఎంతటి కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నా, తనకు ఇష్టమైన వ్యవసాయాన్ని మాత్రం తుమ్మల వదలడం లేదు. క్షేత్ర స్థాయికి వచ్చి పంట స్థితిగతులను గమనించడం ద్వారా తన రైతు పక్షపాత వైఖరిని మరోసారి చాటుకున్నారు. మంత్రి వెంట పలువురు ముఖ్య అనుచరులు కాసాని నాగప్రసాద్ తదితరులున్నారు

### జన్ విశ్వాస్ సవరణ బిల్లును వ్యతిరేకించిన ఎంపి కావ్య



వరంగల్, మార్చి 27 (వుదయం ప్రతినిధి) : జన్ విశ్వాస్ (సవరణ) బిల్లును లోక్‌సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య వ్యతిరేకించారు. వ్యాపార సౌలభ్యం పేరుతో తీసుకొస్తున్న ఈ బిల్లులో పలు కీలక నిబంధనలను డీక్రిమినలైజ్ చేయడం వల్ల నియంత్రణ వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉందని ఎంపీ ఆందోళన వ్యక్తం చేశారు.ప్రత్యామ్నాయ అమలు విధానాలు బలంగా లేకుండా చట్టపరమైన శిక్షలను తగ్గించడం వల్ల ఉల్లంఘనలు పెరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా ప్రజా ఆరోగ్యం, పర్యావరణం, కార్మిక హక్కుల వంటి కీలక రంగాలు దెబ్బతినే ప్రమాదం ఉందని హెచ్చరించారు.వ్యాపారాలకు అనుకూలత కల్పించడమే కాకుండా ప్రజల హక్కులు, భద్రతను కాపాడే బాధ్యత కూడా ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ఇలాంటి కీలక సవరణలపై విస్తృత చర్చ జరిపి, అన్ని వర్గాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య డిమాండ్ చేశారు.

# కరీంనగర్ | అదిలాబాద్ | నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల వార్తలు

ఇల్లందుకుంట రామాలయంలో..

## వైభవంగా సీతారాముల కల్యాణ వేడుక



**కరీంనగర్ మార్చి 27(వుదయం ప్రతినిధి)**
కరీంనగర్ జిల్లా లో శ్రీ సీతారాముల వారి కళ్యాణం సందర్భంగా ఇల్లందు కుంట రామాలయంలో ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్పొన్నం సత్తయ్య పేరు మీద ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, సిపి గౌస్ ఆలం, హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్,ఇతర ముఖ్య నేతలు ,అధికారులుఇల్లందుకుంట శ్రీ సీతారామస్వామి వారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సమృద్ధి వర్షాలతో పాడిపంటలతో ప్రజలంతా ఆయురారోగ్యాల ఉండాలని కోరుకున్నారు.

## ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు నిరంతరం నిఘా

### మూడు నెలల్లో 45 కేసులు నమోదు : జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే



**రాజన్న సిరిసిల్ల జిల్లా (వుదయం ప్రతినిధి)**
జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టే దిశగా పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టి నిఘాను కఠినతరం చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఇసుక త్రవ్వకాలు, రవాణా చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. శుక్రవారం రోజున ఒక ప్రకటన జారీ చేశారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వచ్చేనెల ఒకటో తేదీ నుంచి మన ఇసుక వాహనం ద్వారా ఇసుక సరఫరా చేయాలని, నిల్వలు ఉంచిన వారిపైనా కేసులు నమోదు చేసి,సంబంధిత వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందన్నారు.నెలల వ్యవధిలో జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై వరుస దాడులు నిర్వహించి మొత్తం 45 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇకపై కూడా అక్రమ ఇసుక రవాణాపై ఎలాంటి సడలింపు లేకుండా కఠినంగా వ్యవహరించాలని పోలీస్ స్టేషన్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. సమాచారం ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని అధికారులు తెలిపారు.

## స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి, విప్



**భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**
**పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు**
**హాజరైన కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే**



**వేములవాడ, మార్చి 27 (వుదయం ప్రతినిధి)**
శ్రీరామ నవమి సందర్భంగా వేములవాడలో శ్రీ సీతారాముల కల్యాణానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. అంతకుముందు మంత్రిని ఆలయ అతిథి గృహంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణ వేడుకలు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో ఆధ్వర్యంలో శివార్చన స్టేజీ వద్ద నిర్వహించనుండగా, రాష్ట్ర ప్రభుత్వం తరఫున బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అందజేసేందుకు వచ్చి శ్రీ భీమేశ్వర స్వామి ఆలయానికి చేరుకోగా, అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ భీమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, శ్రీ సీతారాముల కల్యాణానికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాకేష్, ఆర్డీవో రాధాబాయి, ఆలయ ఈఓ రమాదేవి, డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ జయంత్ కుమార్ పాల్గొన్నారు.

## సకాలంలో బకాయి చెల్లించాలి : కలెక్టర్ నిత్యప్రసాద్



**జగిత్యాల మార్చి 27 (వుదయం ప్రతినిధి)**
జగిత్యాల రాయికల్ మున్సిపల్ పాత బకాయి ఆస్తి పన్ను వసూళ్లపై జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సమీక్ష నిర్వహించారు శుక్రవారం జగిత్యాల పట్టణ కేంద్రంలో రాయికల్ పట్టణంలో మున్సిపల్ లలో పాత పెండింగ్ బిల్లులు ఆస్తి పన్ను వసూళ్లపై జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ సమీక్ష నిర్వహించారు ఈ సందర్భంగా జగిత్యాల్ రాయికల్ పట్టణంలో ఆస్తి పన్ను వసూళ్ల పురోగతిని సమగ్రంగా పరిశీలించి వసూళ్లను ఈనెల మార్చి 31వ తేదీ లోపు మరింత వేగవంతం చేయాలని మున్సిపల్ సంబంధిత అధికారులకు సూచించారు పాత పన్ను బకాయిలు ఉన్న యజమానులకు వెంటనే నోటీసులు జారీ చేసి మార్చి 31 వ తేదీ లోపు వసూలు చేయాలని ఆదేశించారు పన్నులు చెల్లించని వారికి నోటీసులు ఇవ్వాలని అయినా పన్నులు చెల్లించనట్లయితే నల్ల కనెక్షన్ తొలగించాలని స్పష్టం చేశారు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాలోని అన్ని మున్సిపల్ పరిధిలో పారిశుధ్య నిర్వహణ మౌళిక సదుపాయాలు పన్నుల వసూళ్ల పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మౌలిక వసతుల విస్తరణలో మున్సిపల్ ఆస్తి పన్నులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు అందువల్ల పట్టణ ప్రజలు తమ ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ స్పందన రాయికల్ మున్సిపల్ కమిషనర్ నాగరాజు జగిత్యాల తహసిల్దార్ రామ్మోహన్, అధికారులు తదితరులు పాల్గొన్నారు

## జనగణనను పకడ్బందిగా నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, మార్చి27 వుదయం ప్రతినిధి**
జనగణన కార్యక్రమాన్ని పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. గురువారం జనగణన 2027 కార్యక్రమం నిర్వహణలో భాగంగా తొలిదశలో నిర్వహించనున్న హౌస్ లిస్టింగ్ , హౌసింగ్ సెన్సెస్ నిర్వహణ పై సంబంధిత అధికారులకు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీక్ష నిర్వహించారు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జనగణన తొలి దశ లో నిర్వహించాల్సిన హౌస్ లిస్టింగ్ కార్యక్రమం నిబంధనలను ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో పలు మార్లు సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించామని, ఇందులో సమాచారం అందించడం ఐచ్చికమని, కానీ జనగణన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జనగణన కార్యక్రమంలో సమాచారం ఇవ్వడానికి నిరాకరించినా, తప్పుడు సమాచారం అందించిన చట్టం ప్రకారం కేసు నమోదు చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లకు జనగణన సంబంధించి అన్ని అంశాలలో పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. జనగణన సంబంధించి అధికారులకు ఇచ్చిన మేటిరియల్ ఒకటి రెండు సార్లు చదవాలని అన్నారు.జనగణన సంబంధించి సాఫ్ట్ వేర్ పని తీరు గమనించాలని, ప్రతి ఒక్క అంశాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కింది స్థాయి సిబ్బందికి వదిలి పెట్టవద్దని అన్నారు. జనగణన కార్యక్రమం దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రజల నివాస గృహాల వివరాలు, మౌలిక సదుపాయాల స్థితి, కుటుంబాల వివరాలు తదితర అంశాలను ఈ దశలో నమోదు చేయడం జరుగుతుందని వివరించారు. శిక్షణలో భాగంగా డేటా సేకరణ విధానం, డిజిటల్ పరికరాల వినియోగం, ఫీల్డ్ స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. మే 11 నుంచి జనగణన కార్యక్రమం ప్రారంభమై అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.జిల్లాలో జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికకు అవసరమైన ఖచ్చితమైన గణాంకాలు సిద్ధమవుతాయని పేర్కొన్నారు. సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, మండల/మున్సిపల్/మున్సిపల్ కార్పోరేషన్ ఎంపీఎస్ ఓ లు టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## కమనీయం కడు రమణీయం



**మంచిర్యాల /రామకృష్ణాపూర్/ మార్చి 27 (వుదయం ప్రతినిధి)**
శ్రీరాముడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కార్మిక మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం శ్రీరామనవమి సందర్భంగా కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, సరోజ దంపతులు క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగడి అభయాంజనేయ స్వామి ఆలయంలో ,కొత్త తిమ్మాపూర్, పాత తిమ్మాపూర్ ఆంజనేయ స్వామి ఆలయంలో, క్యాతన్ పల్లి ఆంజనేయ స్వామి ఆలయంలో, రామకృష్ణాపూర్ పట్టణంలోని ఏ జోన్ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. మంత్రి దంపతులకు ఆయా ఆలయాల అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ.. సీతారాముల కంటే ఆదర్శ దంపతులు ఈ విశ్వంలో ఎవరు లేరని, రాముడు చూపిన బాటలో మనమంతా నడవాలని, రాముడి జీవితం ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు.

ప్రముఖ చరిత్రకారుడు

## డా. జైశెట్టి రమణయ్య కన్నుమూత

### సంతాపం ప్రకటించిన కేసీఆర్



**జగిత్యాల, మార్చి 27 (వుదయం ప్రతినిధి):**
తెలంగాణ చరిత్రను, సంస్కృతిని లోకానికి చాటిచెప్పిన ప్రముఖ చరిత్రకారుడు, రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ జైశెట్టి రమణయ్య (85) శుక్రవారం ఉదయం జగిత్యాలలోని తన నివాసంలో తుది శ్వాస విడిచారు. వయోభారం మరియు అనారోగ్య సమస్యలతో ఆయన శుక్రవారం ఉదయం కన్నుమూశారు. జగిత్యాల జిల్లాలో మొట్టమొదటి పీహెచ్‌డీ పట్టా పొందిన పరిశోధకుడిగా ఆయన గుర్తింపు పొందారు. 1971లో సిద్దిపేటలో జూనియర్, డిగ్రీ కాలేజీలో హిస్టరీ లెక్చరర్‌గా డా. జైశెట్టి రమణయ్య పని చేశారు. చిన్న వయసులోనే ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన అరుదైన వ్యక్తిగా, జగిత్యాలలో మొట్టమొదట డాక్టరేట్ పొందిన పరిశోధన విద్యార్థిగా వారికి పేరున్నది. "సౌత్ ఇండియా టెంపుల్స్" అనే పరిశోధనాత్మక గ్రంథాన్ని సమర్పించి జైశెట్టి రమణయ్య పీహెచ్‌డీ డాక్టర్ పట్టాను పొందారు.

**సంతాపం తెలిపిన కేసీఆర్...**
తనకు చదువు చెప్పిన గురువు, జగిత్యాలకు చెందిన ప్రముఖ చరిత్రకారుడు, రిటైర్డ్ లెక్చరర్ డా. జైశెట్టి రమణయ్య మరణం పట్ల, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ విచారం వ్యక్తం చేస్తూ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా తనకు గురువుగా, అత్యంత ఆత్మీయుడైన రమణయ్యతో తనకున్న అనుబంధాన్ని కేసీఆర్ స్మరించుకున్నారు. రమణయ్య సిద్దిపేటలో లెక్చరర్‌గా పనిచేస్తున్న సమయంలో, తను ఇంటర్మీడియట్ విద్యార్థిగా తన దగ్గర విద్యనభ్యసించిన సందర్భాన్ని కేసీఆర్ గుర్తు చేసుకున్నారు. ఆయన మరణంపై వారి కుటుంబ సభ్యులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రమణయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వీరితో పాటు జాగృతి అధినేత కల్వకుంట్ల కవిత, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి తదితరులు రమణయ్య భౌతికకాయానికి నివాళులర్పించారు.

## ఘనంగా రంగవల్లి, క్విజ్ పోటీలు

**కామారెడ్డి, మార్చి 27 (వుదయం ప్రతినిధి):**
సదాశివనగర్ మండలం లింగంపల్లి గ్రామంలో శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవాలయాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రంగోలీ పోటీలు, ఆధ్యాత్మిక క్విజ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్విజ్ పోటీలో రామాయణం, మహాభారతం, వేదాలు, ఉపనిషత్తులు వంటి భారతీయ ఆధ్యాత్మిక గ్రంథాలపై ప్రశ్నలు అడిగి, పాల్గొన్న వారిలో ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పెంపొందించారు. రంగోలీ పోటీలో పాల్గొన్న వారు తమ సృజనాత్మకతను, కళాత్మక ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు.పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరు మంచి పోటీ స్ఫూర్తిని కనబరిచారు. విజేతలకు రాబోయే హనుమాన్ జన్మోత్సవం సందర్భంగా బహుమతులు ప్రధానం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన వారందరికీ ఉత్సవ కమిటీ కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



## వైభవంగా శ్రీ సీతారాముల తిరు కల్యాణ మహోత్సవం

**స్వామివారి దివ్య మంగళ రూపాన్ని తిలకించి పులకించిన భక్తజనం**
**శ్రీరామనామ స్మరణతో మార్మోగిన దేవాలయాలు**



**ధర్మపురి మార్చి 27 (వుదయం ప్రతినిధి):**
శ్రీరామనవమి పురస్కరించుకుని శుక్రవారం ధర్మపురి మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో తిమ్మాపూర్, దొంతపూర్,జైనా,రాజారం,దమ్మన్నపేట,కమలాపూర్,శాలపెల్లి, గండి,తీగల ధర్మారం,ధర్మపురి శ్రీలక్ష్మీ నరసింహ కాలనిలలో కల్యాణం వైభవోపేతంగా నిర్వ హించారు.ఈ కల్యాణానికి అశేష భక్తజనం తరలిరాగా,రామ నామ స్మరణతో ఆలయాలు మార్మోగా యి.తిమ్మాపూర్ గ్రామంలో నిర్వహించిన స్వామి వారి కల్యాణానికి ఈఓ శ్రీనివాస్, జువ్వాడి.నరసింగారావు శ్రీ సీతా రామచంద్ర స్వామి వారికి పట్టు వస్త్రాలు,తలంబ్రాలు సమర్పించగా అర్చకులు,వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య, భక్తుల జయ జయ ద్వానాల నడుమ స్వామి వారికి ప్రత్యేక పూజల అనంతరం కల్యాణాన్ని నిర్వహించారు మంత్రి అడ్లూరి లక్ష్మణ్.తిమ్మాపూర్,దొంతపూర్, తీగల ధర్మారం ,ధర్మపురి శ్రీలక్ష్మి నరసిం హా కాలనీల్లో నిర్వహించిన శ్రీ రములవారికళ్యాణం లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.లోక కళ్యాణార్థం నిర్వహించే స్వామి వారి కల్యాణం తిలకిస్తే కలిగే ప్రయోజనాలు గురించి వేద పండితులు వివరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.సాయంత్రం వేళలో స్వామి వారి ఉత్సవ మూర్తులను రథాలపై ఆశీనులను చేసి పుర వీధుల్లో ఊరేగించారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాం నరసింహారెడ్డి నేతృ త్వంలో ఎస్సై మహేష్ బందోబస్తు ఏర్పాట్లు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ వేముల.నాగలక్ష్మి రాజేష్,ఏఎంసి చైర్మన్ చిలుముల. లావణ్య లక్ష్మణ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంఘ నబట్ల.దినేష్,కౌన్సిలర్లు,తిమ్మాపూర్ సర్పంచ్ నలమసు. పుష్పాలత వైకుంఠం,సూపరిండెంట్ కిరణ్, దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అల్వాల్. శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ వావిలాల.తిరుపతి, దేవస్థానం ,సిబ్బంది, గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 25న రాజకీయ పార్టీ ప్రకటిస్తాం

**సర్వోదయ తెలంగాణ కావాలన్నదే మా లక్ష్యం**
**మేము పెట్టబోయే పార్టీ తెలంగాణ ఇంటి పార్టీ**
**ఏదైనా పని పట్టుకుంటే ఫలితం వచ్చే వరకు కూడా వదిలిపెట్టను**
**ఢిల్లీలో లాబీయింగ్ చేయగలను, గల్లీలో కష్టపడగలను**
**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**నిజామాబాద్, వుదయం,మార్చ్ 27:**
తెలంగాణ జాగృతి సంస్థ ను రాజకీయ పార్టీగా మార్చబోతున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఏప్రిల్ 25 వ తారీఖున మేడ్చల్ లోని మునీరాబాద్ వేదికగా పార్టీ ఆవిర్భవ సభ ఉంటుందన్నారు. అదే రోజు పార్టీ జెండా, అజెండా ప్రకటిస్తామని చెప్పారు. శ్రీరామ నవమి సందర్భంగా తన మెట్టినిల్లు నిజామాబాద్ నుంచి కవిత ఈ ప్రకటన చేశారు. తెలంగాణ భవిష్యత్ ను మార్చే దారి దీపంలా జాగృతి పార్టీ ఉంటుందన్నారు. సర్వోదయ తెలంగాణ కోసం తాము పనిచేస్తాని స్పష్టం చేశారు. తెలంగాణ జాగృతి యే మన రాష్ట్ర ప్రాంతీయ పార్టీగా, ప్రతి ఒక్కరి ఇంటి పార్టీగా ఉంటుందన్నారు. కొత్త పార్టీ ఏర్పాటు చేయగానే ఎవరికీ బీ టీమ్ అంటూ విమర్శలు చేసే సంస్కృతి ఉండటం బాధాకరమని చెప్పారు. తమ పార్టీ ఎవరికీ బీ టీమ్ కాదని...తమదే తెలంగాణలో నంబర్ వన్ పార్టీ అవుతుందని చెప్పారు. కుల, మత, వర్గాలకు అతీతంగా సర్వ జనుల కోసం పనిచేస్తామని చెప్పారు. సర్వజనుల్లో వెలుగులు నింపేలా సర్వోదయ తెలంగాణ కోసం తమ పార్టీ పనిచేస్తుందన్నారు. తెలంగాణ కోసం ఏర్పాటు చేసే రాజకీయ పార్టీ ద్వారా కూడా తెలంగాణ భవిష్యత్ ను మార్చే వరకు పోరాడుతానని చెప్పారు. అవసరమైతే ఢిల్లీలో లాబీయింగ్ చేయగలనని...గల్లీలో కూడా కష్టపడతానని కవిత చెప్పారు. శ్రీరామనవమి సందర్భంగా ఆ శ్రీరాముడి స్ఫూర్తితో పార్టీ ప్రకటన చేస్తున్నానని అన్నారు. పాలన పై ప్రజాభిప్రాయం తీసుకొని వైఫల్యాలను మార్చుకున్న వ్యక్తి శ్రీరామ చంద్రుడని కవిత గుర్తు చేశారు. శ్రీరామ నవమి రోజు చేసిన పార్టీ ప్రకటన నుంచి పార్టీ ఆవిర్భావం నాటికి ఇంకా 28 రోజులు ఉన్నాయని అన్నారు. ఈ 28 రోజుల్లో అభ్యుదయ, సామాజిక తెలంగాణ కోసం మేధావులతో చర్చలు చేస్తామన్నారు. పార్టీ ఆవిర్భావ సభ నాటికి కాశీకి వెళ్లి శివుడికి అభిషేకం చేస్తామని చెప్పారు. ఆ తర్వాత పార్టీ ఆవిర్భావ సభ ఉంటుందన్నారు. కాలనుగుణంగా పనులు చేస్తే ప్రజలకు మంచి జరుగుతుందని నమ్ముతున్నానని కవిత చెప్పారు. ఏప్రిల్ 25 న జరిగే పార్టీ ఆవిర్భావ సభకు సబ్బండ వర్గాలు రావాలంటూ కవిత ఆహ్వానించారు. తెలంగాణ వచ్చిన 12 ఏళ్ల తర్వాత కూడా నీళ్లు, నిధులు, నియామకాలను సంపూర్ణంగా సాధించుకోలేకపోవటం బాధాకరమన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలన ఆ తర్వాత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కూడా ఇంకా మనం మౌలిక సదుపాయాల కోసం కూడా పోరాటం చేసే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికీ కూడా బస్సు ప్రమాదాలు, కుక్క కాట్లు, మక్క కొనుగోలు సెంటర్లు వంటి వాటి కోసం కూడా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాల్సిన పరిస్థితి ఏంటనీ ప్రశ్నించారు. అవసరమైతే ఢిల్లీలో లాబీయింగ్ చేస్తానని...గల్లీలో కష్టపడతానని చెప్పారు. నిజామాబాద్ వేదిక గా పుట్టిన ఏ ఆలోచన అయిన సరే సక్సెస్ అయ్యిందని...తమ పార్టీ ఆలోచన కూడా కచ్చితంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ కోడలిగా తనకు ఇందూరు ప్రజల ఆశీర్వాదం కావాలన్నారు. తెలంగాణ సోయి లేకపోవటంతోనే బీఆర్ఎస్ ఆదరణ కోల్పోయిందని చెప్పారు. రాజకీయాలు రాకెట్ సైన్స్ కాదని అందరూ రాజకీయాల్లోకి వచ్చి మార్పు తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాజకీయాల్లో మార్పు తెచ్చే వరకు కూడా పట్టువదలకుండా పోరాటం చేస్తానని ఆమె చెప్పారు.

## భక్తులతో కళకళలాడిన రామాలయాలు



**ఆదిలాబాద్: (వుదయం ప్రతినిధి)**
శ్రీరామనవమిని పురస్కరించుని సీతారాముల కల్యాణోత్సవం అంగరంగా వైభవంగా జరిగింది. ఆయా ఆలయాల్లో సుందరంగా అలంకరించినా మండపాల్లో వేద మంత్రోచ్చరణల నడుమ సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని వేద పండితులు జరిపారు. సీతారాములను పల్లకిలో ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. శుక్రవారం ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణ ఘట్టం మొదలైంది. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించి రామయ్యకు అభి ముఖంగా సీతమ్మ వారిని ఆసీనులను చేశారు. ప్రవరణ, మోక్షబంధనం, యజ్ఞోపవీతం, వరపూజ, స్వామి వారికి ప్రత్యేక అలంకారాలు నిర్వహించి మధుపర్కాలు సమర్పించారు. సరిగ్గా 12 గంటలకు భక్తుల జయ జయ ధ్వానాల మధ్య అభిజిత్ లగ్నంలో వధూవరుల శిరస్సు పై జీలకర్ర బెల్లం ఉంచారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్య ధారణ చేశారు. అనంతరం తలంబ్రాల వేడుక నిర్వహించారు. ఆలయ అర్చకులు ఇతర కార్యక్రమాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.

**- రామలయలకు పోటెత్తిన భక్తులు...**
సీతారాముల కల్యా ణం సందర్భంగా రామయ్య దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు భారీగా తరలిరావడంతో వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.ఆదిలాబాద్ పట్టణంలోని పాత హౌసింగ్ కాలనీలో నిర్వహించిన శ్రీ రామనవమి ఉత్సవాల్లో ఆదిలాబాద్ ఎమ్మెల్యే శ్రీ పాయల్ శంకర్ , జిల్లా కలెక్టర్ శ్రీ రాజర్షి షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవాలు ఘనంగా, భక్తి శ్రద్ధలతో కొనసాగాయి. అదేవిధంగా రవీంద్ర నగర్, శాంతినగర్, తాటిగూడ, కోలిపుర్ లో గల కోదండ రామాలయంలో ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఎమ్మెల్యే శ్రీ పాయల్ శంకర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ దేశం “రామరాజ్యం”లా సురక్షితంగా, శాంతియుతంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రపంచంలోని అనేక దేశాలు యుద్ధాలతో బాధపడుతున్న సమయంలో, భారత్‌లో ప్రజలు ఆనందంగా శ్రీరామనవమి జరుపుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలోని హిందూ సోదర సోదరీమణులందరికీ ఆయన శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లాలా మున్నా రత్నాకర్ రెడ్డి, ముకుంద, భూమన్న జ్యోతి, గంట జీవన్, శివ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబ్ నగర్ | మెదక్ ఉమ్మడి జిల్లాల వార్తలు

## నేటి సమాజానికి శ్రీరాముడు ఆదర్శప్రాయుడు

- భక్తిశ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలు
- లక్ష్మి నర్సింహా స్వామి ఆలయానికి రూ. లక్ష విరాళం
- కళ్యాణంలో పాల్గొన్న గాడిపల్లి రఘువర్ధన్ రెడ్డి



**వుదయం – సిద్దిపేట బ్యూరో (మార్చి 27)** నేటి సమాజానికి శ్రీరాముడు ఆదర్శప్రాయుడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గాడిపల్లి రఘువర్ధన్ రెడ్డి అన్నారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ వార్డులోని శ్రీ రాజ వేణుగోపాల స్వామి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవో పేతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గాడిపల్లి రఘువర్ధన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, భక్తిశ్రద్ధలతో కళ్యాణ క్రతువును వీక్షించారు. వేద మంత్రోచ్చారణల మధ్య అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించిన ఈ వేడుక భక్తులను ఆధ్యాత్మికంగా ఆకట్టుకుంది. అనంతరం లక్ష్మి నర్సింహా స్వామి దేవాలయాన్ని దర్శించుకుని లక్ష రూపాయలు విరాళం అందజేశారు.ఈ సందర్భంగా రఘువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, లోకకల్యాణం కోసం శ్రీరామచంద్రుడు చూపిన ధర్మమార్గం నేటి సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ రాముని ఆచరణీయమైన ఆదర్శాలను అనుసరిస్తూ క్రమశిక్షణ, సత్యం, ధర్మబద్ధమైన జీవనం గడపాలని ఆకాంక్షించారు. అలాగే ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు.కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకల్లో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని సీతారాముల ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్లు కనకరాజు, ఎల్లవ్వ, బాలకిషన్, ఎన్ ఎస్ యు ఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సందీప్ రెడ్డి,నగరం రాజి రెడ్డి, పద్మయ్య,ఆలయ కమిటీ సభ్యులు దేవరాజు, సంతోష్, మహేష్, దేవయ్య, నవీన్, గ్రామ పెద్దలు జీవన్ రెడ్డి, తిరుమల్ రెడ్డి, సోమయ్య, లక్ష్మీపతి, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సిలిండర్లకు, పెట్రోల్, డీజిల్‌కు ఎలాంటి కొరత లేదు

- ప్రజలు అనవసరంగా ఆందోళన చెందొద్దు
- అవసరానికి మించి కొనుగోలు చేయొద్దు
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి మార్చ్ 27(వుదయం ప్రతినిధి)** జిల్లాల్లో గృహావసరాలకు ఎల్.పి.జి సిలిండర్లకు గాని పెట్రోల్, డీజిల్ కు ఎలాంటి కొరత లేదనీ ప్రజలు వదంతులు నమ్మి ప్రస్తుత అవసరం లేకున్న ముందస్తు కొనుగోలుకు ప్రయత్నం చేయవద్దని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడొక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో అవసరానికి అనుగుణంగా పెట్రోల్, గ్యాస్ నిలువలు ఉండటంతో పాటు అవసరానికి మించి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాలతో పాటు వనపర్తి జిల్లాకు ఎప్పటికప్పుడు డిమాండుకు అనుగుణంగా సరఫరా అవుతున్నాయని, భవిష్యత్తులో సైతం ఎలాంటి కొరత ఏర్పడటానికి అవకాశం లేదన్నారు. ప్రజలు సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మి ప్రస్తుతం అవసరం లేకున్న అవసరానికి మించి కొనుగోలు చేయడం వల్ల మాత్రమే సమస్యలు వస్తాయని తెలిపారు. ప్రస్తుతం కమర్షియల్ సిలిండర్ల సరఫరా సైతం పెంచడం జరిగిందన్నారు. ప్రజలు వదంతులు నమ్మవద్దని, జిల్లాలో ఎలాంటి లోటు లేదని తెలియజేశారు.

## ఎన్ఎస్ఎస్ దత్తత గ్రామాల్లో స్వచ్ఛతపై అవగాహన



**సంగారెడ్డి, 27 మార్చి, వు దయం :** తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డి ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో దత్తత గ్రామాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరాల్లో భాగంగా స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. కల్పకూర్, అంగడిపేట గ్రామాలలో 90 మంది విద్యార్థులతో, మల్కాపూర్ గ్రామంలో 45 మంది బాలికలతో కొనసాగుతున్న శిబిరాల మూడవ రోజున స్వచ్ఛత సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం కల్పించారు. శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని కల్పకూర్ గ్రామంలోని కాశీ విశ్వేశ్వర ఆలయం మరియు పరిసర ప్రాంతాలను విద్యార్థులు శుభ్రపరిచారు. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, దేవాలయం పరిసరాలను పర్వదినానికి అనుగుణంగా పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.అలాగే మల్కాపూర్ గ్రామంలో ప్రాథమిక మరియు ఉన్నత పాఠశాలల పరిసరాలను విద్యార్థులు శుభ్రం చేసి పరిశుభ్రత ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన పరిసరాల ద్వారా అంటువ్యాధులను నివారించవచ్చని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పరిశుభ్రత కీలకమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛత ఎంతో దోహదపడుతుందని, కాలుష్యాన్ని తగ్గించడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాల ద్వారా గ్రామాల్లో స్వచ్ఛత, పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వాలంటీర్లు కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్ కుమార్, డాక్టర్ వాణి పాల్గొన్నారు. కల్పగూర్‌లో ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి మల్లేష్, సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మల్కాపూర్‌లో ఉన్నత పాఠశాల హెచ్ఎం యాదగిరి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు మరియు గ్రామ పెద్దలు విద్యార్థులకు మద్దతు అందించారు.



### త్రిపుర గవర్నర్‌ను కలిసిన నాగురవ్ నామాజీ

**నారాయణపేట టౌన్ మార్చి 27 (వుదయం ప్రతినిధి)** త్రిపుర రాష్ట్ర గవర్నర్ ఇంద్రసేనారెడ్డినీ శుక్రవారం రాష్ట్ర రాజధాని అగర్తలలో మర్యాద పూర్వకంగా బిజెపి రాష్ట్ర సీనియర్ నేత రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగురావు నామాజీ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రాభివృద్ధి తదితర అంశాలపై చేర్చారు.

## మక్తల్ లో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

- పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించిన మంత్రి వాకిటి శ్రీహరి సోదరుడు వాకిటి శేషగిరి, రాధిక దంపతులు
- వేడుకల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులు



**మక్తల్ , మార్చి 27 ( వుదయం):** శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా నారాయణ పేట జిల్లా మక్తల్ పట్టణంలోని శ్రీ పడమటి ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలోని రామ్ లీలా మైదానంలో సీతారాముల కల్యాణ మహోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. రామ్ లీలా మైదానంలో వేలాది మంది భక్తుల మధ్య స్వామి వారి కళ్యాణ మహోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త పి.ప్రాణేషాచార్య ఆధ్వర్యంలో ప్రాణేషాచారి గాయత్రి దంపతులచే సీతారాముల కళ్యాణం జరిపించగా విద్వాన్ రాఘవేంద్ర ఆచార్య వేదమంత్రోచ్చారణల మధ్య కళ్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి దంపతులు భద్రాచలం లో శ్రీ రామ నవమి వేడుకలకు హాజరు కాగా మంత్రి సోదరుడు వాకిటి శేషగిరి రాధిక దంపతులు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాజాబజంత్రీల మధ్య రామ్ లీలా మైదానానికి ఊరేగింపుగా పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు తీసుకువచ్చి అర్చకులకు అందజేశారు. అదే విధంగా సంగంబండ కు చెందిన గవినోళ్ళ మంజుల బాలకృష్ణ రెడ్డి దంపతులు సమర్పించారు.ప్రతి ఏడాది మాదిరిగా దివంగత మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్ రెడ్డి కుటుంబం నుండి, దామోదర జువెల్లర్స్ యజమాని తాళం పల్లి రమేష్,కాత్త శ్రీనివాస్ గుప్తా కూడా స్వామివారికి ముత్యాల తలంబ్రాలను ఆనవాయితీగా అందజేశారు. రామ్ లీలా మైదానంలో జరిగిన కళ్యాణ మహోత్సవం వేడుకలకు వేలాది మంది భక్తులు తరలి వచ్చి తిలకించారు .వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య రాముల వారి కల్యాణ వైభోగం కన్నుల పండువగా సాగింది. సందర్భోచితంగా విద్వాన్ రాఘవేంద్ర ఆచార్య రామాయణ ఇతిహాసాలను ఘట్టాలను భక్తులకు వివరించారు.రాములవారి 14 ఏళ్ళ అణ్యావాసం ఆ తరువాత పట్టాభిషేకం రాజ్య పాలన వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో లో స్థానిక మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి,మున్సిపల్ చైర్పర్సన్ వాకిటి మానస హన్మంతు, మార్కెట్ చైర్పర్సన్ జి.రాధాలక్ష్మా రెడ్డి,మాజీ ఎంపీపీ బిజెపి రాష్ట్ర నాయకులు కొండయ్య ,బికెఆర్ ఫౌండేషన్ చైర్మన్ కాంగ్రెస్ నాయకులు గవినోళ్ళ బాలకృష్ణ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి. నరసింహా గౌడ్ ,బిఆర్ఎస్ నాయకులు కొత్త శ్రీనివాస్ గుప్తా ,వివిధ పార్టీల నాయకులు జి.గోపాల్ రెడ్డి,బి.రాజశేఖర్ రెడ్డి, పికె.నర్సింహ,దేవరింటి నరసింహారెడ్డి ,రాజాగౌడ్,కట్ట సురేష్ కుమార్ గుప్తా, అమరేందర్ రెడ్డి, బి.గణేష్ కుమార్, బోయ రవికుమార్,కోళ్ళ వెంకటేష్, కావలి శ్రీహరి,కావలి తాయప్ప,మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీవిద్య నీలాగౌడ్, కర్రెం చెన్నమ్మ నీలప్ప, మహేష్, వెంకటేష్,ఆలయ సిబ్బంది అరవింద చారి ,కుమ్మరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. శ్రీరామనవమి సీతారాముల కల్యాణం సందర్భంగా స్థానిక సిఐ రామ్ లాల్,ఎస్సై వై.భాగ్యలక్ష్మి రెడ్డి, రేవతి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. దేవాలయం నుండి సంగంబండ రోడ్డు కళ్యాణం సమయంలో మూసివేశారు. ఈ సందర్భంగా సంగంబండకు చెందిన గవినోళ్ళ బాలకృష్ణారెడ్డి మంజుల దంపతుల భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.



### మహిళా దినోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రభాకర్‌కు ఆహ్వానం

**సంగారెడ్డి వుదయం.** సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ కు సమాజ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహిళల సాధికారత, సామాజిక అభివృద్ధి దిశగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఇప్పపల్లి నర్సింలు, సదాశివపేట తాలూకా అధ్యక్షులు పట్లల్లో మల్లికార్జున్, ఎడ్ల బజార్ వీరశైవ సమాజపు అధ్యక్షుడు గంధిగా రాజు తదితరులు పాల్గొని కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. మహిళల పురోగతికి దోహదపడే విధంగా ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.



## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ కృషి

- కాసులాబాద్‌లో రూ.10 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం
- శ్రీ రామ నవమి వేడుకల్లో పాల్గొన్న చెరుకు శ్రీనివాస్ రెడ్డి

**వుదయం, దుబ్బాక (మార్చి27 )** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.శ్రీరామ నవమి పండుగ సందర్భంగా సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండగగా జరగగా ఈ ఉత్సవాల్లో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, దర్శించుకున్నారు. అనంతరం గ్రామ అభివృద్ధికి కీలకంగా నిలిచే కార్యక్రమాలను ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన రూ.10 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులు పూర్తయిన తరువాత గ్రామంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడతాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మిరుదొడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మద్దెల రాజేశం, సీనియర్ నాయకులు నర్రా రాజి రెడ్డి, కాసులాబాద్ గ్రామ అధ్యక్షుడు మదురి నరేష్, గ్రామ సర్పంచ్ ముత్యాల బాబాయ్, ఆరేపల్లి గ్రామ సర్పంచ్ వజ్జపల్లి స్వప్న రాజు, అల్వాల గ్రామ మాజీ సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య, వెంకట్ గౌడ్, పంజాల వెంకటేశం, తాళ్లపల్లి బాలరాజు, మదూరి రామచంద్రం, మదూరి సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## మైలగడ్డ సమీపంలో అక్రమ ఇసుక దందా



### అధికారుల చెక్‌తో పారిపోయిన వ్యాపారులు

**గద్వాల మార్చి 27 (వుదయం ప్రతినిధి)** గద్వాల నియోజకవర్గంలోని కేటి దొడ్డి మండలం మైలగడ్డ స్టేజ్ సమీపంలో అక్రమ ఇసుక రవాణా మరోసారి వెలుగులోకి వచ్చింది. కర్ణాటక నుంచి వచ్చిన ఓటిప్పర్‌ను అధికారులు వెంటపడుతు న్నారన్న సమాచారం అందుకున్న ఇసుక వ్యాపారులు భయంతో ఇసుకను కాలువ రోడ్డుపై దొబ్బి అక్కడి నుంచి పరారయ్యారు ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది సమాచారం ప్రకారం, సరిహద్దు ప్రాంతాల నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను అధికారులు గమనించడంతో వెంటపడినట్లు తెలుస్తోంది ఈ నేపథ్యంలో పట్టుబడతామన్న భయంతో డ్రైవర్ మరియు సంబంధిత వ్యక్తులు వాహనాన్ని అక్కడే వదిలి, లోడును రోడ్డుపై ఖాళీ చేసి పరారైనట్లు స్థానికులు చెబుతున్నారు కాలువ రోడ్డుపై పెద్ద మొత్తంలో ఇసుక పడివుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా రాత్రి సమయంలో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామస్తులు తెలిపారు అదే విధంగా అక్రమ ఇసుక దందా కారణంగా పర్యావరణానికి కూడా నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఈ ఘటనపై మండల ప్రజలు తీవ్రంగా స్పందిస్తూ అక్కడ పడివున్న ఇసుకను పోలీసులు వెంటనే స్వాధీనం చేసుకుని, దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇటువంటి అక్రమ రవాణాను అరికట్టేం దుకు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు అధికారులు ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



### గీతంలో డిజిటల్ సాన్నిహిత్యంపై ఆతిథ్య ఉపన్యాసం

**పటాన్చెరు (వుదయం:** విద్యా పరిశోధనను విపులీకరించిన సెంటర్ ఫర్ ఏషియన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ తేజస్విని నిరంజన హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్)లోని ఆంగ్లం, ఇతర భారత విభాగం ఆధ్వర్యంలో డిజిటల్ సాన్నిహిత్యం: అంతర్–ఆసియాలో యువతులు అనే శీర్షిక శుక్రవారం ప్రత్యేక ఆతిథ్య ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిని గీతంలోని సెంటర్ ఫర్ ఏషియన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ తేజస్విని నిరంజన అందించారు. ఆసియా నగరాలైన హాంగ్ కాంగ్, సింగపూర్, గ్వాంగ్ జౌ, బెంగళూరులలో ఆమె ఇటీవల జరిపిన బహుళ–ప్రాంతీయ పరిశోధన ఆధారంగా, నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలు, అభివృద్ధి చెందుతున్న వినియోగదారుల సంస్కృతులచే రూపుదిద్దుకున్న డిజిటల్ మాధ్యమం, యువతులు తమ గుర్తింపు, సంబంధాలు, ఆత్మీయతను నిర్వహించుకునే విధానాలను ఎలా మారుస్తుందో ప్రొఫెసర్ నిరంజన అన్వేషించారు. ఈ ఉపన్యాసం భాషా పద్ధతులు, ఆన్ లైన్–ఆఫ్ లైన్ సంబంధాలు, డిజిటల్ సన్నిహిత ప్రవర్తన యొక్క కొత్త రూపాలను కూడా పరిశీలించింది. సమకాలీన సందర్భాలలో భావప్రసార సరళి, ఫ్లాట్ ఫారమ్ వినియోగం, ఎంపిక చేసుకున్న భాషా వాడకం అనేవి భావోద్వేగ వ్యక్తీకరణను, సామాజిక సంబంధాలను ఎలా పునర్నిర్మిస్తాయో వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎస్ హెచ్ఎస్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఆంగ్లం, ఇతర భారత విభాగాధిపతి డాక్టర్ సయంతన్ మోండల్ వందన సమర్పణతో ముగిసింది.

## పారిశుధ్య పనులపై మున్సిపల్ చైర్ పర్సన్ ఆకస్మిక తనిఖీ



**నారాయణపేట మార్చి 27 (వుదయం ప్రతినిధి)** నారాయణ పేట మున్సిపల్ చైర్ పర్సన్ గా కొండా శ్వేత సత్యయాదవ్ ఈనెల 25న బాధ్యతలు చేపట్టారు.ఆ వెంటనే ఆమె రంగంలోకి దిగి పారిశుధ్యంపై దృష్టి పెట్టి శుక్రవారం తెల్లవారు జామున ఆకస్మిక తనిఖీ చేశారు. మున్సిపలిటి శానిటేషన్ విభాగం పని తీరును తెలుసుకో వడానికి ఉదయం 5 గం లకు మున్సి పాలిటీకి చేరుకొని సిబ్బంది హాజరును పరిశీలించారు. ప్రధాన రహదారులను శుభ్రపరచడంలో శ్రద్ధ చూపాలని సిబ్బందినీ ఆదేశించారు. అలాగే పట్ట ణంలో శానిటేషన్ విభాగం పనితీరు మరింత బాగుండా లని లేకుంటే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెతో పాటు వైస్ చైర్ పర్సన్ మంజుల,బిజెపి నాయకులు సత్య యాదవ్, జి ఆర్ రెడ్డి పాల్గొన్నారు.

## జగ్గారెడ్డి ఆధ్వర్యంలో భక్తి పారవశ్యం



**సంగారెడ్డి వుదయం** సంగారెడ్డి పట్టణంలోని రామ్ నగర్ రామ్ మందిర్‌లో శ్రీ రామ నవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ మహోత్సవానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆధ్వర్యం వహించగా, భక్తుల పాల్గొనికతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. రంగపేట పీఠాధిపతి పూజ్య శ్రీ మాధవానంద సరస్వతి స్వామి వారి పర్యవేక్షణలో, జ్యోతిర్వాస్తు విద్యాపీఠం పీఠాధిపతి శ్రీ మహేశ్వర శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో సాంప్రదాయ పద్ధతుల్లో కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి , ఆయన మిత్రులు, రామ్ మందిర్ యువసేన మరియు ఆలయ కమిటీ పెద్దల సహకారంతో శ్రీ సీతారాముల కోసం సుమారు రూ.2.50 కోట్ల విలువైన బంగారు, వెండి ఆభరణాలను ప్రత్యేకంగా సమర్పించారు. సీతారాముల వారికి 2 కిలోల 250 గ్రాముల బంగారంతో తయారుచేసిన కిరీటాలు, కర్ణాభరణాలు, కంఠాభరణాలు, వడ్డానాలు, పద్మపాదాలు, ధనస్సు–బాణం, యజ్ఞోపవీతం, నయనాలు, తిలకాలు, ముక్కు పోగు, శంఖు–చక్రాలు వంటి అలంకరణలు సమర్పించగా, అమ్మవారికి మంగళసూత్రం, కమలహస్తం, శ్రీరాములకు శరంతో కూడిన హస్తం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే 10 కిలోల వెండితో ఆదిశేషుడు, వెండి కళ్యాణ పీటను రూపొందించి సమర్పించారు. ఈ ఆభరణాలకు ముందుగా రామ్ నగర్‌లోని జగ్గారెడ్డి గారి నివాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల నడుమ ఘనంగా ఆభరణాల ఊరేగింపు నిర్వహించి రామ్ మందిర్‌కు తీసుకువచ్చారు. ఊరేగింపు అనంతరం శ్రీ సీతారాముల వారికి బంగారు ఆభరణాలను సమర్పించి, అలంకరించి కళ్యాణోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ సీతారాముల ఆశీర్వాదాలు పొందారు.

## కలసి మెలసి వ్యాపారాలు సాగించండి

### నారాయణపేట ఎస్ఐ వెంకటేశ్వర్లు



**నారాయణపేట మార్చి 27 (వుదయం ప్రతినిధి)** మతాలకు అతీతంగా నారాయణపేట విరాజిల్లుతుందని ఇందుకుగాను ప్రతి ఒక్కరు కలిసిమెలిసి తమ వ్యాపారాలను కొనసాగించుకోవాలని నారాయణపేట పట్టణ ఎస్ఐ వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని నేచురల్ కేఫ్ పక్కన జిశాన్ హోటల్ దగ్గర అర్బాజ్ అహ్మద్ స్థాపించిన సోహో గోల్డెన్ డిలైట్ ఐస్ క్రీమ్ పార్లర్ ను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే వేసవిలో వేడి వాతావరణానికి చల్లటి ఐస్ క్రీమ్ తింటే ఎంతో ఉపయోగపడుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సోహో ఐస్ క్రీమ్ స్థాపకుడు అమిరుద్దీన్ చౌద్రి,ప్రత్యేక అతిథులు తాఖీ చంద్ 23వ వార్డ్ కౌన్సిలర్, తాఖీ చంద్ పీర్ 24వ వార్డ్ కౌన్సిలర్ తోపాటు ఎం.డి. నసీరుద్దీన్,అర్షాద్ ఫైసల్,ఎం.డి. తాహీర్ ఖరాడీ,అహ్మద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా రాములోరి కల్యాణం










**వెల్దండ మార్చ్ 27 (వు దయం ప్రతినిధి)** మండల కేంద్రం తో పాటు పరిసర గ్రామాలలో శ్రీరామ నవమి పురోభినాన్ని పురస్కరించుకొని సీతారాముల కళ్యాణ ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు మండల కేంద్రంలో వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో వెలసిన రామాలయం లో బుధర్పేట ఆంజనేయ స్వామి దేవాలయంలో, గ్రామపంచాయతీ సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో మరియు చొక్కనపల్లి, కంటోన్ పల్లి లలో వైభవంగా జరుపుకు న్నారు రామనామ స్మరణతో మార్మోగాయి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు అన్న ప్రసాద వితరణ గావించారు ఉత్సవాలలో సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు బచ్చు రామకృష్ణ, ఉప సర్పంచ్ బసున మోని శ్రీనివాస్, పర్వత రెడ్డి, మాజీ ఎంపిటిసి చిందం కృష్ణయ్య ,కృష్ణారెడ్డి, శశి పాల్ రెడ్డి, అంజన్ రెడ్డి, తంబాలు యాదవ్, వార్డు సభ్యులు వాణి పురుషోత్తం చారి, రమేష్, వెంకటేష్, తోపాటు పలువురు నాయకులు మహిళలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు సందర్భంగా నిర్వాహకులు మిరియాల రాజయ్య పద్మ దంపతులు ముఖ్య అతిథులకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

### ఘనంగా కళ్యాణ వేడుకలు

**మరికల్ మార్చి 27 ( వుదయం ప్రతినిధి )** మరికల్ మండల కేంద్రంలోని శుక్రవారం శ్రీరామ నామ కళ్యాణ వేడుకలు మాదారం రోడ్డుకు వైభవంగా జరిగాయి గ్రామ సర్పంచ్ మరియు గ్రామస్తులు మాదారం రోడ్డుకు రాములవారి కి పట్టు వస్త్రాలు సమర్పిస్తూ ఉదయానే వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు మరియు ప్రతి సంవత్సరము శ్రీ రామనామ కళ్యాణ వేడుకలు ఘనంగా జరుపుకుంటామని ఆ గ్రామస్తులు తెలిపారు మరియు ప్రతి సంవత్సరం మన రాష్ట్రాన్ని సుభిక్షంగా ఉండాలని ప్రజలు పూజలు చేశారు మరికల్ చౌరస్తా నుండి ఊరేగింపుతో వచ్చి మాదారం రోడ్డులో కళ్యాణ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు

### ముచ్చర్లపల్లి గ్రామంలో ..

- ముఖ్యఅతిథిగా బీజేపీ రాష్ట్ర నాయకుడు ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

**ఊర్కొండ న్యూస్ 27వుదయం ప్రతినిధి** ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించిన.. శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి హాజరైన.. నాగర్ కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కుదుములు తిరుపతి రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణంలో పాల్గొన్న అనంతరం, ఆంజనేయస్వామి వారి దర్శనం చేసుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. గ్రామ ప్రజలపై శ్రీ సీతారామచంద్రస్వామి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నానని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు మాజీ ప్రజాప్రతినిధులు మరియు ఆలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

### గోనెపల్లిలో ..

**వుదయం – సిద్దిపేట బ్యూరో (మార్చి27)** సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గోనెపల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ ఉత్సవంలో మహిళలు, గ్రామస్తులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి దివ్య కళ్యాణాన్ని భక్తి శ్రద్ధలతో తిలకించారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వహకులు, భక్తులు మాట్లాడారు.సీతారాముల కళ్యాణం దైవికతకు, ధర్మానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. శ్రీరాముడు, సీతమ్మ వారి వివాహం మనకు సత్యం, న్యాయం, పరస్పర గౌరవం వంటి విలువలను నేర్పుతుందని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఈ కళ్యాణాన్ని భక్తి భావంతో నిర్వహించడం వల్ల గ్రామానికి శాంతి, సౌభాగ్యం కలుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇలాంటి పుణ్య కార్యక్రమాల్లో పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని, యువత కూడా ఈ సంప్రదాయాలను కొనసాగించాలని కోరారు.అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు కార్యక్రమంలో హనుమాన్ దేవాలయ కమిటీ అధ్యక్షులు శ్రీకాంత్ ,హరి,అశోక్,శ్రీను,శేఖర్, మధుసూదన్ రెడ్డిశ్రీనివాస్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, రాజేందర్,తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడంపై సంతోషం వ్యక్తం చేశారు.

### సంగారెడ్డి పట్టణంలో..

**సంగారెడ్డి వుదయం** సంగారెడ్డి పట్టణంలోని 33వ వార్డ్ రెవిన్యూ కాలనీలో గల శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రీ రామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయం పుష్పాలతో అలంకరించబడగా, మంగళ వాద్యాల నాదం మధ్య భక్తిశ్రద్ధలతో కార్యక్రమం సాగింది. ఈ కళ్యాణ మహోత్సవం ఆలయ అర్చకులు కృష్ణరావు పర్యవేక్షణలో సంప్రదాయబద్ధంగా నిర్వహించబడింది. రెవెన్యూ కాలనీ, సర్వే కాలనీ, అయ్యప్ప కాలనీ కాలనీతో పాటు పరిసర ప్రాంతాల నుండి భక్తులు భారీ సంఖ్యలో హాజరై సీతారాముల దివ్య కల్యాణాన్ని దర్శించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. కార్యక్రమం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేయడం జరిగింది. భక్తులు శ్రద్ధగా ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో 33వ వార్డ్ కౌన్సిలర్ రవి నాయక్, మాజీ కౌన్సిలర్ నావత్ నాగరాజు, బీజేపీ నాయకులు గురునాథ్, ఆలయ కమిటీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్, జనరల్ సెక్రటరీ దుర్గయ్య, అలాగే మొగులయ్య, ప్రశాంత్ రెడ్డి, సంతోష్, శంకర్, సునీల్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీ రాముని వేషధారణలో చిన్నారి బాలుడు

**వెల్దండ మార్చి 27 (వు దయం ప్రతినిధి)** శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో నిర్వహించిన సీతారాముల కళ్యాణం ఉత్సవంలో చిన్నారి బాలుడు అచ్చుతానంద శ్రీరాముని వేషధారణ పలువురుని అలరించింది దీంతో ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు బాలుడిని అభినందించారు.

### సదాశివపేటలో

సదాశివపేట వుదయం సదాశివపేట పట్టణంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వేడుకలు భక్తి శ్రద్ధలతో అట్టహాసంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన డోలారోహనం కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పాల్గొని, సాంప్రదాయ పద్ధతుల్లో శ్రీ సీతారాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొని, వేద పండితుల ఆశీర్వాదాలు స్వీకరించారు. శ్రీరాముని దర్శించుకుని జిల్లా ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తుల "జై శ్రీరామ్" నినాదాలతో మార్మోగాయి. భక్తులతో నిండిన ఆలయం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, శ్రీరామనవమి పర్వదినం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ధర్మం, న్యాయం, సత్యానికి శ్రీరాముడు ఆదర్శమని తెలిపారు. ప్రజలు శ్రీరాముడి ఆచారాలను అనుసరించి సమాజంలో సౌభ్రాతృత్వం, ఐక్యతను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### మల్లికార్జున హిల్స్‌లో సీతారాముల కళ్యాణం

**బీరంగూడ (వుదయం):** బీరంగూడ ప్రాంతంలోని మల్లికార్జున హిల్స్ కాలనీలో శ్రీ లలిత రమేష్ గౌడ్ గారి ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాలనీవాసులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో భాగంగా సాంప్రదాయబద్ధంగా పూజలు, వేద మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కళ్యాణం నిర్వహించారు. భక్తి గీతాలు, హారతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ సంగీత లక్ష్మీ నాగరాజు, కమిటీ సభ్యులు, కాలనీవాసులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం స్వామివారి శోభాయాత్రను నిర్వహించగా, భక్తులు భక్తి నినాదాలతో పాల్గొన్నారు. ఈ శోభాయాత్ర కాలనీ వీధుల గుండా సాగి ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

# శ్రీరాముని జీవితం అందరికీ ఆదర్శం

## సీతారాముల కళ్యాణం వేడుకల్లో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ దంపతులు



**నారాయణపేట టౌన్ మార్చి 27 (వుదయం ప్రతినిధి)** నారాయణపేట మండలం అపిరెడ్డిపల్లి గ్రామం రామ దేవుని గుట్టపై వెలసిన రామాలయంలో , నారాయణపేట మూల హనుమాన్ మందిరం లో శుక్రవారం శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వ హించారు.ఉదయం ఆల యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామ పెద్దలు కల్యాణానికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సీతా రాముల కళ్యాణ మహోత్సవంలో నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ దంప తులుపాల్గొన్నారు.అనంతరం ఎస్పీ వినీత్ మాట్లా డుతూ ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ధార్మిక విలువలు నెలకొనాలని ఆకాంక్షించారు.కల్యాణోత్సవం సందర్భంగా నిర్వాహ కులు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.ఎస్పీ దంపతులను నిర్వాహకులు శాలువాతో సన్మానిం చారు.ఈ వేడుకల్లో స్థానిక ప్రజాప్రతినిధులు,గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు అయ్యారు.

నారాయణపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ ఉదయం పల్లా హనుమాన్ దేవాలయం దగ్గర హిందూ మత పెద్దలు, యువకులతో కలిసి శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకున్నారు.ప్రత్యేక పూజలు నిర్వహించా రు.అనంతరం భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించా రు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ శ్రీరాముని జీవితం అందరికీ ఆదర్శమని సమాజంలో మంచిని స్వీక రిద్దాం మంచిని పంచుదాం శ్రీ రామ చంద్రుడి దివ్య ఆశీస్సు లతో అంత సుఖసంతో షాలతో ఉండాలని కోరుకుం టూ జిల్లా ప్రజలకు, ప్రజాప్ర తినిధులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలంతా తమ పండుగ లను శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లాలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, సీఐ లు శివ శంకర్ , నాగార్జున ఎస్ఐ వెంకటేశ్వర్లు,వి ఎచ్ పి నాయకులు, బజరంగ్ దళ్ యువత, కాంగ్రెస్, బిజెపి, బి ఆర్ ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన జనసేన పార్టీ నాయకులు

**మక్తల్ మార్చి 27 (వుదయం ప్రతినిధి)** మెగాస్టార్ చిరంజీవి కుమారుడు రాంచరణ్ పుట్టినరోజు సందర్భంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా మక్తల్ లో జనసేన జిల్లా ఇంచార్జ్ డాక్టర్ మణికంఠ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం శుక్రవారం కార్యక్రమాన్ని బీజేపీ నాయకుడు కొండయ్య ప్రారంభించారు. జిల్లాలోని నారాయణ పేట, మక్తల్, మద్దూర్ ,కొత్తపల్లి మండలాలకు చెందిన జనసేన కార్యకర్తలు మెగా అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేసి చలివేంద్రం ప్రారంభించి ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.మణికంఠ మాటాడుతూ త్వరలో జిలాలో పలు కార్యక్రమాలు చేపట్టి ప్రజల సమస్యల కోసం ప్రశ్నిస్తామని అన్నారు. ఏప్రిల్ లో జిల్లా స్థాయి సభ ఏర్పాటు చేసి జనసేన జిల్లా మండల స్థాయి కమిటీ లు ఏర్పాటు చేస్తామని అన్నారు.

## మహాద్వార్ గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం

### సర్పంచ్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి



**మక్తల్ మార్చ్ 27 (వుదయం):** నారాయణపేట జిల్లా మక్తల్ మండల పరిధిలోని మహద్వార్ గ్రామంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ డాక్టర్ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ నిధులతో కెవిఏ–25 సింగిల్ ఫేజ్ విద్యుత్ బుడ్డీలను ఏర్పాటు చేశారు. అలాగే ఎన్ఆర్ఐ ఈజీఎస్ నిధులతో సుమారు రూ.5 లక్షల వ్యయంతో 120 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణ పనులను 8వ వార్డు నుంచి 9వ వార్డు వరకు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సంతోష్ రెడ్డి, రాజేశ్వరరావు, గాల్ల రాములు వడ్ల శ్రీనివాస్ డాక్టర్ ఆశప్ప బొంబాయి శంకరప్ప ఉపసర్పంచ్ కథనోళ్ళ శివాని శ్రీనివాస్ వార్డు సభ్యులు గుడిసె పాపమ్మ, బాట నరసింహ బాట జయమ్మ, పులకోరి నాగప్ప గుడిసె రామకృష్ణ, ఆర్.ఎం.పి నస్లె నాగరాజు జంగం బసవరాజు పిద్దమెల మల్లేష్, దోర్ నింగప్ప పేట వెంకటయ్య చిన్నూర్ హనుమంతు లక్ష్మయ్య ఎర్రంకోళ్ల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలు, వార్డు సభ్యులు మరియు ఇతర నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## కాంగ్రెస్ పార్టీ తోనే గ్రామాల అభివృధి సాధ్యం



**నారాయణఖేడ్ మార్చి 27(వుదయం)** నారాయణఖేడ్ మండల పరిధిలోని పిప్రి గ్రామంలో నూతన సి సి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసినా నారాయణఖేడ్ మున్సిపల్ చైర్మన్ నగేశ్ కుమార్ షెట్కర్, అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం అని అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రాల్లో అభివృద్ధి చెందుతాయన్నారు. కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు ప్రతి వ్యక్తికి ఇచ్చే విధంగా కృషి చేస్తున్నామన్నారు. గ్రామంలో 10 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామన్నారు. ప్రస్తుతం 8 నిర్మాణంలో ఉన్నాయన్నారు. త్వరలో నిర్మాణాలు పూర్తిచేసి గృహప్రవేశాలు చేసే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నేత సాగర్ శెట్కర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ ప్రజలకు శ్రీ రామనవమి శుభాకాంక్షలు

### సర్పంచ్ తుమ్ కృష్ణారెడ్డి



**గద్వాల మార్చి 26 (వుదయం ప్రతినిధి)** గద్వాల నియోజకవర్గం మల్లకల్ మండలం అమరవాయి గ్రామంలోని శ్రీ రామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ ప్రజలందరికీ సర్పంచ్ తుమ్ కృష్ణారెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మర్యాద పురుషోత్తముడైన శ్రీ రామచం ద్రుని ఆదర్శాలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని సూచించారు శ్రీ రాముని దివ్య ఆశీస్సులు అమరవాయి గ్రామ ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని సమాజంలో శాంతి సౌభ్రాత ృత్వం ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ పర్వదినం ప్రతి కుటుంబానికి ఆనందం ఆరోగ్యం ఐశ్వర్యం తీసుకురావాలని ప్రార్థిస్తూ శ్రీ రామ నవమిని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

## హనుమాన్ విజయోత్సవం సందర్భంగా భారీ బైక్ ర్యాలీ

### కరపత్రం ఆవిష్కరణ




**పటాన్‌చెరు ( వుదయం):** హనుమాన్ విజయోత్సవాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 2వ తేదీ ఉదయం 9 గంటలకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ నిర్వాహకులు తెలిపారు. ఈ ర్యాలీకి సంబంధించిన కరపత్రాన్ని శనివారం పటాన్‌చెరు రామాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ, 2004 సంవత్సరంలో భాగ్యనగర్‌లో ప్రారంభమైన వీర హనుమాన్ విజయ యాత్ర బైక్ ర్యాలీ ప్రస్తుతం దేశవ్యాప్తంగా విస్తరించిందని తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా పటాన్‌చెరులో కూడా బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీని విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జేపీ కాలనీలోని పంచముఖి హనుమాన్ మందిరం వద్ద నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ బైక్ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ప్రయాణించి, శాంతినగర్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద అన్నప్రసాద కార్యక్రమంతో ముగుస్తుందని వివరించారు.

## మద్యం మత్తులో పెట్రోలు తాగి..

### ఆస్పత్రిలో చికిత్స పొందుతూ యువకుడి మృతి



**వుదయం,దుబ్బాక (మార్చి 27)** మద్యం మత్తులో పెట్రోల్ తాగిన యువకుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన దుబ్బాక మండలం లచ్చపేట శివారులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ కీర్తిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్ద చీకోడ్ గ్రామానికి చెందిన ఎండి.ఫయాజ్ (22)అనే యువకుడు ఏ పని చేయకుండా ఖాళీగా ఉంటూ, మద్యానికి బానిస అయ్యాడు. ఈనెల 16న దుబ్బాక పురపాలికలోని లచ్చపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాల వెనక మద్యం మత్తులో తన ద్విచక్ర వాహనంలోని పెట్రోలు తాగి, స్నేహితుడు రాజుకు సమాచారం అందించాడు. వెంటనే అక్కడికి చేరుకున్న స్నేహితుడు, కుటుంబ సభ్యులు ఎండి ఫయాజ్ను చికిత్స నిమిత్తం దుబ్బాక, సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రులకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి ఎండి ఫయాజ్ మృతి చెందాడు. మృతుని చిన్నాన్న ఎండి ఫరూక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పెద్దలోని గ్రామంలో సీతారాముల కళ్యాణం



**మునిపల్లి మండలం(వుదయం):** పెద్దలోని గ్రామంలో హనుమంతు రాజు సర్పంచ్ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించబడింది. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో భాగంగా సాంప్రదాయబద్ధంగా పూజలు, వేద మంత్రోచ్చారణల మధ్య సీతారాముల కళ్యాణం నిర్వహించారు. భక్తి గీతాలు, హారతులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. అనంతరం స్వామివారి శోభాయాత్రను నిర్వహించగా, భక్తులు భక్తి నినాదాలతో పాల్గొన్నారు. ఈ శోభాయాత్ర గ్రామ వీధుల గుండా సాగి ఉత్సవానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## ప్రజల సంక్షేమమే ప్రధాని మోదీ లక్ష్యం



**నారాయ ణ పేట టౌన్ మార్చి 27 (వుదయం ప్రతినిధి)** దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యం గా ప్రధాని నరేంద్ర మోదీ నిర్ణయాలు తీసుకుంటారని కేంద్ర ప్రభుత్వ అదనపు న్యాయవాది నందు నామాజీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఇంధన సంక్షోభం సమయం లోనూ దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పెట్రోల్,డీజిల్ పై 10రూపాయల సుంకం తగ్గించడం చరిత్రాత్మకం అన్నారు.పశ్చిమాసియా యుద్ధం సందర్భంగా మిగతా ప్రపంచ దేశాల్లో ధరలు పెంచితే ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం దేశ ప్రజల సంక్షేమ మే లక్ష్యంగా పెట్రోల్ డీజిల్ ధరలు 10 రూపాయలు తగ్గించారని అన్నారు.ఇది రానున్న రోజుల్లో భారత్ విశ్వగురు కావడానికి నిదర్శనమని అన్నారు.ఇది సామాన్య ప్రజలకు ఎంతో ఉపశమనమని అన్నారు.సంక్షోభ సమయంలో పెట్రో ధరలు తగ్గించిన ప్రధాని నరేంద్ర మోదీ కి,కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## రామ్ చరణ్ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం

### తెలంగాణ జనసేన పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఆడ్ హాక్ కమిటీ సభ్యులు డాక్టర్ మణికంఠ గౌడ్



**మక్తల్ మార్చి 27 (వుదయం):** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం తెలంగాణ జనసేన పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఆడ్ హాక్ కమిటీ సభ్యులు డాక్టర్ మణికంఠ గౌడ్ ఆధ్వర్యం లో గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ జన మదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతం కాగా అలాగే చలివేంద్రంని సైతంప్రారంభిచడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య పాల్గొని మాట్లాడాలుతూ ఎండలు మండిపోతున్నాయి. వేసవి తీవ్రత దృష్ట్యా, బాటసారుల దాహం తీర్చడం కంటే మించిన సేవ మరొకటి లేదన్నారు . అందుకే,జనసేన పార్టీ ఆధ్వర్యంలో, మన మక్తల్ పట్టణంలోని ఈ పవిత్రమైన శ్రీ కన్యకా పరమేశ్వరి చౌరస్తా వద్ద, మణికంఠ హాస్పిటల్ సమీపంలో ఈ చలివేంద్రాన్ని ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉంది అని ఆయన అన్నారు. డాక్టర్ మణికంఠ గౌడ్ పార్టీ పరంగానే కాకుండ సామాజిక సేవలో చురుకుగా ఉంటారు ఆయనను ఈ సందర్భంగా అభినందిస్తున్నాను అని పేర్కొన్నారు. డాక్టర్ మణికంఠ గౌడ్ మాట్లాడుతూ జనసేన అంటే కేవలం రాజకీయం మాత్రమే కాదు... జనసేన అంటే ఒక సామాజిక బాధ్యత. ఈ కార్యక్రమం లో దాదాపు 100 మందికి పైగా రక్తదానం చేయడం జరిగినది తెలిపారు. కార్యక్రమం లో మక్తల్ బిజెపి నాయకులు కౌన్సిలర్ రాజశేఖర్ రెడ్డి మక్తల్ కౌన్సిలర్ పీకే నరసింహ, బూత్పూర్ మాజీ సర్పంచ్ కురువ హనుమంతు, మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గ నాయకులు తదితరులు పా

# చక్కని ఆరోగ్యం

## మండే ఎండల్లో.. పాపాయి జాగ్రత్త..!



మండే ఎండలకు పెద్దవాళ్లే తట్టుకోలేకపోతుంటారు. ఇక పసిపిల్లల సంగతి చెప్పనవసరం లేదు. ఎండ వేడికి, వడగాలులకు చిన్న పిల్లలు తాళలేరు. పైగా ఈ కాలంలో వీటితో పాటు వడదెబ్బ, చెమటకాయలు, విరేచనాలు, వాంతులు.. ఇలా రకరకాల ఆరోగ్య సమస్యలు కూడా చిన్నారుల్ని వేధిస్తుంటాయి. వీటన్నింటి నుంచి పసిపిల్లల్ని సంరక్షించడం తల్లులకు కత్తి మీద సాము వంటిదే. అయితే ఎండాకాలంలో ఎదురయ్యే ఈ వేడి తీవ్రత నుంచి బుజ్జాయిల్ని కాపాడుకోవడానికి కొన్ని మార్గాలున్నాయంటున్నారు నిపుణులు. మరి అవేంటో తెలుసుకుందాం రండి... ఈ కాలంలో వేధించే ఆరోగ్య సమస్యల్లో అతి ప్రధానమైంది చెమట. దీనివల్ల పిల్లల్లో చెమటకాయలు, దద్దుర్లు.. వంటి చర్మ సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా మెడ, చంకల కింది భాగంలో చెమట పేరుకుపోవడం వల్ల ఆ ప్రాంతాల్లో ఈ సమస్యలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి స్నానం చేయించే క్రమంలో ఆయా భాగాల్లో మరింత శుభ్రంగా కడగడం ముఖ్యం. ఆ తర్వాత మెత్తని కాటన్ వస్త్రంతో పొడిగా తుడవడం మర్చిపోకూడదు. లేదంటే ఆ భాగాల్లో తడి అలాగే ఉండిపోయి, చర్మ సంబంధిత ఇన్ఫెక్షన్లకు దారితీసే అవకాశాలున్నాయంటున్నారు నిపుణులు. బుజ్జాయిలకు ఎండాకాలంలో వదులుగా ఉండే మెత్తని కాటన్ దుస్తులు వేయడం మంచిది. ఎందుకంటే ఇవి చర్మం నుంచి వెలువడే చెమటను సులభంగా పీల్చుకోవడంతో పాటు చర్మానికి గాలి తగిలేలా చేస్తాయి. తద్వారా చెమటకాయలు రాకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే పాపాయిని బయటికి తీసుకెళ్లినప్పుడు తలకి టోపీ, చేతులు, కాళ్లు కవరయ్యేలా ఉండే పొడవాటి కాటన్ దుస్తుల్ని వేయడం మంచిదంటున్నారు నిపుణులు. వేసవిలో ఎన్ని నీళ్లు తాగినా దాహమేస్తుంటుంది. పిల్లలకు కూడా అంతే. ఆర్నెల్ల లోపు వయసున్న పిల్లలు తల్లిపాలపై ఆధారపడతారు కాబట్టి ప్రత్యేకంగా నీళ్లు తాగించాల్సిన పనిలేదు. అయితే పిల్లలకు సరిపడినన్ని పాలు పట్టడం మాత్రం మర్చిపోవద్దు. నిర్ణీత సమయానికి అనుగుణంగా పాపాయికి పాలివ్వాలి. పిల్లల్ని ఉంచే ప్రదేశం మరీ వేడిగా కాకుండా.. మరీ చల్లగా కాకుండా ఉండేలా చూసుకోవడం మంచిది. ఎందుకంటే ఈ రెండిట్లో దేనికీ పిల్లలు తట్టుకోలేరు. కాబట్టి ఇంట్లోని వేడి గాలి బయటికి పోయేలా సాయంత్రం పూట కాసేపు కిటికీలు, తలుపులు తెరచి ఉంచడం మంచిది. ఒకవేళ ఏసీ ఉపయోగిస్తున్నట్లయితే 24 నుంచి 26 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రత ఉండాలంటున్నారు నిపుణులు.

## నట్స్ మహారాణి మెకడేమియా..!

నోట్లో వేసుకుంటే కరిగిపోతూ... వెన్న రుచిని అందించే మెకడేమియాతో మహిళలకు బోలెడు ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలుసా! ఒకప్పుడు విదేశాల నుంచి దిగుమతి చేసుకునేవాళ్లం దీన్ని. ఇప్పుడు మన దేశంలోనూ పండుతున్నాయి. వీటిలో ఉండే మోనో అన్‌శాచురేటెడ్ కొవ్వులు, చెడు కొవ్వులను తగ్గించి గుండె జబ్బుల్ని దూరం చేస్తాయి. వీటిలో పీచు పదార్థాలు, ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి. ఆకలిని తగ్గించి బరువుని నియంత్రణలో ఉంచు



తాయి. ముఖ్యంగా కీటో డైట్ పాటించే వాళ్లకి ఇవి మంచి ఎంపిక. వీటిల్లో ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్లు మెండుగా ఉంటాయి. ఇవి మెదడు కణాలను రక్షించి జ్ఞాపకశక్తిని పెంచుతాయి. అంతేకాదు, ఈ గింజల్లో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని మెరిసేలా చేస్తాయి. ముడతలను దూరం చేస్తాయి. కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్ ఉన్నవాళ్లు మెకడేమియా గింజలు తీసుకుంటే మంచిది. వీటిలో ఉండే మాంగనీస్, మెగ్నీషియం, పాస్ఫరస్ ఎముకలకు బలాన్నిస్తాయి. హార్మోన్ల హెచ్చుతగ్గులను సమతౌల్యంచేస్తాయి. పీసీఓడీ, పీసీఓఎస్‌ని తగ్గించి నెలసరిని గాడిలో పడేలా చేస్తాయి.

## స్వచ్ఛంగా తాగుదాం

దేశంలో ఇప్పటికీ స్వచ్ఛమైన నీళ్లు అందని ప్రాంతాలెన్నో. ఇదే ఎన్నో అనారోగ్యాలకి కారణం. ఇంటిల్లిపాది ఆరోగ్యం కోసం ఆలోచించే మనం... సహజంగా వీటిని శుద్ధిచేసే మార్గాలపై దృష్టిపెడదామా! అలనాటి సైన్స్... మన పూర్వికులు రాగి పాత్రలను వాడటం వెనక గొప్ప ఆరోగ్య రహస్యం దాగి ఉంది. స్వచ్ఛమైన రాగికి సహజంగానే యాంటీబాక్టీరియల్ గుణాలు మెండుగా ఉంటాయి. ఇవి ఈ-కొలి, కలరా బాసిల్లస్ వంటి కొన్ని హానికరమైన బ్యాక్టీరియాలను నిర్వీర్యం చేస్తాయి.



మునగ విత్తనాలతో... నీళ్లు కలుషితమైతే... వాటిలో కొన్ని మునగ విత్తనాలనో లేదా వాటిని పొడి చేసో కలపండి. కాసేపటికి మలినాలన్నీ అడుగుకి చేరతాయి. నీరు స్వచ్ఛంగా మారుతుంది. తులసి రక్షణ... తాగే నీళ్లలో కొన్ని తులసి ఆకులను వేయండి. ఇవి నీటిని శుద్ధి చేయడమే కాదు... రోగ నిరోధక శక్తినీ పెంచుతాయి. మట్టి కుండల్లో... చల్లటి నీటికోసమే మట్టి కుండలు వాడతాం అనుకుంటారు చాలామంది. కానీ, ఇవి నీటినీ శుద్ధి చేస్తాయి. ముఖ్యంగా అందులో పీహెచ్ విలువను సమతుల్యం చేస్తాయి. మరిగించి... ఎన్ని ఆధునిక పద్ధతులు వచ్చినా, నీటిని మరిగించి చల్లార్చి... ఆపై తాగడం అనేది అత్యంత సురక్షితమైన మార్గం. సౌరశుద్ధి: ఇది డబ్ల్యూహెచ్‌వో ప్రతిపాదిత సోలార్ డిస్ఇన్ఫెక్షన్ విధానం(సోడిస్). ఇందులో భాగంగా... నీటిని పారదర్శకమైన ప్లాస్టిక్ సీసాల్లో నింపి 6-8 గంటల పాటు ఎండలో ఉంచాలి. దీనివల్ల సూర్యరశ్మిలోని యూవీ కిరణాలు కొన్నిరకాల క్రిములను నశింపజేస్తాయి. వడపోత: శుభ్రమైన కాటన్ వస్త్రంతో నీటిని వడపోయడం ద్వారా చెత్తాచెదారం, మట్టికణాలు తొలగి శుభ్రపడతాయి. ఇసుక-బొగ్గు: ఒక పాత్రలో ఇసుక, బొగ్గు, గులకరాళ్లను పొరలుగా వేసి నీళ్లను అందులో పోయాలి. ఇవి నీటిలోని మలినాలను, రసాయనాలను ఫిల్టర్ చేస్తాయి.

## ఉప్పు.. ఎక్కువగా తీసుకుంటున్నారా?

'ఉప్పు లేని కూర రుచించదు' అన్నట్లు కొన్ని వంటకాలకు ఉప్పు తగలాల్సిందే. కానీ ఉప్పు మితిమీరితే మాత్రం ఆరోగ్యానికి ముప్పు తప్పదంటున్నారు వైద్య నిపుణులు. ఉప్పు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తపోటుతో పాటు గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు వస్తాయి. మరి మోతాదుకు మించి ఉప్పు తీసుకుంటున్నారని ఎలా తెలుస్తుంది? అంటే.. కొన్ని శారీరక మార్పుల వల్ల ఆ విషయాన్ని సులభంగా గ్రహించచ్చంటున్నారు. మధుమేహం, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు.. వంటి సమస్యలు లేనప్పటికీ తరచూ మూత్ర విసర్జనకు వెళ్తున్నట్లయితే.. మోతాదుకు మించి ఉప్పు తీసుకుంటున్నారేమో చెక్ చేసుకోవాలి అంటున్నారు నిపుణులు. ముఖ్యంగా అర్ధరాత్రి వేళల్లో యూరిన్‌కి వెళుతుంటే మాత్రం ఆహారంలో ఉప్పు వాడకంపై నియంత్రణ పాటించాల్సిందే అంటున్నారు. శరీర భాగాల్లో వాపు రావడమనేది సాధారణంగా హైబీపీ బాధితుల్లో ఎక్కువగా కనిపిస్తుంది. అలాగే ఉప్పు అధికంగా తీసుకునే వారి శరీరంలో అక్కడక్కడా వాపు రావడం గమనించచ్చు. ముఖ్యంగా పాదాల్లో నీటి నిల్వ పెరిగిపోయి ఉబ్బుతాయి. ఆహారంలో ఉప్పు తగ్గిస్తే ఇలాంటి సమస్యల నుంచి క్రమంగా బయటపడచ్చంటున్నారు నిపుణులు. ఉప్పు ఎక్కువగా తీసుకుంటే నాలుకపై ఉండే రుచి మొగ్గలపై ప్రభావం చూపిస్తుందట. ఫలితంగా ఏది తిన్నా నోటికి అంతగా నచ్చవట. అలాంటివారు ఉప్పు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాల పైనే ఎక్కువగా ఆసక్తి చూపుతారని చెబుతున్నారు నిపుణులు. మోతాదుకు మించి ఉప్పును తీసుకోవడం వల్ల శరీరంలో సోడియం స్థాయులు పెరిగిపోతాయి. ఇది క్యాల్షియం స్థాయుల పైనా ప్రతికూల ప్రభావం చూపుతుందట! దీంతో ఎముకలు బలహీనమవుతాయి. ఫలితంగా తిమ్మిర్లు, నొప్పులు ఎక్కువగా వేధిస్తాయంటున్నారు నిపుణులు.



ఇలా తగ్గించుకోవచ్చు! తీసుకునే ఆహారంలో భాగంగా ఉప్పును తగ్గించుకోవాలంటే ఈ చిన్న చిన్న చిట్కాలు పాటించడం ఉత్తమం అంటున్నారు నిపుణులు. మాంసం వంటివి కొనుగోలు చేసేటప్పుడు ప్యాక్ చేసిన వాటికంటే తాజాగా కట్ చేసిన వాటినే ఎంచుకోవడం ఉత్తమం. ఎందుకంటే ప్యాక్ చేసిన వాటిలో పాడవకుండా ఉండేందుకు ఎక్కువ ఉప్పును కలుపుతుంటారు. బయట సూపర్ మార్కెట్లో మనం ఏ పదార్థం కొన్నా.. అందులో సోడియం స్థాయులు ఎంత మేర ఉన్నాయో ఫుడ్ లేబుల్ చూసి తెలుసుకోవచ్చు. కొన్ని రకాల మసాలాలు/సీజనింగ్స్‌ని ఎంచుకునే క్రమంలో సోడియం లేనివి సెలక్ట్ చేసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. బయట రెస్టరంట్లలో భోజనం చేసినా, ఆన్‌లైన్‌లో ఫుడ్ ఆర్డర్ చేసుకున్నా.. ఉప్పు తక్కువగా వాడే పదార్థాలకే ప్రాధాన్యమివ్వాలి. అంతగా కావాలనుకుంటే.. మనకోసం తయారుచేసే పదార్థాల్లో ఉప్పు తగ్గించమని కూడా చెప్పచ్చు.

## కుదుళ్లకు మసాజ్.. ఎందుకంటే?!



గోరువెచ్చని నూనెతో కుదుళ్లకు నెమ్మదిగా మర్దన చేసుకుంటుంటే ఎంత హాయిగా ఉంటుందో కదూ! అయితే దీనివల్ల కేవలం కుదుళ్లకు రక్తప్రసరణ సక్రమంగా జరగడమే కాదు.. జుట్టు ఒత్తుగానూ పెరుగుతుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మర్దన చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటో తెలుసుకుందాం రండి.. కుదుళ్ల మర్దన కోసం జొజోబా లేదా బాదం నూనె ఉపయోగించడం మంచిదంటున్నారు నిపుణులు. దీనివల్ల కుదుళ్లకు రక్తప్రసరణ సాఫీగా జరగడమే కాకుండా కురులకు పోషణ కూడా లభిస్తుంది. ఇలా తరచూ మర్దన చేయడం వల్ల జుట్టు వేగంగా ఎదిగే అవకాశం ఉంటుందట. మర్దన చేసే క్రమంలో ఎక్కువ మొత్తంలో నూనెను ఉపయోగించకూడదు. ఎందుకంటే దీనివల్ల కుదుళ్లు, ముఖం జిడ్డుగా మారి.. ఇతర సమస్యలు కొని తెచ్చుకున్నట్లవుతుందంటున్నారు నిపుణులు. మర్దన చేసే క్రమంలో స్ట్రోక్స్ సరిగా ఇవ్వకపోతే తలనొప్పి వచ్చే అవకాశం ఉంటుందట. చేతివేళ్లతో మర్దన చేసుకుంటాం కాబట్టి వాటికి గోళ్లు లేకుండా జాగ్రత్తపడాలి. లేదంటే అవి కుదుళ్లకు గీసుకుపోయే అవకాశం ఉంటుంది. నూనెతో తరచూ మర్దన చేసుకోవడం వల్ల కురులకు సహజసిద్ధమైన మెరుపు వస్తుంది. అలాగే ఒత్తుగా కూడా పెరుగుతుందంటున్నారు నిపుణులు.

## నీరసం తగ్గించే సలాడ్!

ఒంటికి కాస్త వేడి తగలగానే... తీరని దాహం, నిస్సత్తువ. వేసవిలో దాదాపు అందరిదీ ఇదే పరిస్థితి. ఇలాంటప్పుడు మీ డైట్‌లో తాజా కూరగాయలతో సలాడ్‌ను చేర్చుకోండి. ఏంటీ దీని ప్రయోజనాలు అంటారా? ఎండల తీవ్రత, వేడి,




చెమట వల్ల శరీరంలో నీరు త్వరగా ఆవిరైపోతుంది. ఇలాంటి సమయంలో క్యాబేజీ, క్యారెట్, దోసకాయ, కీరదోస, టొమాటో, క్యాప్సికం వంటి తాజా కూరగాయలతో చేసే ఈ సలాడ్ శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుతుంది పైగా వీటిలో విటమిన్ ఏ, సిల తోపాటు ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, ఖనిజాలు... వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. దీంతో రోగనిరోధకశక్తి బలపడుతుంది. చర్మమూ పొడిబారదు. అంతేకాదు, ఈ వెజిటబుల్ సలాడ్ నుంచి తక్కువ కెలొరీలు... ఎక్కువ పోషకాలు అందడం వల్ల బరువూ నియంత్రణలో ఉంటుంది. హార్మోన్ల సమతుల్యత మెరుగవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. దీన్ని ఉదయం సాయంత్రం ఎప్పుడైనా తినొచ్చు. ఈ ముక్కలపై కాస్త నిమ్మరసం, మిరియాల పొడి, చిటికెడు ఉప్పు కలిపి తింటే నోటికి రుచే కాదు... శరీరమూ రిఫ్రెష్ అవుతుంది.

## జంక్ ఫుడ్స్ మానలేకపోతున్నారా?

కొంతమందికి కడుపు నిండా ఆహారం తీసుకున్నా జంక్ ఫుడ్స్ పైకి మనసు లాగుతుంటుంది. ఈ అలవాటు దీర్ఘకాలంలో వివిధ రకాల అనారోగ్యాలకు దారితీస్తుంది. అందుకే ఇలాంటి ఆహారపు కోరికల్ని అదుపులో పెట్టుకోవాలంటే కొన్ని విషయాలు దృష్టిలో పెట్టుకోవాలంటున్నారు నిపుణులు. సాధారణంగా గర్భం ధరించిన మహిళలకు ఈ తరహా ఆహారపు కోరికలు ఎక్కువగా కలుగుతుంటాయి. అలాగే మూడ్ స్వింగ్స్, పని ఒత్తిడి, హార్మోన్ల అసమతుల్యత, పోషకాహార లోపం కూడా దీనికి కారణమవుతుంటాయి. ఇలాంటి సమయాల్లో జంక్‌ఫుడ్స్ తీసుకోవడం వల్ల శరీరంలో చెడు కొవ్వులు, క్యాలరీలు పెరిగిపోతాయి. ఇవి దీర్ఘకాలంలో ఊబకాయానికి దారితీస్తాయి. పైగా గర్భిణులు ఇలాంటి ఆహార పదార్థాలు తీసుకోవడం తల్లీబిడ్డలిద్దరికీ మంచిది కాదు. కాబట్టి ఈ ఆహారపు కోరికల్ని అదుపులో ఉంచుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. నీళ్లు తగిన మోతాదులో తీసుకోవడం వల్ల ఆహార కోరికలు నియంత్రణలో ఉంటాయంటున్నారు నిపుణులు. అదేవిధంగా శరీరం తేమను కోల్పోకుండా కూడా జాగ్రత్తపడచ్చు. బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్‌ల మధ్య ఎక్కువ గ్యాప్ ఇవ్వద్దు. తక్కువ మోతాదులో ఎక్కువసార్లు ఆహారం తినడం వల్ల చిరుతిండ్ల పైకి మనసు మళ్లకుండా జాగ్రత్తపడచ్చు. అలాగే మధ్యమధ్యలో బాదం, వాల్‌నట్స్, జీడిపప్పులు, పండ్లు.. వంటి ఆరోగ్యకరమైన స్నాక్స్ తీసుకోవాలి. ఆహారాన్ని బాగా నమిలి మింగడం వల్ల ఆహార కోరికలు తగ్గిపోయే అవకాశం ఉంటుందని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ప్రొటీన్లు కార్బోహైడ్రేట్లతో పోల్చితే ప్రొటీన్లు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి ప్రొటీన్లు పుష్కలంగా లభించే కోడి గుడ్లు, పాలు, పాల పదార్థాలు, నట్స్.. వంటివి తీసుకుంటే ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలుగుతుంది. ఇతర ఆహార పదార్థాల పైకి మనసు మళ్లే అవకాశం తక్కువగా ఉంటుందంటున్నారు నిపుణులు. వీటితో పాటు కంటి నిండా నిద్ర, ఒత్తిడిని దూరం చేసుకోవడానికి యోగా, ధ్యానం, ఇతర వ్యాయామాలు చేయడం.. వల్ల కూడా ఆహారపు కోరికల్ని అదుపు చేసుకోవచ్చంటున్నారు నిపుణులు. ఫలితంగా జంక్‌ఫుడ్స్ పైకి మనసు మళ్లకుండా జాగ్రత్తపడచ్చని సూచిస్తున్నారు.



## సన్‌స్క్రీన్ రాస్తున్నారా?

ఎండ వేడి ఎంతగా పెరిగిపోతోందో! మధ్యాహ్నం వేళ కాసేపు బయట అడుగు పెట్టామంటే చాలు ముఖం, చేతులకు ట్యాన్ ఖాయం. కాబట్టే, సన్‌స్క్రీన్ రాయడం తప్పనిసరి. అది రాసినా ట్యాన్ తప్పట్లేదా? అయితే ఈ పొరపాట్లు చేస్తున్నట్లే! సరిగానే రాస్తున్నారా? మామూలుగా మాయిశ్చరైజర్‌ని శనగ గింజ అంత పరిమాణంలో రాయాలని చెబుతారు కదా! కానీ సన్‌స్క్రీన్ విషయంలో అది సరిపోదు. రెండు వేళ్లమీద లైన్లుగా గీసుకుంటూ వెళుతూ ఆ మొత్తాన్నీ ముఖానికి పట్టించాలి అంటారు నిపుణులు. లేదా పావు స్పూను క్రీమునైనా రాయాలి. తక్కువ రాస్తే యూవీ కిరణాల ప్రభావం పడి... చర్మం నల్లబడుతుంది. ఒకసారి రాసి ఊరుకుంటాం అంటే కుదరదు. ఎండలో ఉంటే రెండు గంటలకోసారి తిరిగి రాస్తూనే ఉండాలి. అలాగే రాయగానే కాలు బయటపెడతా అన్నా కష్టమే. అది ప్రభావం చూపడానికి కనీసం పావుగంటైనా పడుతుంది. కాబట్టి, ఎండలోకి వెళ్లే పావుగంట ముందే రాయండి. ఎస్‌పీఎఫ్ ఉందా లేదా అని చూసుకుంటే సరిపోదు. కనీసం 30 ఉండాలి. అలాగే యూవీ కిరణాల నుంచి రక్షణ కావాలంటే బ్రాడ్‌స్పెక్ట్రమ్, పీఏ++ వంటివీ ఉండేలా చూసుకోవాలి. ఇంతకీ ఎలా ఎంచుకున్నారు? ఫలానా వాళ్లు బాగుంది అన్నారని మాత్రం చెప్పకండి. మీ చర్మ తత్వానికి తగ్గది ఎంచుకోవాలి. అలాగే చెమటకి పోయే అవకాశం ఉంది కాబట్టి, వాటర్ రెసిస్టెన్స్ ఉందా అన్నదీ గమనించుకోవాలి. అలాగే సువాసనలు, ఆక్సీబెంజోన్ వంటివీ ఉండొద్దు. వీటన్నింటినీ గమనించుకుని వాడండి.



## చలువ చేసే గంజి!



వేసవి కాలంలో శరీరాన్ని చల్లబరిచేందుకూ, శక్తిని ఇచ్చేందుకూ గంజిని మించిన ఔషధం లేదంటారు పెద్దలు. మరి ఇంతగా ఇందులో ఏం ప్రయోజనాలున్నాయి? అసలు దీన్ని ఎలా కాయాలి? తెలుసుకుందామా! బియ్యంతో: అన్నం ఉడికించిన తర్వాత వార్చిన నీటినే గంజిగా పిలుస్తారు. ఇది శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. ఎండ వల్ల కలిగే అలసటను తగ్గిస్తుంది. ముఖ్యంగా ఎండలో ఎక్కువగా తిరగడం వల్ల పోగొట్టుకున్న ఎలక్ట్రోలైట్స్‌ను ఇది తిరిగి సమకూరుస్తుంది. రాగులతో: రాగి పిండిని నీటిలో ఉడికించి, మజ్జిగ కలిపి తయారు చేస్తారు. రాగులకు సహజంగానే చలువ చేసే గుణం ఉంటుంది. దీన్ని గంజిగా కాయడం వల్ల ఇందులో కాల్షియం, ఐరన్ సమృద్ధిగా లభిస్తాయి. ఫలితంగా శరీర ఉష్ణోగ్రతను అదుపులో ఉంచుతుంది. వడదెబ్బ నుంచి రక్షిస్తుంది. చద్ది అన్నంతో: రాత్రి మిగిలిన అన్నంలో నీళ్లు పోసి, మరుసటి రోజు ఉదయం తీసుకుంటే ఆ అన్నం మంచి అల్పాహారంగా, ఇందులోని నీరు... అద్భుతమైన ప్రోబయాటిక్ పానీయంగా ఉపయోగపడతాయి. ఈ గంజి పేగు ఆరోగ్యానికి చాలా మంచిది. ఇది వేసవిలో వచ్చే జీర్ణ సమస్యలనూ, కడుపులో మంటనూ తగ్గిస్తుంది. సామలతో: చిరుధాన్యాల్లో ఒకటైన సామలను ఉడకబెట్టి గంజి చేస్తారు. ఇందులో పీచు పదార్థం ఎక్కువగా ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది ఉత్తమమైన డైట్. ఇది నీరసాన్ని తగ్గించి, రోజంతా ఉత్సాహంగా ఉండేలా చేస్తుంది. సజ్జలతో: చలువ చేసే సజ్జ పిండిని పులియబెట్టి అంబలిలా కాస్తారు. దీన్నే సజ్జ గంజిగానూ పిలుస్తారు. ఇది శరీరంలోని వేడిని బయటకు పంపుతుంది. తీవ్రమైన ఎండలు ఉన్నప్పుడు శరీరానికి కావాల్సిన చల్లదనాన్ని ఇచ్చేందుకు ఇది బెస్ట్ డ్రింక్.

## మెటాలో 700 ఉద్యోగులపై వేటు




ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా తన రియాలిటీ ల్యాబ్స్, సేల్స్, ఫేస్‌బుక్ విభాగాల్లోని 700 మంది ఉద్యోగులను తొలగించింది. అయితే ఈ వేటు ప్రకటనకు ముందే టాప్ ఎగ్జిక్యూటివ్‌ల కోసం రూ.8,600 కోట్ల భారీ స్టాక్ ఆప్షన్ ప్రోగ్రామ్‌ను ప్రకటించడం ఇప్పుడు టెక్ పరిశ్రమలో తీవ్ర చర్చకు దారితీసింది. ఏఐ రంగంలో పెట్టుబడులు పెంచుతున్న క్రమంలో ఈ ఏడాది సుమారు 16,000 మందిని తొలగించాలని మెటా భావిస్తోంది. మరోవైపు అత్యున్నత నైపుణ్యాలు కలిగిన కీలక అధికారులు సంస్థను వీడకుండా ఉండేందుకే వచ్చే ఐదేళ్లలో దాదాపు 921మిలియన్ డాలర్లమేర అదనపు వేతన పరిహారాన్ని కల్పించేలా ఈప్యాకేజీని రూపొందించింది.




# ప్రయివేటు బ్యాంక్‌ల్లో అంతర్గత కల్లోలాలు..




భారత ప్రయివేటు రంగ బ్యాంక్‌ల్లో అంతర్గత కల్లోలాలు పెరుగుతోన్నాయి. గతంలో మొండి బాకీలతో ఇబ్బందులు పడగా.. ఇప్పుడు పాలనపరమైన లోపాలు, నాయకత్వ పద్ధతులతపై కలహాలు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పార్ట్‌ం ఛైర్మన్ అతన్ చక్రవర్తి ఆకస్మిక రాజీనామా బ్యాంకింగ్ పరిశ్రమలో తీవ్ర చర్చకు దారి తీసింది. ఇంత కంటే ముందు ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంక్‌లో జరిగిన రూ.590 కోట్ల ప్రభుత్వ నిధుల మళ్లింపు ఉదంతం, కోటక్ మహీంద్రా బ్యాంక్‌లో మున్సిపల్ కార్పొరేషన్ నిధుల గందరగోళం, ఇండస్‌ఇండ్ బ్యాంక్‌లో అకౌంటింగ్ లోపాలు ప్రయివేటు బ్యాంకింగ్ వ్యవస్థలోని నిర్వహణ వైఫల్యాలను ఎత్తిచూపుతున్నాయి. గతంలో ఎస్ బ్యాంక్ ఎదుర్కొన్న పాలనా పరమైన సంక్షోభాన్ని ఇవి మళ్లీ గుర్తు చేస్తున్నాయి. ఇటీవల ప్రయివేటు బ్యాంక్‌ల్లో నెలకొన్న గందరగోళంతో నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ గత మూడు నెలల్లో సుమారు 9.88 శాతం పడిపోయింది. ప్రయివేటు రంగ విత్త దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి సూచీ ఏకంగా 21 శాతం క్షీణించింది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ పార్ట్ మ్ ఛైర్మన్ అతన్ చక్రవర్తి ఆకస్మిక రాజీనామా ఆ బ్యాంక్ గవర్నెన్స్‌పై ఇన్వెస్టర్లలో తీవ్ర ఆందోళన కలిగించింది. బ్యాంకులోని కొన్ని పద్ధతులు తన నైతిక విలువలకు అనుగుణంగా లేవని ఆయన పేర్కొనడం చర్చనీయాంశమైంది. దీనికి తోడు క్రెడిట్ సూయిస్ బాండ్ల అమ్మకంలో అవకతవకలకు పాల్పడ్డారనే ఆరోపణలతో కొంతమంది సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లను బ్యాంకు తొలగించింది. ఈ పరిణామాల వల్ల కేవలం వారం రోజుల్లోనే బ్యాంకు మార్కెట్ విలువ రూ.87,000 కోట్లు ఆవిరయ్యింది. ఈ విషయంలో ఆర్‌బిఐ క్లీన్ చిట్ ఇచ్చినప్పటికీ ఇన్వెస్టర్లు మాత్రం బ్యాంకు అంతర్గత క్రమశిక్షణపై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# ఇరాన్ గ్యాస్ కొనుగోలు చేసిన ఐఓసీ




పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ సరఫరాకు ఆటంకాలు ఏర్పడి, ధరలు పెరుగుతున్నందున, గతంలో ఇరాన్‌పై విధించిన ఆంక్షలను అమెరికా తాత్కాలికంగా ఎత్తివేసింది. ఈ నేపథ్యంలోనే మన ప్రభుత్వ రంగ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), దాదాపు 8 ఏళ్ల విరామం తర్వాత ఇరాన్ నుంచి గ్యాస్ (ఎల్పీజీ)ని కొనుగోలు చేసింది. దాదాపు 43,000 టన్నుల గ్యాస్‌ను బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్‌తో ఐఓసీ పంచుకోనుంది. ఇది మన దేశంలో సగం రోజు డిమాండ్‌కు మాత్రమే సరిపోతుంది. సరఫరా అంతరాయాల నేపథ్యంలో, దేశీయంగా ఇళ్లలో వినియోగించే గ్యాస్ సిలిండర్ల బుకింగ్ కాలవ్యవధిని కంపెనీలు పెంచాయి. వాణిజ్య సిలిండర్లు 50% మాత్రమే సరఫరా అవుతున్నాయి. అందువల్ల వీలైనన్ని దేశాల నుంచి గ్యాస్ దిగుమతి చేసుకునేందుకు మనదేశం ప్రయత్నిస్తోంది. డేటా ఇంటెలిజెన్స్ సంస్థ కెప్లర్ ప్రకారం.. ఐఓసీ చివరిసారిగా 2018 జూన్‌లో ఇరాన్ నుంచి ఎల్పీజీని కొనుగోలు చేసింది. ప్రస్తుతం కొనుగోలు చేసిన వాటిలో 43,000 టన్నుల బ్యూటెన్, ప్రొపేన్ ఉన్నాయి. సీ బర్డ్ అనే ఎల్పీజీ వాహక నౌక ఇరాన్ నుంచి ఈ సరకును తీసుకుని మంగళూరు పోర్టుకు చేరుకోనుంది. గ్రీన్ ఆశా, గ్రీన్ శాన్వి నౌకల సురక్షిత ప్రయాణం కోసం చర్చలు జరుగుతున్నాయి. మన దేశ ఎల్పీజీ అవసరాల్లో మూడింట రెండొంతులు దిగుమతులే తీరుస్తున్నాయి. ఇందులో 90% పశ్చిమాసియా, హర్మూజ్ జలసంధి ద్వారానే వస్తుంది. యుద్ధం వల్ల ఈ మార్గంలో ఏర్పడుతున్న అవాంతరాల వల్లే దేశీయంగా కొరత ఏర్పడింది.

# ముడి సరుకుల కొరత
# రసాయన, ఉక్కు, వస్త్ర రంగాలు కుదేలు



అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత పారిశ్రామిక రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా హార్మూజ్ జలసంధి మూసివేత కారణంగా అంతర్జాతీయ సరఫరా గొలుసులో తలెత్తిన ఆటంకాలు స్టీల్, అల్యూమినియం, టెక్సుల్, రసాయన రంగాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతున్నాయి. ముడి సరుకుల రవాణా నిలిచిపోవడం, ఎల్పిజి, పిఎన్‌జి వంటి గ్యాస్ కొరత ఏర్పడటంతో ఉత్పత్తి వ్యయం పెరగడమే కాకుండా.. కొన్ని పరిశ్రమలు తమ ఉత్పత్తి గంటలను తగ్గించుకుంటున్నాయి. యూరప్ నుండి రావాల్సిన ఫ్లాక్స్ వంటి ముడిసరుకు నిలిచిపోవడంతో ప్రముఖ టెక్సుల్ కంపెనీలు కేవలం నెల రోజులకు సరిపడా నిల్వలతోనే కాలం వెళ్లదీస్తున్నాయి. ''బెల్జియం, ఫ్రాన్స్ నుండి రావాల్సిన ముడిసరుకు ఫ్లాక్స్ కంనర్లు గత 20 రోజులుగా జెబల్ అలీ పోర్టులో చిక్కుకుపోయాయి. మా వద్ద కేవలం 30 రోజులకు సరిపడా స్టాక్ మాత్రమే ఉంది. మరో 10 రోజుల్లో సరఫరా పునరుద్ధరించకపోతే ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉంది'' అని ఒక ప్రముఖ టెక్సుల్ బ్రాండ్ ఎగ్జిక్యూటివ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి అనిశ్చితి వల్ల కంపెనీలు తమ ఉత్పత్తి గంటలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ యుద్ధం వ్యవసాయ రంగాన్ని ఒత్తిడికి గురి చేయనుందని రసాయన రంగ విశ్లేషకులు అజరు జోషి హెచ్చరించారు. ప్రపంచ సల్ఫర్ సరఫరాలో 35 శాతం పశ్చిమాసియా నుంచే వస్తుందన్నారు.. 'ఈ సరఫరా గొలుసు దెబ్బతినడం వల్ల సల్ఫ్యూరిక్ యాసిడ్ ధరలు ఏడాది కాలంలో 80 శాతం పెరిగాయి. ఇది నేరుగా డిఎపి వంటి ఎరువుల ధరలపై ప్రభావం చూపుతుంది. ఇది కేవలం వస్తువుల ధరల సమస్య మాత్రమే కాదు. దేశ ఆహార భద్రతకే ముప్పు. ఖరీఫ్ సీజన్ ముందు ఈ ధరల పెరుగుదల రైతులకు పెను సవాలుగా మారనుంది.' అని జోషి పేర్కొన్నారు. ఇంధన కొరత కూడా పారిశ్రామిక ఉత్పత్తిని దెబ్బతీస్తోంది. 'తీవ్రమైన ఎల్పిజి, పిఎన్‌జి కొరత వల్ల పరిశ్రమలు మూతపడే దిశగా వెళ్తున్నాయి. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోకపోతే ఎంఎస్ఎంఇ రంగం కుప్పకూలే ప్రమాదం ఉంది'' అని అల్యూమినియం ఎక్స్‌ట్రూషన్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (అలెమా) ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ముడి సరుకు కొరతతో గాజు సీసాల ధరలు 20 శాతం, కార్టన్ బాక్సుల ధరలు 100 శాతం పెరగడంతో మద్యం తయారీ పరిశ్రమ కూడా భారంగా మారిందని బ్రూవర్స్ అసోసియేషన్ (బిఎఐ) తెలిపింది. ఈ సంక్షోభం ఇలాగే కొనసాగితే దీర్ఘకాలంలో సామాన్య వినియోగదారులపై ధరల భారం తప్పదని స్పష్టమవుతోందని పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# డాలర్‌కు ప్రత్యామ్నాయాలపై
# చమురు కంపెనీల దృష్టి



అమెరికా సామ్రాజ్యవాదంతో పశ్చిమాసియాలో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో డాలర్‌పై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని భారత చమురు కంపెనీలు భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే రష్యా చమురు కొనుగోళ్లను ప్రత్యామ్నాయ కరెన్సీలలో చెల్లింపులను పెంచుతున్నాయని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు తెలిపారని బ్లూమ్‌బర్గ్ ఓ కథనంలో వెల్లడించింది. రష్యా విక్రేతలు కలిగి ఉన్న ఓ ప్రత్యేక విదేశీ బ్యాంకు ఖాతాలలో రూపాయలను డిపాజిట్ చేయడం ద్వారా ఈ లావాదేవీలు జరుగుతున్నాయి. ఆ తర్వాత ఆ నిధులు యూఏఈ దిర్హామ్ లేదా లేదా చైనా యువాన్‌లలోకి మార్చబడుతున్నాయి. విదేశాల్లో పరిమిత ఉనికి ఉన్న కొన్ని భారతీయ బ్యాంకులు ఈ వాణిజ్యాన్ని సులభతరం చేస్తున్నాయని సంబంధిత వ్యక్తులు తెలిపారు. దిర్హామ్, యువాన్‌తో పాటు, సింగపూర్ డాలర్, హాంకాంగ్ డాలర్‌ను కూడా కంపెనీలు పరిశీలిస్తున్నాయన్నారు. అయితే ఈ లావాదేవీలు ఆయా బ్యాంకుల సంసిద్ధతపై ఆధారపడి ఉంటాయని తెలిపారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను పెంచుకోవడానికి ఈ నెల ప్రారంభంలో అమెరికా భారత్‌కు మినహాయింపు ఇచ్చింది. అమెరికా విధానాల్లో మార్పుల వల్ల వచ్చే ముప్పును తగ్గించుకోవడానికి ప్రత్యామ్నాయ కరెన్సీలలో చెల్లింపులు కోరుతున్నాయి. దీనిపై ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పందించలేదు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల చమురు బ్యారెల్ ధర 100 డాలర్లను దాటింది. ఈ క్రమంలో భారతీయ కంపెనీలు చమురు కొనుగోళ్లను పెంచాయి. అమెరికా మినహాయింపు ఇచ్చినప్పటి నుంచి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, రిలయన్స్ ఇండిస్ట్రీస్ లిమిటెడ్ వంటి రిఫైనర్లు సుమారు 60 మిలియన్ బారెళ్ల రష్యా చమురును కొనుగోలు చేశాయి.

## ఇన్ఫోసిస్ చేతికి ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటీ, స్ట్రాటస్




అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే హెల్త్‌కేర్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కంపెనీ ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటీ, ఇన్సూరెన్స్ కన్సల్టింగ్ టెక్నాలజీ కంపెనీ స్ట్రాటస్‌లను సుమారు రూ.5,260 కోట్లతో కొనుగోలు చేయనున్నట్లు ఇన్ఫోసిస్ ప్రకటించింది. ఆప్టిమమ్ హెల్త్‌కేర్ ఐటీని 465 మిలియన్ డాలర్ల (సుమారు రూ.4,370 కోట్ల)తో ఇన్ఫోసిస్ కొనుగోలు చేయనుంది. ఇందులో ముందస్తు చెల్లింపులు, ఎర్నౌట్‌లు కలిపి ఉంటాయి. యాజమాన్య ప్రోత్సాహకాలు, నిలుపుదల బోనస్‌లు మినహాయిస్తారు. షరతులు పూర్తయిన తర్వాత, ఈ కొనుగోలు 2027 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో పూర్తికావచ్చని అంచనా. ప్రోపర్టీ అండ్ క్యాజువాల్టీ (పి అండ్ సి) టెక్నాలజీ సొల్యూషన్స్ సేవల సంస్థ స్ట్రాటస్‌ను 95 మిలియన్ డాలర్ల (సుమారు రూ.890 కోట్ల) నగదు చెల్లింపుతో కొనుగోలు చేసేందుకు ఇన్ఫోసిస్ కచ్చితమైన ఒప్పందాన్ని కుదుర్చుకుంది.




## కుర్రాళ్లు మళ్లీ కొట్టేశారు.. అండర్-19 వరల్డ్‌కప్ విజేత భారత్



అండర్-19 వన్డే ప్రపంచకప్ విజేతగా భారత జట్టు నిలిచింది. జింబాబ్వేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్ మైదానం వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత ప్లేయర్లు అదరగొట్టారు. ఎక్కడా ఇంగ్లాండ్‌కు అవకాశం ఇవ్వకుండా మ్యాచ్ ప్రారంభం నుంచే పైచేయి సాధించారు. ఇంగ్లాండ్‌పై ఏకంగా 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించారు. దీంతో ఆరోసారి టైటిల్‌ను చేజిక్కించుకుంది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుతున్న భారత్.. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. వైభవ్ సూర్యవంశీ (175) మెరుపు ఇన్నింగ్స్‌తో ప్రత్యర్థి ముందు భారీ లక్ష్యాన్ని ఉంచింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే అర్ధ శతకం(53)తో రాణించగా.. అభిజ్ఞాన్ కుందు(40), వేదాంత్ త్రివేది (32) పరుగులు చేశారు. ఇంగ్లాండ్ బౌలర్లలో జేమ్స్ మింటో 3, మోర్గాన్ 2, అలెక్స్ గ్రీన్ 2, మానీ ఒక వికెట్ తీశారు. 412 పరుగుల భారీ లక్ష్య చేధనలో క్రీజులోకి వచ్చిన ఇంగ్లాండ్ బ్యాటర్లు కూడా పర్వాలేదనిపించారు.

# అండర్-19 ప్రపంచకప్ విజేతలకు భారీ నజరానా ప్రకటించిన బిసిసిఐ



భారత అండర్-19 క్రికెట్ జట్టు ఆరోసారి ప్రపంచకప్ విజయం సాధించిన సందర్భంగా దేశవ్యాప్తంగా సంబరాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి ఛాంపియన్ జట్టుకు రూ.7.5 కోట్ల నగదు బహుమతి ప్రకటించింది. ఫిబ్రవరి 6న జింబాబ్వేలోని హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన ఫైనల్లో ఇంగ్లండ్‌పై భారత్ 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో భారత్ అజేయంగా టోర్నమెంట్ ముగించి టైటిల్ కైవసం చేసుకుంది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా జట్టు ప్రదర్శనను ప్రశంసించారు. ఒత్తిడిలోనూ యువ ఆటగాళ్లు అద్భుతంగా ఆడారని ఆయన అన్నారు. "2026 అండర్-19 ప్రపంచకప్ గెలిచిన మా జట్టుపై దేశమంతా గర్విస్తోంది. ఫైనల్లో ఇంగ్లండ్‌ను ఓడించిన తీరు, టోర్న మెంట్ మొత్తం అజేయంగా కొనసాగిన తీరు ఎంతో ప్రశంసనీయం. అందుకే జట్టుకు రూ.7.5 కోట్ల నగదు బహుమతి ఇస్తున్నాం'' అని సైకియా తెలిపారు. ఫైనల్ మ్యాచ్‌లో యువ భారత జట్టు అద్భుతమైన బ్యాటింగ్ తో విజయం వైపు అడుగులు వేసింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే నాయకత్వంలో భారత్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 411 పరుగులు చేసింది. దీంతో ఇంగ్లండ్ ముందు భారీ లక్ష్యం నిలిచింది. ఈ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుత ప్రదర్శనతో మెరిశాడు. అతను 175 పరుగులతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. కేవలం 55 బంతు ల్లోనే శతకం పూర్తి చేసి అండర్-19 ప్రపంచకప్ చరిత్రలో రెండో వేగవంతమైన సెంచరీ నమోదు చేశాడు. అంతకుముందు 32 బంతుల్లో అర్ధశతకం సాధించాడు. తర్వాత మరో 23 బంతుల్లో రెండో అర్ధశతకం పూర్తి చేసి ఇంగ్లండ్ బౌలర్లను నిరాశపరిచాడు. 412 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్ జట్టు ఆరంభం నుంచే ఒత్తిడిలో పడింది. కేలెబ్ ఫాల్కనర్ శతకం సాధించి పోరాడినా, మిగతా బ్యాట్స్‌మెన్ సహకారం అందలేదు. భారత బౌలర్లు తరచూ వికెట్లు పడగొడుతూ ఇంగ్లండ్‌ను కట్టడి చేశారు. చివరకు ఇంగ్లండ్ జట్టు 311 పరుగులకు ఆలౌ, భారత్ 100 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది.

# టీ20 వరల్డ్ కప్‌కు ముందు భారత జట్టుకు మరో షాక్




టీ20 ప్రపంచ కప్ ప్రారంభం కాక ముందు భారత జట్టుకు ఊహించని పరిణామం ఎదురైంది. సొంత గడ్డపై ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్ కప్ ఆడుతున్న టీమ్ ఇండియాను గాయాలు వెంటాడుతున్నాయి. ఇప్పటి గాయం కారణంగా యువ ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా జట్టుకు దూరమవ్వగా.. మరికొద్ది గంటల్లో మొదటి మ్యాచ్ ప్రారంభమవ్వనున్న తరుణంలో ఊహించని షాక్ ఎదురైంది. భారత జట్టులో కీలక మైన బౌలర్ జస్ప్రీత్ బుమ్రా శనివారం అమెరికాతో జరగనున్న తొలి మ్యాచ్‌కు అందుబాటులో ఉండటంపై సందిగ్ధత నెలకొంది. గత కొద్దిరోజులుగా బుమ్రా స్వల్ప అనారోగ్యం తో బాధపడుతున్నట్లు సమాచారం. దీనివల్ల ఆయన మ్యాచ్‌కు ముందు జరిగిన కీలక ప్రాక్టీస్ సెషన్‌కు కూడా గైర్హాజరు కావడంతో అభిమానుల్లో ఆందోళన మొదలైంది. ముఖ్యంగా శుక్రవారం సాయంత్రం జరిగిన ట్రీనింగ్ సెషన్‌లో బుమ్రా పాల్గొనలేదు. జ్వరం, నీరసం కారణంగా ఆయన విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. టోర్నీలో అత్యంత కీలకమైన బౌలర్ కావడంతో, రిస్క్ తీసుకోకూడదని మేనేజ్‌మెంట్ భావిస్తోంది. ఒకవేళ బుమ్రా పూర్తిస్థాయిలో కోలుకోకపోతే, అమెరికాతో జరిగే ఆరంభ మ్యాచ్‌లో ఆయన స్థానంలో మరో పేసర్‌ను బరిలోకి దించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ప్రస్తుతానికి బుమ్రా ఫిట్‌నెస్‌పై టీమ్ మేనేజ్‌మెంట్ నుండి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలో బుమ్రా లేకపోవడం భారత బౌలింగ్ విభాగాన్ని బలహీనపరిచే అవకాశం ఉంది. అయినప్పటికీ, తదుపరి మ్యాచ్‌ల నాటికి ఆయన పూర్తి ఆరోగ్యంతో తిరిగి జట్టులోకి చేరుతారని జట్టు సభ్యులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం బుమ్రా వైద్యుల పర్యవేక్షణలో ఉండగా, మ్యాచ్ ప్రారంభానికి ముందు ఆయన శారీరక స్థితిని బట్టి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అయితే ఒక వేళ బుమ్రా ఆడటం కుదరకపోతే మహ్మద్ సిరాజ్‌కు తుది జట్టులో స్థానం దక్కే అవకాశం ఉంది.

# పాకిస్తాన్ జట్టులో ముసలం..
## కెప్టెన్ సంచలన ప్రకటన

టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ కు కౌంట్ డౌన్ షురూ అయింది. రేపటి నుంచే ఈ మెగా టోర్నమెంట్ ప్రారంభం అవుతుంది. ఈ మేరకు ఇప్పటికే



టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంట్ లో పాల్గొనే జట్లన్నీ సిద్ధమయ్యాయి. అన్ని తమ తమ వేదికలకు వెళ్లిపోయాయి. రేపు సరిగ్గా ఉదయం 11 గంటలకు టోర్నమెంట్ కూడా షురూ అవుతుంది. అయితే ఇలాంటి నేపథ్యంలో పాకిస్తాన్ జట్టులో పెను ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. పాకిస్తాన్ కెప్టెన్ సల్మాన్ అలీ అఘా సంచలన ప్రకటన చేశారు. టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంట్ గెలిచేందుకు ఎవరు ఊహించని నిర్ణయాలు తీసుకోవడం చూస్తారని ప్లేయర్లకు హెచ్చరికలు జారీ చేశారు. కీలక ప్లేయర్లను కూడా పక్కన పెట్టే అవకాశాలు ఉంటాయన్నారు. టీ20 వరల్డ్ కప్ 2026 టోర్నమెంటులో పాకిస్తాన్ విజయం కోసం ఎంతకైనా ముందుకు వెళ్తామని కెప్టెన్ సల్మాన్ అలీ అఘా కీలక ప్రకటన చేశారు. పాకిస్తాన్ జట్టుకు అవసరమైన ప్లేయర్లను మాత్రమే తుది జట్టులో ఆడిస్తామన్నారు. ఒక్క మ్యాచ్ లోనే విఫలమైతే తీసేయడమేనని, అందరూ కచ్చితంగా బాగా ఆడాలంటూ హెచ్చరించారు. ఫఖర్ జమాన్, బాబర్ ఆజం లాంటి సీనియర్ క్రికెటర్లను కూడా పక్కకు పెట్టే అవకాశం ఉంటుందని వార్నింగ్ ఇచ్చారు. కేవలం జట్టుకు ఉపయోగపడే ప్లేయర్లను మాత్రమే కొనసాగిస్తామన్నారు. ఈ టోర్నమెంట్ లో ఒక్క మ్యాచ్ లోనే ఫెయిల్ అయితే తొలగించడం ఖాయం అంటూ వార్నింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో జాగ్రత్తగా సీనియర్ క్రికెటర్లు కూడా ఆడి, జట్టును బ్యాలెన్స్ చేయాలని కోరారు. ప్లేయర్ల కంటే పాకిస్తాన్ విజయమే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు కెప్టెన్ సల్మాన్ అలీ అఘా. ఇది ఇలా ఉండగా రేపటి నుంచి ఈ టోర్నమెంట్ ప్రారంభం కానున్న నేపథ్యంలో తొలి మ్యాచ్ కోసం పాకిస్తాన్ సిద్ధమైంది.

# పాకిస్థాన్ తప్పకుండా యూ టర్న్ తీసుకుంటుంది

టీ20 వరల్డ్‌కప్ 2026లో షెడ్యూల్ ప్రకారం 15న శ్రీలంకలోని కొలంబో వేదికగా భారత్, పాక్ మ్యాచ్ జరగాల్సి ఉంది. కానీ బంగ్లాదేశ్‌కు మద్దతుగా పాకిస్థాన్.. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ స్పందించాడు. పాకిస్థాన్ కచ్చితంగా యూటర్న్ తీసుకుంటుందని వివరించాడు. 'గ్రూప్ స్టేజ్‌లో మనకు ఛాలెంజ్‌లు లేవు. భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలని పాకిస్థాన్ నిర్ణయం తీసుకుంది. కానీ ఏ సమయంలోనైనా యూటర్న్ తీసుకునే అవకాశముంది. ఒకవేళ వారు యూటర్న్ తీసుకున్నా.. మనకు ఛాలెంజ్ విసరగల సామర్థ్యం వారికుందా? గత వరల్డ్ కప్‌లో భారత్, పాక్ మ్యాచ్‌లను తీసుకుంటే పాకిస్థాన్ మనల్ని ఛాలెంజ్ చేస్తుందనే పరిస్థితి కనిపించడం లేదు. ఒకసారి, రెండుసార్లు కాదు భారత్.. పాకిస్థాన్‌ను మూడుసార్లు ఆసియాకప్ 2025లో ఓడించింది. భారత్.. పాక్ ద పూర్తి ఆధిపత్యం చెలాయించింది' అని




ఇర్ఫాన్ పఠాన్ తన యూట్యూబ్ ఛానల్‌లో అన్నాడు. మరికొన్ని గంటల్లోనే టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లు ప్రారంభం కానున్నాయి. మొదటి మ్యాచ్ పాకిస్థాన్, నెదర్లాండ్ మధ్య కొలంబో వేదికగా జరగనుంది. రెండో మ్యాచ్‌లో కోల్‌కతాలోని ఈడెన్‌గార్డెన్స్‌లో వెస్టిండీస్, స్కాట్లాండ్ తలపడనున్నాయి. మూడో మ్యాచ్ భారత్, యూఎస్ఏ మధ్య ముంబయిలోని వాంఖడే స్టేడియం వేదికగా జరగనుంది.

# ఇటలీలో వింటర్ ఒలింపిక్స్
## అట్టహాసంగా ప్రారంభం




ప్రపంచ క్రీడా ప్రియులకు అదిరిపోయే శుభవార్త. ఇటలీలో 'వింటర్ ఒలింపిక్స్ 2026' ప్రారంభ వేడుకలు చాలా గ్రాండ్ గా జరిగాయి. మిలాన్‌లోని శాన్ సిరో స్టేడియంలో జరిగిన ప్రారంభ వేడుకల్లో మరియా కారీ, ఆండ్రియా బోసెల్లి వంటి అంతర్జాతీయ తారల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో పోటీలో ఉన్న దేశాల నుంచి ఆటగాళ్లందరూ ఎంట్రీ ఇచ్చారు. మొత్తం 16 క్రీడలలో ఈ పోటీలు జరగబోతున్నట్లు తెలుస్తోంది. మంచు గడ్డలపై ఈ కార్యక్రమం నిర్వహించడంతో వీటిని వింటర్ ఒలింపిక్స్ అంటారన్న సంగతి తెలిసిందే. సాధారణంగా ఒలింపిక్స్ లాగానే ఈ వింటర్ ఒలింపిక్స్ కూడా నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. ఈ నెల 22వ తేదీ వరకు ఈ వింటర్ ఒలింపిక్స్ కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలోనే ఈ క్రీడాలలో ఆల్‌ఫైన్ స్కీయింగ్, క్రాస్ కంట్రీ స్కీయింగ్ విభాగాలలో ఇండియా కూడా పోటీ పడబోతోంది. కాగా, చరిత్రలో తొలిసారిగా నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో ఏకకాలంలో అథ్లెట్ల కవాతు నిర్వహించారు.

# వుదయం సినిమా

MOVIE TIME!

## స్పైడర్ మ్యాన్ ట్రైలర్ రికార్డుల మోత



గ్లోబల్ సూపర్ హీరో స్పైడర్ మ్యాన్ క్రేజ్ ఏ స్థాయిలో ఉందో మరోసారి ప్రూవ్ అయింది. తాజాగా విడుదలైన 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే' ట్రైలర్ రికార్డుల మోత మోగిస్తోంది. విడుదలైన కొద్ది రోజుల్లోనే ఈ ట్రైలర్ ఏకంగా 1 బిలియన్ వ్యూస్ దాటి సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఈ సినిమా కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులు ఎంతగా ఎదురుచూస్తున్నారో ఈ రికార్డు స్పష్టం చేస్తోంది. డెస్టిన్ డేనియల్ క్రెట్టన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో టామ్ హాలండ్ మరోసారి స్పైడర్ మ్యాన్గా కనిపించనున్నాడు. అతనితో జోడీగా జెండయా నటిస్తుండగా, జాకబ్ బాటలన్, సాడీ సింక్, జాన్ బెర్నాల్, మార్క్ రుఫలో, మైఖేల్ మాండో తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. సోనీ పిక్చర్స్ ఎంటర్టైన్మెంట్ ఇండియా నిర్మిస్తున్న 'స్పైడర్ మ్యాన్: బ్రాండ్ న్యూ డే', 2026 జూలై 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.

## పెద్ది పెహల్వాన్

### రామ్ చరణ్ - బర్త్ డే స్పెషల్ గ్లింప్స్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఈరోజు తన పుట్టినరోజు జరుపుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన మోస్ట్ ఎవైటెడ్ పాన్ఇండియా మూవీ 'పెద్ది' మేకర్స్ బర్త్ డే, శ్రీరామ నవమిని పురస్కరించుకుని అభిమానులకు ఒక పవర్‌ఫుల్ కానుకను అందించారు. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో రూపొందుతున్న 'పెద్ది' పెహల్వాన్ గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు.

రామ్ చరణ్ ట్రాన్స్ ఫర్మేషన్ మెస్మరైజింగ్ గా ఉంది. సిక్స్‌ప్యాక్ అబ్స్, దృఢమైన కండరాలు, ఇంటెన్స్ ప్రజెన్స్‌తో నిజమైన పహిల్వాన్‌గా ఒదిగిపోయారు. రామ్ చరణ్ గదను పట్టుకొని హనుమంతుడిలా కనిపించిన సన్నివేశం అద్భుతం, శ్రీరామ నవమి ఆధ్యాత్మిక ఉత్సాహానికి సరిగ్గా సరిపోయేలా వుంది. "చూడుమే ఆటే నా పోగరు "అని చరణ్ పలికిన ఫైనల్ డైలాగ్ అదిరిపోయింది.

దర్శకుడు బుచ్చి బాబు సానా, రామ్ చరణ్‌ను మునుపెన్నడూ చూడని అవతార్‌లో చూపిస్తూ, గూస్ బంప్స్ ట్రీట్ ని అందించారు. ప్రతి ఫ్రేమ్ విజల్ వేసే ఎనర్జీతో సినిమాపై భారీ అంచనాలను పెంచుతుంది.

**'కుస్తీ అంటే బంతితో బ్యాటుకు ఎదురెళ్లే ఆట కాదురా.. ప్రాణంతో సావుకు ఎదురెళ్లే ఆట' అనే పవర్ ఫుల్ వాయిస్ తో గ్లింప్స్ మొదలౌతుంది. ఆ తర్వాత విజువల్స్ ఆడియన్స్ ని కుస్తీ పోటీలోకి తీసుకువెళ్తాయి. అక్కడ దుమ్ము, చెమట, సంకల్ప బలం ప్రతి ఫ్రేమ్‌లోనూ కట్టిపడేశాయి. కఠినమైన శిక్షణను తట్టుకుంటూ, ఇటుక గోడలను ఎక్కుతూ, ఇసుక సంచులను ఎత్తుతూ, అచంచలమైన సంకల్పంతో గదలో ప్రావీణ్యం సంపాదిస్తున్న పెద్ది పహిల్వాన్ ఎదుగుదల అద్భుతంగా వుంది.**

## సిఎంని కలిసిన లక్ష్మీ మంచు



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌పై సహకార అవకాశాల అన్వేషణ

హైదరాబాద్, తెలంగాణ టీచ్ ఫర్ చేంజ్ వ్యవస్థాపకురాలు లక్ష్మీ మంచు, తెలంగాణ గౌరవ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డిని, దేవేంద్ర విద్యాలయ డైరెక్టర్ విజయేందర్ గౌడ్‌తో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకుని, రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్" కార్యక్రమంతో సంయుక్తంగా పనిచేసే అవకాశాలపై చర్చించారు.

ఈ సమావేశంలో, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో స్థాపించబడుతున్న సమగ్ర రెసిడెన్షియల్ పాఠశాలల ద్వారా సమానమైన, నాణ్యమైన విద్య అందించే ప్రభుత్వ లక్ష్యంతో టీచ్ ఫర్ చేంజ్ లక్ష్యాలను అనుసంధానించే అంశంపై ప్రధానంగా చర్చించారు. యంగ్ ఇండియా కార్యక్రమం ఎస్ సి, ఎస్టి , బిసి మరియు మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సమగ్ర విద్యా వాతావరణాన్ని సృష్టించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ సందర్భంగా లక్ష్మీ మంచు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి టీచ్ ఫర్ చేంజ్ చేస్తున్న సేవలను వివరించారు. ముఖ్యంగా పఠనాభివృద్ధి కార్యక్రమాలు, డిజిటల్ లెర్నింగ్, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉపాధ్యాయుల సామర్థ్య పెంపు వంటి అంశాలలో సంస్థ చేస్తున్న కృషిని వెల్లడించారు. సమగ్ర పాఠశాల మోడల్‌కు విధాన పరమైన సూచనలు, ప్రణాళిక రూపకల్పన మరియు అమలు దశల్లో సహకరించేందుకు సంస్థ సిద్ధంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆధునిక సదుపాయాలు, అత్యాధునిక ప్రయోగశాలలు, సమగ్ర రెసిడెన్షియల్ వసతులతో ప్రపంచ స్థాయి విద్యాసంస్థలను స్థాపించాలనే తన దృష్టిని వివరించారు. ఈ కార్యక్రమం ఇప్పటికే పలు జిల్లాల్లో పురోగమిస్తూ, విద్యా అసమానతలను తగ్గించడంలో సామాజిక సమైక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించనుందని తెలిపారు.

టీచ్ ఫర్ చేంజ్ సంస్థ అభివృద్ధి చేసిన వినూత్న కార్యక్రమాలను యంగ్ ఇండియా కార్యక్రమంలో సమీకరించే అవకాశాలపై కూడా ఇరువైపులా చర్చ జరిగింది. ముఖ్యంగా డిజిటల్ క్లాస్‌రూమ్స్, వాలంటీర్ ఎంగేజ్‌మెంట్, ఉపాధ్యాయుల శిక్షణ వంటి రంగాల్లో భాగస్వామ్యం గురించి చర్చించారు.

ఈ సమావేశం విద్యా రంగంలో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు. తెలంగాణలో ప్రతి చిన్నారికి సమాన విద్యా అవకాశాలు కల్పించి, వారు అభివృద్ధి చెందేందుకు దోహదపడాలనే సంయుక్త లక్ష్యానికి ఇది దారితీస్తుంది.

## శ్రీమహా విష్ణు ఫస్ట్ లుక్ రిలీజ్

'సిద్ధార్థ్ రాయ్' చిత్రంలో హీరోగా అరంగేట్రం చేసి ఆకట్టుకున్న బాలనటుడు, హీరో దీపక్ సరోజ్, ఇప్పుడు హరి హరన్ గోధగాని దర్శకత్వంలో తన రెండవ చిత్రానికి సిద్ధమవుతున్నాడు. శ్రీ లక్ష్మీ నరసింహ ఆర్ట్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం. 1గా శ్రీ హరి తన్నీరు నిర్మిస్తున్న ఈ చిత్రంలో దీపక్ సరోజ్ సరసన అనైరా గుప్తా, దీప్సిక నటిస్తున్నారు.

పవిత్రమైన శ్రీరామ నవమి సందర్భంగా, చిత్ర బృందం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. 'శ్రీమహా విష్ణు' అనే టైటిల్‌తో వస్తున్న ఈ రొమాంటిక్ ఫస్ట్ లుక్, హీరో హీరోయిన్ మధ్య ఒక లవ్లీ మూమెంట్ ని ప్రజెంట్ చేస్తోంది. సున్నితమైన ఆయిల్ పెయింటింగ్ స్టయిల్ లో అందంగా డిజైన్ చేసిన ఈ పోస్టర్ అందరినీ ఆకట్టుకుంది. 'ప్రతి హృదయానికీ ఒక కథ ఉంటుంది' అనే ట్యాగ్‌లైన్ ఒక సున్నితమైన ప్రేమకథ ఉందని సూచిస్తుంది.

'శ్రీమహా విష్ణు' ప్రేమ, బాధ్యత, ఆత్మశోధన వంటి అంశాలను ప్రజెంట్ చేసే ఒక మంచి ప్రేమకథగా రూపొందించబడింది. దీపక్ సరోజ్ ఒక యువ చిత్రకారుడి పాత్రను పోషిస్తున్నాడు, ఈ పాత్ర ఎమోషనల్ డెప్త్ తో సరికొత్తగా ఉండబోతుంది.

అత్యున్నత నిర్మాణ, సాంకేతిక ప్రమాణాలతో రూపొందించబడిన ఈ చిత్రం షూటింగ్ మొత్తం పూర్తి చేసుకుంది, పోస్ట్‌ప్రొడక్షన్ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయి. ఈ చిత్రంలో ప్రముఖ నటులు నటించగా, టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు.



## ఏప్రిల్ 2న రామ గ్లింప్స్ లాంచ్



2026లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో 'రామాయణం' ఒకటి. ఇది ప్రపంచ స్థాయి ప్రమాణాలతో రూపొందుతున్న ఒక అద్భుతమైన దృశ్యకావ్యంగా రూపుదిద్దుకుంటోంది. నితేష్ తివారీ దర్శకత్వంలో, నమిత్ మల్హోత్రా నిర్మాణంలో రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ ఇతిహాసం, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ ట్యాలెంటెని ఒకచోట చేర్చి, ఒక చారిత్రాత్మక ఘట్టానికి వేదికను సిద్ధం చేస్తోంది.

ఈ ఉత్సాహాన్ని మరింత పెంచుతూ, మార్చి 27న జరుపుకున్న పవిత్రమైన 'రామ నవమి' సందర్భంగా, నిర్మాత నమిత్ మల్హోత్రా తన సోషల్ మీడియా వేదికగా ఒక పోస్ట్ చేశారు. 'రామాయణం' నిర్మాణ ప్రయాణం వెనుక ఉన్న తన వ్యక్తిగత భావాలను పంచుకుంటూనే, ఒక కీలకమైన తాజా సమాచారాన్ని రివిల్ చేశారు

**"శుభ రామ నవమి!**

ఇది మనందరికీ చెందిన కథ. మన 'రామాయణం'ను దాని నిజమైన స్ఫూర్తితో, పూర్తి స్థాయి ఘనతతో, అత్యంత చిత్తశుద్ధితో తెరపైకి తీసుకురావడానికి మేము వేసే ప్రతి అడుగుకూ అపారమైన బాధ్యత, భక్తి శ్రద్ధలే మార్గదర్శకాలుగా నిలిచాయి.

## బ్యాడ్ బాయ్ కార్తిక్

### ఏప్రిల్ 17న రిలీజ్

హీరో నాగ శౌర్య అవుట్ అండ్ అవుట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బ్యాడ్ బాయ్ కార్తిక్'తో అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మాణంలో, నూతన దర్శకుడు రామ్ దేశిన (రమేష్) దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఈ సినిమా మ్యూజిక్ ప్రమోషన్స్ ఇప్పటికే భారీ బజ్‌ను సృష్టించాయి. విడుదలైన ప్రతి పాట చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. హైవోల్టేజ్ సన్నివేశాలు మాస్ యాటిట్యూడ్‌తో నిండిన ఈ సినిమా టీజర్, చిత్రంపై ఉన్న అంచనాలను మరింత పెంచింది. వేసవిలో విడుదలయ్యే భారీ చిత్రాలలో ఒకటిగా 'బ్యాడ్ బాయ్ కార్తిక్' ఏప్రిల్ 17న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. రిలీజ్ డేట్ పోస్టర్ లో ఫైర్ బ్యాక్ డ్రాప్, ఒక చేతిలో ఆయుధం పట్టుకుని, మరో పిడికిలి బిగించి నాగ శౌర్య కనిపించడం, ఆయన వెనుక, పండుగ ఊరేగింపులలో కనిపించే భారీ అమ్మవారి విగ్రహం దర్శనమివ్వడం క్యూరియాసిటీని పెంచింది. 'బ్యాడ్ బాయ్ కార్తిక్' సినిమా థియేట్రికల్, నాన్‌థియేట్రికల్ హక్కులనుజీ స్టూడియోస్ భారీ ధరకు సొంతం చేసుకుంది. ప్రస్తుతం సినిమాల డీల్స్ కష్టంగా మారిన ఈ సమయంలో ఈ సినిమా కోసం ఇంత త్వరగా డీల్ క్లోజ్ కావడం, సినిమా కంటెంట్‌పై ఉన్న బలమైన నమ్మకాన్ని చూపిస్తోంది. జీ స్టూడియోస్ తో ఈ భాగస్వామ్యం సినిమా క్రెడిబిలిటీని పెంచడమే కాకుండా, రిలీజ్‌కు ముందే మంచి బజ్‌ను కూడా తీసుకువచ్చింది.



## చిరంజీవి రూ.10 లక్షలు స్వచ్ఛంద సంస్థలకు విరాళం



'మన శంకర వర ప్రసాద్ గారు' బ్లాక్‌బస్టర్ విజయాన్ని ఆస్వాదిస్తూ ప్రస్తుతం పలు ఆసక్తికరమైన ప్రాజెక్టులకు సిద్ధమవుతున్న మెగాస్టార్ చిరంజీవి, తన కుమారుడు, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజును ప్రత్యేకంగా జరుపుకోవాలని నిర్ణయించారు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం చేతుల మీదుగా ఎన్టీఆర్ అవార్డుతో పాటు పది లక్షల నగదు బహుమతి అందుకున్న చిరంజీవి, ఆ మొత్తాన్ని తన చిరకాల సామాజిక సంక్షేమ లక్ష్యానికి అనుగుణంగా ఉన్న ఐదు స్వచ్ఛంద సంస్థలకు విరాళంగా ఇచ్చారు.

వారి దైనందిన అవసరాలకు మద్దతుగా చిరంజీవి 'సర్వ్ ఫౌండేషన్'కు విరాళం అందించారు. "గేమ్ ఛేంజర్" షూటింగ్ సమయంలో రామ్ చరణ్‌ను కలిసిన వృద్ధులు ఆయన పుట్టినరోజును జరుపుకోవాలని ఆశపడగా, చిరంజీవి ఆ కోరికను నెరవేర్చారు. 30 మంది వృద్ధులను బ్లడ్ బ్యాంక్‌కు ఆహ్వానించి, వారికి కొత్త బట్టలు ఇచ్చి, ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని చిరంజీవి బ్లడ్ బ్యాంక్ వేదిక ఈ కార్యక్రమం జరిగింది.

దృష్టి లోపం ఉన్నవారికి సాధికారత కల్పించడంలో అవిశ్రాంతంగా కృషి చేస్తున్న 'దేవనార్ ఫౌండేషన్ ఫర్ ది బ్లైండ్'కు మద్దతు లభించగా, అనాథ పిల్లల సంరక్షణను బలోపేతం చేసేందుకు 'వాల్మీకి ఫౌండేషన్', 'నయశ్రీ ఫౌండేషన్'లకు సహాయం అందించబడింది. అత్యంత అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడంలోనే నిజమైన గొప్పతనం ఉంటుందన్న చిరంజీవి నమ్మకాన్ని ఈ ప్రతి విరాళం మరింత బలపరిచింది. క్యాన్సర్‌తో ధైర్యంగా పోరాడుతున్న ఓ చిన్నారి చికిత్సకు ప్రత్యేకంగా సహాయపడటానికి చిరంజీవి బసవతారకం ఇండోఅమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రికి విరాళం అందించారు. ఇది ఆరోగ్య సంరక్షణ పట్ల, అలాగే అత్యంత క్లిష్ట సమయాలను ఎదుర్కొంటున్న కుటుంబాల పట్ల ఆయనకున్న అచంచలమైన నిబద్ధతను చాటింది.

తన కుటుంబ వేడుకను సమాజానికి ఉపయోగపడేలా మార్చిన చిరంజీవి, పుట్టినరోజులు కేవలం ఆనందాన్ని పొందడానికి మాత్రమే కాకుండా, ఇతరులతో పంచుకునేందుకు కూడా కావాలని మరోసారి చూపించారు.



## హే బల్వంత్

### 31న జీ5లో స్ట్రీమింగ్

ఎప్పటికప్పుడు వైవిధ్యమైన కంటెంట్ తో ప్రేక్షకులను అలరిస్తోన్న ఓటీటీ ప్లాట్ ఫామ్ జీ5 నుంచి మరో సూపర్‌హిట్ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ సినిమాయే 'హే బల్‌వంత్'. ఈ కామెడీ డ్రామా మార్చి 31 నుంచి తెలుగు, తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో జీ5లో స్ట్రీమింగ్ అవుతుంది. గోపి ఆచార్య దర్శకత్వం వహించటంతో పాటు ఈ చిత్రానికి కో రైటర్‌గానూ వర్క్ చేశారు. సుహాస్, శివానీ నాగరం హీరో హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో వి.కె.నరేష్ కీలక పాత్రను పోషించారు. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్‌పై బి.నరేంద్ర రెడ్డి ఈ మూవీని నిర్మించారు. గుంటూరు నేపథ్యంలో 'హే బల్వంత్' సినిమాను రూపొందించారు. యువకుడైన కృష్ణ(సుహాస్)కు తండ్రి వ్యాపారాన్ని కొనసాగించాలనే ఆసక్తి ఉంటుంది. అయితే తన తండ్రి చేసే వ్యాపారం ఏదో తెలియటంతో తను షాకవుతాడు. అదే సమయంలో మిత్ర(శివానీ నాగరం)తో ప్రేమలో ఉంటాడు. మిత్ర ఓ ఎన్‌జీఓను నడుపుతుంటుంది. ప్రేమ, నైతిక విలువలు, తన తండ్రి రావు బాల్వంత్ చేస్సే బిజినెస్ విషయం తెలిస్తే ఏమవుతుందనే ఆలోచనల మధ్య కృష్ణ ఇరుక్కుపోతాడు. ఈ క్రమంలో వచ్చే కడుపుబ్బా నవ్వించే కామెడీ, తండ్రీ కొడుకు మధ్య అనుబంధం, అసలేం జరిగిందనే నిజానిజాలు, చివరకు ఎలాంటి నిర్ణయం తీసుకున్నారు అనేదే అసలు కథాంశంగా సినిమా రూపొందింది.



Printed, Published & Owned by SIRIKONDA MARIA, Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-7-25/5, Risalagadda,RTC X Roads, Hyderabad - 500020, Telangana.
Editor : SIRIKONDA AUGUSTIN. RNI No.: TELTEL/2000/00272. E-mail : voodayam2007@gmail.com, Cell : 9247698676. Telefax: 040-27678676.